
# నమ్మాళ్వారు

అ. శ్రీనివాస రాఘవన్



భారతీయ సాహిత్య నిర్మాతలు

TL
891.481 015 2
N 152 R
N 152 R



INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA



అట్టలోపలి వైపున అచ్చు వేసిన శిల్ప చిత్రంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు గౌతమబుద్ధుని తల్లియైన మహారాణి మాయాదేవికి వచ్చిన స్వప్నం గురించి జ్యోతిష్కులు వ్యాఖ్యానిస్తున్న దృశ్యం. ఆ దిగువ వారి వ్యాఖ్యను రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారతదేశంలో లేఖన కళ చిత్ర లేఖనంలో కనిపించే ఉదాహరణలలో ఇదే ప్రాచీనతమమైనది. నాగార్జున కొండ క్రీ. శ. 2వ శతాబ్దం. జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో.

భారతీయ సాహిత్య నిర్మాతలు

# నమ్మాళ్వారు


ఆంగ్లమూలం

అ. శ్రీనివాస రాఘవన్

తెలుగుసేత

చల్లా రాధాకృష్ణ శర్మ



సాహిత్య అకాడెమి

*Nammalvar* — Telugu translation by C. R. Sarma of A. Srinivasa Raghavan's mon... in English, Sahitya Akademi, New Delhi (

SAHITYA AKADEMI
REVISED PRICE Rs.15.00

© A. Srinivasa Raghavan
© Telugu translation: Sahitya Akademi
First Published 1987

Library IIAS, Shimla
TL 891.481 015 2 N 152 R
00117690

సాహిత్య అకాడెమీ

ప్రధాన కార్యాలయం:
రవీంద్ర భవన్, న్యూఢిల్లీ - 110 001

ప్రాంతీయ కార్యాలయాలు:

29, ఎల్డామ్స్ రోడ్, తేనాంపేట, మద్రాసు - 600 018
బ్లాక్ V-బి, రవీంద్ర స్టేడియమ్, కలకత్తా - 700 029
172, ముంబయ్ మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్, దాదర్
బొంబాయి - 400 014

TL
891.481 0152
N 152R

SAHITYA AKADEMI
REVISED PRICE Rs.15.00

Indian Institute of Advanced Study
117690.
20/12/01
SHIMLA

**Printed at Stree Seva Mandir Press, Madras - 600 093**

# మున్నుడి

నమ్మాళ్వారు ఒక ఋషిగా గౌరవించబడుతున్నాడు. అలాగే ఆయన కృతులు వేదతుల్యములుగా భావించబడుతున్నవి. రమారమి ఏడువందల సంవత్సరాలకు పూర్వం ఆయన కృతుల్ని వ్యాఖ్యానించే కృషి ప్రారంభ మయింది. తత్ఫలితంగా వ్యాఖ్యానాలు వెలిశాయి. అవి కూడా నమ్మాళ్వారు కృతులవలె ప్రసిద్ధి చెందాయి. ఆ వ్యాఖ్యాతల అభిప్రాయాలు అన్నిటినీ ఈ పుస్తకంలో వ్యక్తం చేయడం సులభం కాదు. పైగా ఆ ప్రయత్నమూ చేయలేదు. అదీకాక తమిళులు కానివారికి ఉద్దేశించబడిన యీ రచనలో ఆ విషయాదికం వివరించడం వల్ల ప్రయోజనం అంతగా ఉండదు. అందు వల్ల చాలా వేదాంత విషయాలు పరిహరించబడ్డాయి. సంగ్రహావలోకనకు ఉపకరించే అంశాలు మాత్రం పొందుపరచబడ్డాయి.

రచనలో కొంతవరకు పునరుక్తి అనివార్య మయింది. స్పష్టత కోసం అది అవసరమనిపించింది. అయినా ఎంతవరకు అవసరమో అంత వరకే అది చెప్పడం జరిగింది.

అనువాదం గురించి ఒకమాట. మూల విధేయతకీ స్వేచ్ఛకీ సంబం ధించినంతవరకు ఒక మధ్యేమార్గం అనుసరించడానికి ప్రయత్నించబడింది. కొన్ని భాగాలు (కొన్ని సందర్భాలలో కొన్ని పాదాలు) మాత్రం గ్రహించి ఉదాహరణ పూర్వకంగా అనువదించబడ్డాయి.

రచనావసరమున వ్రాతప్రతి చూసి చక్కని సలహాలు చేసిన నా మిత్రులూ తిరునెల్వేలికి చెందిన న్యాయవాదులూ అయిన శ్రీయుతులు ఎ. యన్. మకరభూషణం, కె. పక్షిరాజన్ గార్లకు నేను కృతజ్ఞుణ్ణి. వారిద్దరూ ప్రసిద్ధ తమిళ విద్వాంసులే కాక నమ్మాళ్వారు పట్ల భక్తి గౌరవాలు కలవారు. వారి సలహాలు నాకు ఉపకరించాయి. నా మిత్రుడూ తిరునెల్వేలికి చెందిన న్యాయవాది అయిన శ్రీ ఏ. కె. గోపాల పిళ్లై ఈ రచనను చదివిన తొలి తమిళేతరుడు. విమర్శనాత్మకమైన ఆయన అభిప్రాయాలు కూడా ఉపకరించాయి.

తూత్తుక్కుడి
1-10-1974

అ. శ్రీనివాస రాఘవన్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. ఆళ్వారులు | — | 9 |
| 2. నమ్మాళ్వారు జీవితం | — | 13 |
| 3. నమ్మాళ్వారు కృతులు : తిరువిరుత్తం | — | 15 |
| 4. తిరువాసిరియం | — | 27 |
| 5. పెరియ తిరువంతాది | — | 32 |
| 6. తిరువాయ్‌మొళి | — | 39 |
| 7. పరబ్రహ్మాన్వేషణ | — | 54 |
| 8. నమ్మాళ్వారు తాత్త్విక చింతన | — | 66 |
| 9. నమ్మాళ్వారు కవిత | — | 83 |

# 1. ఆళ్వారులు

క్రీ. శ. 5, 9 శతాబ్దుల మధ్య[1] తమిళనాడులో హిందూమత పునరుద్ధరణ జరిగింది. తత్ఫలితంగా ఆ ఆర్షమత వ్యాప్తికి తమిళభాష ఒక ప్రబల సాధన మనే అంశం వెల్లడయింది. ఆ ఉద్యమానికి జీవనాడి అయిన భక్తిని గురించి నలుగురికీ తెలియజేసేందుకు తమిళం బహుధా ఉపకరించింది. అంతకు పూర్వం దక్షిణాపథంలో జైన బౌద్ధ మతాలు ప్రచారంలో ఉండేవి. తన్మతానుయాయులు మత ప్రచార సాధనంగా తమిళాన్ని మలచుకున్నారు. అంతేకాక, జంట కావ్యాలైన మణిమేఖల, సిలప్పదికారముల ద్వారా వారు కావ్య భాషగా కూడా తమిళం అనువైనదని వ్యక్తం చేశారు. హిందూమతం వారిని అనుసరించింది. ఆనాటి భావతీవ్రత కొందరు భక్తులకు ప్రోత్సాహక శక్తి అయింది. పైగా మాతృభాషలో భావాన్ని వ్యక్తీకరించడం సహజంగానూ తోచింది. పునరుద్ధరించబడిన హిందూ మతం రెండు దిశల్లో పయనించింది. తరువాతి కాలంలో ఆ రెండు ఉద్యమాలు రెండు ప్రత్యేక మతాలుగా రూపొందాయి. ప్రామాణికత్వం ప్రకటించుకున్నాయి కూడా. అందువల్ల ఆ తర్వాత సిద్ధాంత పరమైన కలహాలూ జటిలమైన వాదాలూ తలెత్తాయి. ఆధ్యాత్మిక పునరుద్ధరణ జరిగే రోజులలో ఇలాంటివి సహజంగా ఏర్పడేవే. హిందూ మత వ్యాపనం జరిగిన ఆ యుగానికి చెందినవారే ఆళ్వారులూ,[2] నాయన్మారులూను. నాయన్మారులు శైవ మతాను యాయులైతే, ఆళ్వారులేమో వైష్ణవ మతానికి ప్రాతినిధ్యం వహిస్తారు.

ఆళ్వారులు పన్నిద్దరు. వాళ్లలో పదకొండు మంది భగవంతుణ్ణి స్తుతించగా, మధురకవి మాత్రం తన ఆధ్యాత్మిక గురువైన నమ్మాళ్వారుని ప్రస్తుతించాడు. వివిధ కాలాలలో ఆళ్వారులు అవతరించిన క్రమాన్ని రామానుజ సంప్రదాయానికి చెందిన వైష్ణవులు విశ్వసిస్తారు. కాని చరిత్ర పరిశోధకులీ క్రమాన్ని అంగీకరించరు. అందువల్ల ఈ అంశం వివాదాస్పదమయింది. క్రీ. పూ. 4200 - 2700 సంవత్సరాల మధ్య వారు

---

1. క్రీ. శ. 6— 10 వ శతాబ్ది పూర్వార్థం మధ్య ఈ పునరుద్ధరణ జరిగిందని కొందరు పండితులు భావిస్తున్నారు. ఈ కాలంలో జైన బౌద్ధాలు తెరమరుగుకి వెళ్లసాగాయి. కాని అవి చివరిదాకా ఆత్మరక్షణ కోసం పాకులాడాయి.
2. ఆళ్వారు అనే మాటకు 'మునిగినవాడు' అని అర్థం. అనగా భక్తిలో మునిగినవాడని అర్థం చెప్పుకోవాలి. కొన్ని శాసనాలు తెలుపుతున్నట్లుగా, పరిపాలకులకు కూడా ఈ శబ్దం వర్తిస్తుంది. అయితే అది రాజ వంశీయులకూ అభిజాత్య సంపన్నులకూ పరిమితం.

వర్ధిల్లినట్లు సంప్రదాయజ్ఞుల విశ్వాసం. కాని చారిత్రకభాషా సాహిత్య పరిశోధనల వల్ల, వారు క్రీ. శ. 5 లేక 6 - 9 శతాబ్దుల మధ్య వర్ధిల్లినట్లు తెలియవస్తున్నది.

వాళ్ల జీవిత వివరాలూ, జనన మరణాల తేదీలు కాలగతిలో కలిసి పోయాయి. కాని కొన్ని లేఖనాలలో వాళ్లు జన్మించిన నెలలూ నక్షత్రాలు ఉదాహరించబడ్డాయి. జన్మక్రమం పురస్కరించుకొని నమ్మాళ్వారు అయిదవ ఆళ్వారని వైష్ణవ సంప్రదాయజ్ఞులు భావిస్తున్నారు. కాని మహత్తు విషయంలో ఆయనదే అగ్రతాంబూలం. అందువల్ల 'కులపతి'గా[3] కీర్తించబడుతున్నాడు. నమ్మాళ్వారు దేహమనీ, ఇతర ఆళ్వార్లు వివిధాంగములనీ భావించబడుతున్నది. పైగా జీవుల్ని రక్షించే నిమిత్తం భగవంతుడితో మధ్యవర్తిత్వం నెరపు తున్నట్లుగా భావించి ఆయన్ని ఆరాధిస్తున్నారు. వైష్ణవలోకం ఆయన్ని ఎంతగానో గౌరవిస్తున్నది. ఆయన నమ్మాళ్వారుగా (మన ఆళ్వారుగా) వ్యవహృతు డవుతున్నాడు.

సంస్కృతమూ తమిళమూ సమ్మిశ్రితమైన మణిప్రవాళ శైలిలో నమ్మాళ్వారు కృతులను గురించి బృహత్ వ్యాఖ్యానాలు సంతరించబడ్డాయి. ఆయన రచనల్ని శ్రీ రామానుజులవారి[4] వేదాంతధోరణితో ముడిపెట్టడానికి పండితులు ప్రయత్నించారు. ఈ వ్యాఖ్యానాలు పాండితీప్రకర్షకూ తాత్త్వికవిచారానికి నికషోపలాలు. నమ్మాళ్వారులో ద్యోతకమయ్యే మానవతనూ కవితావాణినీ వారు గుర్తించక పోలేదు. వ్యాఖ్యాతల దృష్టి ప్రధానంగా వేదాంతం మీద కేంద్రీకృతమైనా, రసహృదయులు ఈర్ష్య చెందేలా వాళ్ల నమ్మాళ్వారులోని కవితాసౌందర్యాన్ని వ్యక్తీకరించారు. ఏమైనప్పటికీ, వాళ్ల ప్రధానలక్ష్యం వేదాంత పరమైనదే.

నమ్మాళ్వారు ఋషి అనే అభిప్రాయంతో వాళ్ళు వ్యాఖ్యానం ప్రారంభించారు. వాళ్ల దృష్టిలో ఆయన జన్మతః జీవన్ముక్తుడు; అంతేకాని బ్రహ్మ పదార్థం కోసం తపించే సాధకుడు కాదు. ఏదో భగవదంశకు ఆయన అవతార మన్నారు. భగవంతుడికి ముఖ్య అతిథేయుడైన సేనై ముదలియారుకి అపరావతారమని పేర్కొన్నారు. ఆయన సాక్షాత్ భగవదవతారమే అని పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని కనక అంగీకరించినట్లయితే,

3. జీవన్ముక్తుల కుటుంబానికి పెద్ద.

4. శ్రీరామానుజులవారి తదనంతరం - అనగా 12వ శతాబ్ది ఉత్తరార్థం లోనూ 13వ శతాబ్దిలోనూ - నమ్మాళ్వారు గతించిన మూడు శతాబ్దులకు తర్వాత - ఈ వ్యాఖ్యానాలు సంతరించ బడ్డాయి. ఒక వ్యాఖ్యానం మాత్రం రామానుజుల జీవితకాలంలోనే వ్రాయబడింది.

నమ్మాళ్వారు కృతులలో కనిపించే ఆయన తపన, బాధ మొదలైనవి వింతగా కనిపిస్తాయి. పుట్టుకతోనే ఆయన జీవన్ముక్తుడైతే, తాను అవతారమెత్తిన కారణం కనక ఆయనకి కరతలామలకమై వుంటే, ఎందుకు గాను ఆయన అంత తపన, బాధ అనుభవించినట్టు? ఆయన భగవంతుడితో సంబంధం ఏర్పరుచుకున్నా, మానవ జన్మ ద్వారా సంక్రమించే బాధను ఐచ్ఛికంగా అనుభవించాడనీ ముక్తి లభించేందుకు తోడ్పడే వివిధ పథాలలో పయనించాడనీ, ఇదంతా లోకం కోసమనీ, లోకులు తనను అనుసరించే నిమిత్తం ఆయన అలా సంచరించాడనీ కొందరు చెపుతారు. పరబ్రహ్మ సాక్షాత్కారం కోసం జీవుడుపడే తపన నమ్మాళ్వారు కృతులలో గోచరిస్తుంది. భగవదాజ్ఞకు కట్టుబడి మానవజన్మ ఎత్తిన ఒక ఋషి అనుభవ పూర్వకంగా వీటిని గుర్తించవలసి వుంటుంది. ఆ అనుభవాలన్నీ మానవుడివే అయినా, ఆయనవి కావు. ఈ దృష్టితో చూస్తే, నమ్మాళ్వారు కృతులన్నీ పరబ్రహ్మ సాక్షాత్కారం కోసం జీవుని వేదనను చిత్రీకరించే దృశ్యకావ్యాలుగా భావించవచ్చు.

ఇది నిజం కావచ్చు. దృశ్యకావ్యములనీ, కల్పిత అనుభవాలనీ నమ్మాళ్వారు కృతులలో కానవచ్చే భావతీవ్రతను కొట్టి పారవేయలేము. నమ్మాళ్వారు జీవితం సత్యమైనదనీ, ఆయనకది అర్థమైనదనీ భావించవచ్చు. ఆయన మానవజన్మ కొంతకాలం అంతరాయంగా ఉన్నప్పటికీ, బ్రహ్మ సాక్షాత్కారానికి ప్రతిబంధకం మాత్రం కాలేదు. ఈవిధంగా కనక మనం భావించగలిగితే, ఆయన కృతులలో కనిపించే ఆశానిరాశలు, జయాపజయాలు మొదలైనవన్నీ ఆయనవే అనిపిస్తాయి. వీటిని అధిగమించి ఒక వ్యక్తి చివరికి పరబ్రహ్మంలో విలీనం కావడాన్ని దర్శించవచ్చు. భగవదాజ్ఞను సహర్షంగా పాటించే ఒక ఉపకరణంగా ఆయన దర్శనమిస్తాడు. ఇలా నమ్మాళ్వారు కృతుల్నీ పరిశీలించడం ఆయన ఋషిత్వాన్ని కించపరచడం కాదు. మానవుడు ఋషిగా పరిణతి చెందే తీరునీ, మానవుడికి సంక్రమించే సత్యతత్వాన్నీ గ్రహించినట్లవుతుంది. ఇక్కడే నమ్మాళ్వారు గొప్పతనం కొట్టవచ్చినట్లు అవగత మవుతుంది. ఆయన ఋషిత్వానికే కాక విధిప్రేరితమైన మానవత్వానికే ఆయన కృతులు నిదర్శనంగా ఉన్నాయి. నమ్మాళ్వారు భక్తిభావం నేలను వదిలి నింగిని చేరిన మాట వాస్తవమే. కాని అది యిక్కడినుంచే బయలుదేరింది. మానవ భాష[5] ద్వారానే అది

5. 'వేదాంతపరమైన జ్ఞానాన్ని సముపార్జించే సందర్భంలోనూ భూమిని పుట్టిన మానవుడికి భూమి ప్రోత్సాహక శక్తిగా ఉంటుంది. భౌతికంగా మానవుడు సుస్థిరుడై ఉన్నప్పుడే, వేదాంత విజ్ఞానాన్ని పరిపూర్ణంగా సాధించవచ్చు; ఆ విజ్ఞానాన్ని అందుకోవచ్చు కూడా. భూమియే అతనికి ఆధారభూతమవుతుంది. అని ఉపనిషత్తు ఘోషిస్తున్నది -' శ్రీ అరవిందులు.

అభివ్యక్త మయింది. దీన్ని కాదనడం నమ్మాళ్వారు గీతాల ద్వారా తన ఆవేదనను వ్యక్తపరచిన విషయాని విస్మరించినట్లవుతుంది. పౌరాణిక ప్రతీకకు, తాత్త్వికచింతనకు నాటకీయత కల్పించడం కోసం సాంకేతికత చూపించబడింది. ఈ అంశాన్ని వివరించే ప్రయత్నమే యీ పుస్తకం.

# 2. నమ్మాళ్వారు జీవితం

ఇతర ఆళ్వారుల వలె, నమ్మాళ్వారు జీవితం గురించీ తెలుసుకోవ డానికి ప్రధానాధారాలు సంస్కృతంలో ఉన్న దివ్య సూరి చరితం, మణి ప్రవాళ శైలిలో వ్రాయబడిన గురుపరంపరాప్రభావం అనే రెండు గ్రంథాలు. శ్రీ రామానుజులవారి సమకాలికుడైన గరుడవాహన పండితుడు తొలి గ్రంథం రచయిత. రెండో దానికి కర్త పిన్పళరం పెరుమాళ్ జీయరు. ఇవికాక[1] నమ్మాళ్వారు జీవితాన్ని అభివర్ణించే రచనలు మరికొన్ని ఉన్నాయి. ప్రధానాంశాలలో భేదం లేకపోయినా, కొన్ని వివరాలలో మాత్రం ఇవి భేదిస్తున్నాయి. రామానుజ వైష్ణవ సంప్రదాయం ప్రకారం వాడుకలో ఉన్న నమ్మాళ్వారు జీవితాన్ని ఇలా చెప్పుకోవచ్చు.

శఠగోపుడు, పరాంకుశుడు, నమ్మాళ్వార్ మొదలైన పేర్లతో వ్యవ హృతు డవుతున్న మారన్ సేనై ముదలియార్ అపరావ తారంగా జన్మించాడు. తండ్రిపేరు కరియర్. ఆయన తిరునెల్వేలి జిల్లాలోని తామ్రపర్ణినదీ తీరాన గల తిరుక్కురుగూర్ వాస్తవ్యుడు. తిరుక్కురు గూరులోని ఆదినాథుని ఆలయానికి దగ్గరలో ఉన్న చింతచెట్టు (ఆదిశేషుని అవతారం) కింద అన్నపానీయాలు లేక మారన్ జీవితంలోని మొదటి పదహారు సంవత్సరాలు గడిపాడు. సదా ధ్యాన నిమగ్నుడై ఉండేవాడు. తరువాతి కాలంలో ఆయన శిష్యుడైన మధురకవి ప్రశ్నించినపుడే ఆయన తొలిసారి కళ్లు తెరచి మాట్లాడాడు. 'మృతునిలో (శరీరం) ఉత్పన్నమైనది (ఆత్మ) దేన్ని గ్రహిస్తుంది? ఎక్కడుంటుంది?' అని మధురకవి ప్రశ్నిం చాడు. 'అది మృతుడినే గ్రహిస్తుంది; అతనినే ఆశ్రయిస్తుంది' అని నమ్మాళ్వార్ సమాధానం ఇచ్చాడు.

ఈ సంఘటనకు తర్వాత కూడా, నమ్మాళ్వారు ఆ చింతచెట్టుని వదల లేదు. గీతాలు ఆలపిస్తూ అక్కడే కాలం గడిపాడు. నూటెనిమిది దివ్య క్షేత్రాలలో వేంచేసి వున్న దివ్యమూర్తులు తిరుక్కురుగూరికి వచ్చి ఆయనకి దర్శన మిచ్చినట్లు చెపుతారు. ప్రస్తుతం ఆయన పేరున వ్యవహృత మవు తున్న నాలుగు కృతులూ చెప్పిన తర్వాత, జీవితాంతమూ నిరీక్షిస్తున్న ఆ దేవదేవుని పాదపద్మాలలో ఆయన లీన మయ్యాడు.

---

1. ఇతర రచనలు; శ్రీమణవాళమాముని వ్రాసిన ఉపదేశ రత్నమాలై, శ్రీవేదాంత దేశికుల దేశిక ప్రబంధం, శ్రీ బ్రహ్మ తంత్ర స్వతంత్ర జీయరు వెలయించిన గురు పరంపరా ప్రభావం (మూడువేలు), శ్రీ అనంతాచార్య వ్రాసిన ప్రపన్నామృతం, శ్రీ కందాడై అప్పన్ రచించిన పెరియ తిరుముడి అడైవు, శ్రీరంగ దేవాలయ చరిత్రను అభివర్ణించే కోయిల్ ఒళుగు మొదలైనవి.

ఈ సంగ్రహ వృత్తాంతం నుంచి నమ్మాళ్వారు ఐహిక జీవితానికి సంబంధించిన వివరాలు మనకు తెలియరావడం లేదని చెప్పవచ్చు. ఆయన గతించిన కొన్ని శతాబ్దుల— సుమారు నల్భై శతాబ్దుల — అనంతరం సంస్కృతంలోని వృత్తాంతం వ్రాయబడింది. అది వేదాంత పరమైన రచన అనడం నిర్వివాదం. ఆ వృత్తాంతం వ్రాయబడేనాటికి దక్షిణభారతంలోని వైష్ణవుల దృష్టిలో ఆయన ఋషి అయ్యాడు. మాటమాత్రంతో మానవుడికి భగవత్సాన్నిధ్య స్థితిని కల్పించగల గొప్ప ఋషిగా ఆయన వినుతి కెక్కాడు.

ఆధునిక జీవిత చరిత్రగాని చారిత్రక పరిశోధనగాని నిర్ధరించగల నమ్మాళ్వారు జీవిత వివరాలు తెరమరుగున పడిపోయాయి. వాటిని కాలం కబళించివేసింది. ప్రకృతం 'మిగిలిందల్లా దివ్య సూరిచరితము, గురుపరం పరా ప్రభావములలోని ఆదర్శాత్మకమైన వృత్తాంతమే. ఆధునిక జీవిత చరిత్రకారుల కిది నచ్చకపోయినా, ఆయన ఆంతరిక జీవితానికీ నమ్మాళ్వారు స్వయంగా తన గీతాలలో చెప్పుకొన్నదానికీ సన్నిహితంగా ఉంది. బహుకాలం ఆయన మౌనం పాటించడం, ఐహిక విషయాలకు సుదూరంగా ఉండడం – ఇవి నమ్మాళ్వారుకి సంబంధించిన సాంప్రదాయిక వృత్తాంతాల లోని ప్రముఖ విషయాలు. ఇవి ప్రపంచ మంతట కనిపించే ఆధ్యాత్మిక వాదుల అనుభవానికి అనుగుణంగా ఉన్నాయి. అంతర్ముఖుడై భగవద న్వేషణలో ఆయన జీవితంలోని తొలి సంవత్సరాలు గడిచినట్లు మనం భావించవచ్చు. ఇందుకు కావలసిన నిశ్చలధ్యానం ఆయనకి ఉగ్గుతోనే అలవడింది. ఇక్కడే ఆయన జీవితంలోని అద్భుత విషయం కాన వస్తుంది. ఈ అంతర్ముఖత్వంలోంచి బయట పడగానే, ఆయన అంతిమ స్థితిని చేరుకోగలిగాడు. ఈ అంశమే కాక, భగవత్సాక్షాత్కారానికి ఆయన చేసిన యాత్రలోని వివిధ ఘట్టములూ ఆయన గీతాలలో సూచితాలు. ఐహిక బంధాలకు దూరం కావడం, పరబ్రహ్మం కోసం అన్వేషణ ప్రారంభించడం, త్రోవలో చీకట్లు అలుముకోవడం, హఠాత్తుగా అవి తొలగడం మళ్లీ అలుముకోవడం, సాధకుడు క్షోభ చెందడం, చివరికి బ్రహ్మానంద భరితుడు కావడం మొదలైన ఘట్టాలు ఆ యాత్రలోని అంతర్భాగాలే.

'నిస్సీమ మైన నీరధి నుండి వచ్చినది
వచ్చిన చోటికే తిరిగి వెడలును.'

తన జీవితంలోని తొలి షోడశ వత్సరాలకు తర్వాతనే నమ్మాళ్వారు భాషించాడు. ఈ మౌనకాలంలో బ్రహ్మసాక్షాత్కారం కోసం ఆయన తపించిపోయినట్లు మనం భావిస్తే, ఆయన కృతులలోని కొన్ని భాగాలు కొత్త అనుభవాన్ని పునఃస్మృతి పథానికి తెచ్చుకోవడం వంటివని పరిగణించ వచ్చు. అనగా, వర్డ్సువర్త్ పదబంధాన్ని మార్చి, అనుభవాన్ని బ్రహ్మ సాక్షాత్కారపు ప్రశాంతతలో గుర్తు చేసుకోవడమని భావించాలి.

# 3. నమ్మాళ్వారు కృతులు: తిరువిరుత్తం

నమ్మాళ్వారు కృతులు నాలుగు. ఇవి —

1. తిరువిరుత్తం (తిరు విరుత్తం)
2. తిరువాసిరియం (తిరు ఆసిరియం)
3. పెరియ తిరువంతాది (పెరియ తిరు అంతాది)
4. తిరువాయ్‌మొళి (తిరు వాయ్ మొళి)

ఈ నాలుగు కృతులలోని తిరు అనే ఉపసర్గకు మంగళకరమైన, శ్రీప్రదమైన, దివ్యమైన అని అర్థాలు. విరుత్తం, ఆసిరయం అన్నవి ఛందోభేదాలు. కాగా, ఏ ఛందస్సులో వ్రాయబడినదో, ఆ ఛందస్సు పేరే తొలి రెండు కృతులకు ఉంచబడింది. పెరియ తిరు అంతాదిలోని పెరియ అనగా మహా లేక గొప్ప అని అర్థం. తొలి పద్యంలోని చివ్వరి మాటతో గాని చివ్వరి అక్షరంతో గాని ఆ తరువాతి పద్యాన్ని ప్రారంభించే రచనకు అంతాది అంటారు. తిరు వాయ్ మొళిలోని వాయ్‌మొళికి చెప్పబడినది అని అర్థం. తిరువాయ్ మొళి అనగా దివ్యవాక్కు అని అర్థం.

## తిరువిరుత్తం

నూరు పద్యాల రచన తిరు విరుత్తం. ప్రతి పద్యంలోను నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతి పద్యమూ 'కట్టళై కలిత్తురై' అనే ఛందోభేదానికి చెందింది. పాదానికి ఐదేసి గణాలు. నాలుగు పాదాలలోను ఆది ప్రాస పాటించబడింది. ఛందోభేదాన్ని సూచించడమే కాక, విరుత్తం సందేశం లేక సంఘటన అనే అర్థాలనూ సూచిస్తుంది. భగవంతుని పట్ల నమ్మాళ్వారు ప్రదర్శించిన మధుర భక్తిని విన్నపం ద్వారా తిరు విరుత్తం అభివ్యక్తం చేస్తున్నట్లు భావించబడుతున్నది.

ఈ విషయాన్ని మొదటి పద్యం తెలియజేస్తున్నది.

'అజ్ఞానము నుండి అపమార్గము నుండి
మలిన దేహము నుండి జన్మల నుండి
మమ్ము రక్షింపగా
మాకు ప్రాణదాతవై
దేవాధిదేవా !
అవతరించితివి నీవు పెక్కు యోనులయందు.
అవధరింపుము మా విన్నపము.'[1]

---

1. తిరువిరుత్తం : 1

ఒక నాటక సన్నివేశంగా ఈ పద్యం మలచబడడంవల్ల, ఇందులో మనం పాత్రని దర్శించవచ్చు. భగవంతుని పట్ల ప్రదర్శితమయ్యే ప్రేమను ఈ నాటకంలో స్త్రీ పురుషుల మధ్య నెలకొన్న ప్రేమగా అభివర్ణించబడింది. ఈ ప్రతీకను చేపట్టడం మానవుడికి సహజం. అందువల్ల తనను ప్రేమగల ప్రేయసిగా, భగవంతుణ్ణి పరిపూర్ణమైన ప్రేమ గల ప్రియునిగా భావించుకోవడం జరిగింది. ఈ కృతిలోని పెక్కు పద్యాలలో మధురభక్తి ద్వారా నమ్మాళ్వారు భగవంతుని కోసం పడే తపన అభివ్యక్తమవుతుంది.

'గరుడ వాహనుని చక్రధరుని
తులసిమాలలు దాల్చువానిని
చేరగా వెడలితివి ఒంటరిగా -
హృదయమా !
మరల నన్ను చేరెదవా, లేక
నీడలా వెన్నంటి తిరుగుచు
ఆశ్చర్యమున మునిగి చూచెదవా
లక్ష్మిని భూదేవిని ఆ రాధను.'

నారాయణుని నుంచి వేరుపరచరాని యీ ముగ్గురినీ సూచించడం వల్ల, నమ్మాళ్వారు కూడా భగవంతునికి అతి సన్నిహితంగా ఉండాలనే తన వాంఛను సూచిస్తున్నాడు.

హేమంతం వచ్చింది. నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్మాయి. అది హేమంత మేనా ?

'జడివాన కురియుచు కదిలే అ మబ్బులు
గగనమున పోరాడు కృష్ణ వృషభములా ?
హింసింపగా నన్ను హేమంతము వచ్చెనా ?
అవనిలా శ్యామల వర్ణ భూషితము
అతి శీతలము సుమ సుందరము
ఈ హేమంతము !
వియోగ బాధను కెలుకు చున్నది
క్రూరాత్మయై.'[3]

---

2. తిరువిరుత్తం: రాధకు తమిళ సంప్రదాయంలో నప్పిన్నై అని వ్యవహారం. కృష్ణావతారంలో ఆమె దేవుని ప్రేమను పొందింది.

3. పైదే : 7 అది నిజంగా హేమంతం కాదని చెలి ఓదారుస్తున్నట్లుగా ఈ పద్యానికి అర్థం చెప్పవచ్చునని కొందరి అభిప్రాయం.

ధోరణి మారింది. తన ప్రియుని శ్యామల వర్ణం మేఘాలకు ఎలా వచ్చిందా అని ప్రేయసి ఆశ్చర్యంలో మునిగిపోయింది :

'మేఘములారా ! చెప్పుడు -
వెన్నుని స్ఫురింప జేయు
యోగ శక్తి మీ కెట్లు కలిగెను !
ప్రాణి కోటిని కావగా
ఘన వృష్టిని భరించి
అటు నిటు సంచరించి
తపస్సు చేయు శక్తిని
అతని కరుణను పొందితిరా ?'[4]

దగ్గరలో ఉన్న సరోవరంలోని కలువల్ని చూడగానే, ఈ ప్రశ్నే మళ్లీ ఉదయించింది, ప్రేయసిలో.

'నా విభుని నీల వర్ణము
ఈ కలువల కెట్లు కలిగెను ?
అటవినీ నేలనూ వీడి
నీటను నిష్ఠమై నిలిచి
తపము చేయుట వల్లనా ?'[5]

అనురాగం అగల మయింది. ఎటు చూసినా, తన ప్రియుని నయన వైభవమే దృగ్గోచర మయింది.

నల్లని కొండ నెన్నుదుటను
పుండరీక సరస్సుల వలె
గోచరించు నెటు చూచినా
అతని నయన సౌందర్యమే.
సజ్జనులకు దివ్యులకు
సాగర పరివేష్టిత క్షోణికి
నాథుడు నా విభుడు !
అతని చక్షువు లతి మనోహరములు !'[6]

అతని నయనాలు పాదాలూ చేతులూ—అన్నీ పద్మాలే;[7] పద్మాలు తప్ప తదితరములు కావు—అని ఆమె చాటుతోంది.

---

4. తిరువిరుత్తం : 32.
5. పైదే : 38.
6. పైదే : 39.
7. పైదే : 43.

అంతలోనే ఆమెకు సందేహం. అతని సౌందర్యాన్ని అసమర్థురాలైన తాను మాటలో వర్ణించ గలదా?

'అతని కోమల శ్యామల వర్ణము
గ్రహించు వారెవరు గలరు?
మింటినే కాదు
దేవలోకమును సైతము
అధిగమించు భావుకులును
గ్రహింప గలవారె ?'[8]

ఎవరికీ అలవికాదనే ఆమె చివరికి నిర్ణయించింది. తన ప్రియుని అనంతత్వాన్ని తలుచుకుని పారవశ్యం చెందింది. తన అసమర్థతను గుర్తు చేసుకుని పరితపించింది.

'అభివర్ణింప గల వారెవ్వరు
అతని రంగు రూపులు, అంద చందములు ?
కాని భాషింప దొడగుదురు
జ్ఞాన, ధర్మ మార్గాను వర్తులు
అవి తాము తెలిసికొన్నట్లు.
ఎంత దవ్వేగినా
ఎంత సాధించినా
అతని దివ్య జ్యోతిని
కొంత గ్రహింతురేమో !
ఎన్నటికైనా సాధింతురే
నా విభుని మహత్తును ?'[9]

జ్ఞాన, ధర్మాల వల్ల గాక కేవలం ప్రేమ వల్లనే భగవత్ సాక్షాత్కారం పొందవచ్చునన్నది పిండితార్థం.

ఆమె ప్రేమిస్తున్నది. ప్రియుడే దగ్గరకి రాడు. ఏకాంతం వల్ల కలిగే బాధ ఎక్కువవుతున్నది. పడమర నల్లబారింది. చంద్రుడు ఉదయించాడు. రాత్రి మారుతం బయలుదేరింది.

'రాత్రి సమయ మది
పాలబుగ్గల పసివాడు బాలచంద్రుడు
నడుముకు చుట్టుకొనెను.

8. పైదే : 43.
9. పైదే ; 44.

పశ్చిమదిశాంగన పలవించెను
భానుడు తొలగినందుకు.
తులసిమీది గాఢానురక్తితో
అతడిచ్చినదానిని గ్రహింపగా
వీచెను చల్లని మారుతము
వెదకుచు ప్రతి తావును.'10

అయితే వీస్తున్న మారుతం చల్లగా లేదనీ, క్రూరంగా ఉన్నదనీ దహించి వేస్తున్నదనీ ప్రేయసి చెపుతోంది. అది కనిపించదు. దాని ఆకృతీ కనిపించదు. దాని అడుగుల్నీ పరికించలేము. నిందను వ్యాపింపజేస్తూ తనను సదా బాధిస్తూ అది సంచరిస్తోంది.[11]

చీకటి బాగా అలుముకుంది. తనను హతమార్చేందుకు కాబోలు రాత్రి ఒక యుగమవుతోంది.[12] చంద్రుడు పైకి వచ్చాడు. తనను కాపాడేందుకూ, చీకటిని చీల్చేందుకూ అతను వచ్చాడా ![13] కావచ్చు. కాని చంద్రుడు కూడా తనను దహించివేస్తున్నాడు.

తోపులోని అన్రిల్ (క్రౌంచం) పక్షి విలాపం, ఒడ్డుని కోస్తూ పొచ్చుకు వచ్చే సముద్రుని ఘోష రాత్రి అంతా ఆమెను బాధిస్తూనే ఉన్నాయి.[14] తాను ధరించిన శంఖం గాజుల్ని విసర్జించమని సముద్ర ఘోషలోని అంతరార్థమా ? దేవదేవుడు సముద్రాన్ని మథించినప్పుడు బహిర్గతమైన అమృతాన్ని తాను పొందలేకున్నానని ఆమె బాధపడుతోంది.[15] తెల్లవారింది. భానూదయ మయింది. ప్రియుడు ఎట్టఎదుట ఉన్నట్లుగా ఆమె ఊహించింది. తన బాధ, దుర్దశ తొలగిపోయినట్లు భావించి సంతోషించింది.[16] ఆ భావన ఒక్క క్షణకాలం మాత్రమే. వియోగభారంతో ఆమె క్రుంగిపోయింది. అతని సన్నిధిని ఎప్పుడు చేరుకుంటాను ? అని ప్రశ్నించుకుంది. ఆమె యింకా తన బాధను ఇలా వ్యక్తం చేస్తుంది :

---

10. తిరువిరుత్తం: 35. అతనిని ప్రేమించే సామర్థ్యం భగవద్దత్త మయింది. ఈ శక్తిని కూడా లేకుండా చేసేందుకు మారుతం యత్నిస్తున్నదా ? అని కొందరు ఈ పాశురానికి అర్థం చెపుతారు
11. పైదే : 41.
12. పైదే : 70.
13. పైదే : 72.
14. పైదే : 87.
15. పైదే : 51
16. పైదే : 88.

'అసురుల సంహరించిన
ఓ చక్రాయుధుడా !
ఎటుల కలిగెనో యీ మానవజన్మ
అచ్చెరు వగుచున్నది నాకు !
ఎవరైనా ఎరుగుదురా
దీనికై నేను చేసిన దీర్ఘతపస్సు ?
మానవజన్మ మెత్తిన నేను
నీ దాసురాలిని.
నిన్ను చేరుకొందు ననుకొంటి.
అటుల జరగలేదు
ఈ నిరీక్షణయు చావలేదు.[17]

అయినా ఆమె నమ్మకం అచంచల మయింది. ఆమె మనస్సు అతనినే తప్ప మరెవ్వరినీ ఆశ్రయించలేదు.[18] కాని ఆ పేద మనసు తన యిష్టం వచ్చినట్లు ప్రవర్తించింది. ఆమెను వంచించింది :

'మాయమర్మము లెరుగదనీ నాదనీ
నమ్మితిని నా హృదయమును.
అతని వెంట పంపితిని
నేటి దాకా తిరిగి రాలేదు.
ఇచ్చవచ్చిన రీతి
తిరుగుచున్నది అదుపు లేక.
నే నెరుగ దాని గతిని.'[19]

తన హృదయం వెనకాలే హంసల్నీ కొంగల్నీ ఆమె పంపింది :

'ఎటకో ఎగురుచుపోయే
హంసలారా ! కొంగలారా !
మరువవద్దు నా మనవిని.
అరుగుడు తొలుత వైకుంఠమునకు
అచట నా హృదయమున్నచో
నన్ను గుర్తు చేయుడు.
అతనిని దర్శించెనేమో అడుగుడు

17. తిరువిరుత్తం : 90.
18. పైదే : 91.
19. పైదే : 46.

దర్శింపకున్న
జాగు చేయదగునా అని అడుగుడు.'[20]

ఆ విహంగాలు మౌనం వహించాయి. ఆమె దృష్టి మేఘాల వైపు మరలింది. అవి తనకు సహాయం చేస్తాయని అభిలషించింది.

'మెరుపుల వెలుగులతో
మెరిసే మేఘములారా!
స్వర్ణ రత్న ప్రభలతో వెలిగే
వేంకటాద్రికి పయనమయ్యారా?
విభునికి నా సందేశము
విన్నవించెదరా?
విన్నవింపమని బదులు వచ్చెను.
నా అవనత శిరస్సుపై
మీ పాదములుంచుడని
నేను ప్రార్థింపగ
అవి అంగీకరించునా!'[21]

ఈ కృతిలోని పెక్కు పాశురాలలో నమ్మాళ్వారు తనకు భగవంతుని యందుగల భక్తిభావమును వ్యక్తీకరించాడు. ప్రేయసిగా అభివర్ణితమైన స్త్రీ నమ్మాళ్వారే.

ఈ కృతిలోని నాటకంలో మరికొన్ని పాత్రలు కూడా ఉన్నాయి కాని నమ్మాళ్వారు ఇదమిత్థమని చెప్పకపోయినా, ఆయా సందర్భాలను బట్టి ఆ పాత్రలేమిటో తెలియవస్తాయి. ప్రధాన పాత్ర ప్రేయసియే; ఆమె నాయిక. నాయిక ప్రియసఖి, ఆమె తల్లి, పెంపుడు తల్లి, ప్రియుడు, అతని సఖుడు, నాయికనెవరో ఆవేశించినట్టు భావించినప్పుడు సోదె చెప్పిన స్త్రీ — మొదలైన వారు ఇతర పాత్రలు. నాయిక పట్ల సహానుభూతి ప్రదర్శించుట, ఆమెకు ధైర్యము చెప్పుట ప్రియసఖి చేయవలసిన పనులు. ఇక ఆమె మాటలు విందాము:

'కారు మబ్బు వంటి విభుని
అచంచలమౌ ఆజ్ఞ నేడు
చలించె హఠాత్తుగా.
లేకున్న

20. తిరువిరుత్తం : 30.
21. పైదే : 31

117690.

ఏల క్రక్కుచున్నవి నిప్పులు
ఈ సహజ శీతల పవనములు ?
ఏల కార్చుచున్నవి కన్నీరు
విభుని తులసి మాలల నభిలషించు
నా సఖి విశాల నేత్రములు?'[22]

తన స్నేహితురాలి దురవస్థను ఆమె చూడలేక పోయింది. ఆమె ప్రియుడు తన యెదుట ఉన్నట్లుగా భావించుకుని, నాయిక సఖి ఇలా నిందోక్తులాడింది :

ఆమె అబల యని పరికింపక
ఘోషించుచున్నది నీల జలధి.
అగ్గల మగుచున్నది ఆమె బాధ.
నీ కటాక్ష వీక్షణ మొక్కటే
ఆమెను రక్షింప గలదు.
నీల మేఘ శ్యాముడా !
శేష శయనుడా !
నీ కిది తగునా
ఇంకను జాగు చేయుట ?'[23]

ప్రియుని మహత్తును నాయికకు ఆమె తెలియజేసింది. అతని అనంతమైన అనుగ్రహ విశేషాన్ని వివరించింది. ఆ అనుగ్రహమే నాయికను రక్షించ గలదని చెప్పింది.

'జనన మరణ దుఃఖాలు తప్పించు కొనగ
ధ్యానింతురు ఋషు లతనిని
తపస్సమాధిలో నిమగ్నులై.
అతని నెరుగరు దేవతలు సైతము.
అనంతు డతడు !
వలదు సంశయము
అతని లీలలు మహాద్భుతములు.
ఈ భువి నవతరించి
వెన్న దొంగగా నింద మోయడా ?'[24]

22. తిరువిరుత్తం: 5.
23. పైదే: 62.
24. పైదే: 98. ఈ సన్నివేశం కృష్ణావతారానికి సంబంధించింది.

ఇంత చిన్నతనంలోనే ఆమె ఎందుకిలా ఈ ప్రణయ భావానికి లోనయింది? ఈ వింత ప్రణయం చూసి లోకులు ఏమనుకుంటారు? అని నాయిక పెంపుడు తల్లి అనుకుంది.

'కుచములా యింకను పొంగలేదు
మృదువైన నల్లని కురులా హ్రస్వములు
చీర యేమో నడుమున నిలువదు
శిశువు వోలె అవ్యక్త భాషణములు
చలిత నేత్రాలలో కాంతు లొలుకు.
వల్లె వేయ దగునా
ఈ చిన్న వయసున
''వేంకటాద్రి విభుని వాస స్థానమా'' అనుచు'.[25]

తన కుమార్తె అతనితో కూడి అతని పట్టణానికి వెళ్లినందుకు నాయిక తల్లి చాలా బాధ పడింది. మార్గ మధ్యంలోని ఎడారిలో తిరిగే క్రూరాత్ములైన మనుషుల వల్లనూ వారి భేరీ నినాదాల వల్లనూ కుమార్తె ఎంతగా బాధపడిందో అనుకుంది.[26]

ఇలా తల్లి అనుకోవడం వింతగా ఉంది. ఎందుకంటే నాయిక యిలాంటి సంఘటన కోసమే ఎదురు చూస్తోంది. కాని ఆ సంఘటన మాత్రం జరగలేదని తరువాతి పద్యాలవల్ల విదిత మవుతున్నది. ఒకవేళ ఆ సంఘటనే కనుక జరిగివుంటే, కావ్యంలో తరువాత వచ్చే సోదెగత్తె కోసం కబురు పంపడం, ఆమెను సంప్రదించడం మొదలైనవాటికి ఆస్కారం ఉండదు. నాయిక పరిస్థితిని సోదెగత్తె పరిశీలించింది. దేవాధిదేవుని యందు ఆమె బద్ధానురాగయై ఉందనీ, అందుకు అతడు ధరించే తులసియే తగిన ఔషధమనీ ఆమె చెప్పింది. తులసిమాల ధరించడమో, లేదా కొన్ని తులసి ఆకులు దగ్గర వుంచుకోవడమో, కనీసం తులసి కొమ్మనైనా చెంత ఉంచుకోవడమో యిందుకు పరిహారమని సోదెగత్తె వివరించింది.[27]

కృతిలో నాయకుడు ప్రత్యక్షం అయినట్లు చెప్పడమూ ఒక అద్భుతమే. అతడు కావ్యాంతంలో ఒక పాశురంలో మాత్రం కనిపిస్తాడు.[28] నాయిక ముందు సాక్షాత్కరించాడు. ఆ ఒక పద్యంలోనూ ప్రేయసీ

---

25. తిరువిరుత్తం: 60.
26. పైదే: 37.
27. పైదే; 53.
28. పైదే: 26. ఇది ఆళ్వారు ఒక క్షణకాలంపాటు పొందిన అనుభవమని వ్యాఖ్యానించవచ్చు.

ప్రియులు ఎడారిని దాటేటప్పుడు, ఎడారి ప్రాంతం చూసి భయపడవద్దనీ, తన నివాసం అనతి దూరంలోనే ఉందనీ అతడు నాయికకు ధైర్యం చెప్తాడు. తన ప్రేయసి తనకోసం ఎదురు తెన్నులు చూస్తున్నదనీ, కనకరథాన్ని వేగంగా నడపమనీ ప్రియుడు రథచోదకునితో చెప్పినట్లుగా ఇంకొక పద్యంలో ఉంది.[29] తాను వేటాడుతున్న ఏనుగు ఆదోవను వచ్చిందా అని కనుక్కొనే మిషతో అతడు తన ప్రేయసి ప్రియసఖి ముందు ప్రత్యక్ష మైనట్లు, ఆమెను కొన్ని ప్రశ్నలు వేసినట్లు ఒక పద్యంలో ఉంది.[30] తన ప్రేయసి కురుల సువాసనను మించిన సువాసన మరెక్కడైనా కలదా అని పువ్వుల్ని అతడు అడిగినట్లుగా మరో పద్యంలో పేర్కొనబడింది.[31] సముద్రం వలె సువిశాలమైన నల్లని నయనాలు తన ప్రేయసికి కలవనీ, ఆ నయన రామణీయకాన్ని చూసినట్లయితే తానామె ప్రేమవలలో పడినందుకు తనను ఎవ్వరు తప్పుపట్టరనీ అతడు తన సఖునితో చెప్పినట్లుగా మరో పద్యంలో ఉంది.[32] అపుడా సఖుడు నాయికను తన కళ్లారా చూసివస్తాడు. ఆమెను చూడక ముందు తన మిత్రుని ప్రేమ సహేతుకం కాదనుకున్నాననీ, యిప్పుడా భావం తొలగిపోయిందనీ అతనికి విన్నవిస్తాడు.[33]

ఈ విషయాదికం పరిశీలిస్తే, మొదట్లో సరళంగా ఉన్న మధురభక్తి భావం జటిలంగా గజిబిజిగా తయారయిందని పేర్కొనవచ్చు. ఇతర పాత్రలు కల్పించడం వల్లనూ, వాళ్లకోసం సన్నివేశాలు కల్పించడం వల్లనూ ఈ జటిలత ఏర్పడింది. తమిళ సాహిత్య విద్యార్థులకు ఈ వివిధ విష యాలూ సంగకాలపు కవిత్వం అనుసరించి చెప్పబడినవిగా స్ఫురిస్తాయి. కాని మధుర భక్తిలోని రమణీయ భావానికి భంగం ఏర్పడింది.

కావ్యాంతంలో, నమ్మాళ్వారే యీ ప్రతీకను విసర్జించినట్లు ద్యోతక మవుతుంది.

---

29. తిరువిరుత్తం : 50. భగవంతునికి ప్రతిరూపుడైన ప్రియుడు 'వెంకటాద్రి మీద నీప్రియుడున్నా' డని చెప్పడం వింతగా ఉంది. అయితే ఈ మాటలు పలికినవాడు భగవంతుడు కాడా ?

30. పైదే : 22

31. పైదే : 55.

32. పైదే : 57.

33. పైదే : 94. ఈ పద్యం నాయిక చెప్పినట్లుగా కొందరు వ్యాఖ్యాతలు భావించారు. ప్రియుడి విషయం ఆళ్వారుకి తెలియదనీ, తాను చెప్పినదంతా వినికిడిపై ఆధారపడిందనీ వారు అర్థం చెపుతారు.

'ప్రతి యుగము నందును
పుట్టుట మరల గిట్టుట
గిట్టుట మరల పుట్టుట -
దీనిని తిలకించు వారు
పరిహసింతురు గాదె
ఈ ఫలములేమిని చూచి.
దీనిని తుదముట్టింపగా
మూలకారణ మెవ్వడో
అతనిని సేవింప దలతురు
భక్తి భావముతో.
అతడు దేవతలకును సంసేవ్యుడు
వారి కెటుల కునుకు పట్టును ?'[34]

ఈ ప్రతీకను విసర్జించి, ఆళ్వారు భగవంతుని తన తల్లిగా తండ్రిగా భావిస్తున్నాడు.

'దేహమును చొచ్చి
అందులో ఇమిడీ ఇమడ లేక
అవస్థ పడును ఆత్మ.
అందువలన
తల్లియు తండ్రియు
మోక్షప్రదాతయు అయిన
ఆతనిని ధ్యానింతును
ఆలస్యము చేయక.'[35]

వివిధమతములూ పూజావిధానాలూ భగవంతుని సృష్టి అనీ, దేవతలందరూ భగవంతుని ఆకృతులనీ ఆళ్వారు భావించినప్పుడు కూడా ఈ మధుర భక్తిభావాన్ని విసర్జించినట్లు చెప్పవచ్చు.[36] కాని యీ ప్రతీకను కలగా పులగంగా అభివర్ణించడం, ప్రతీక హద్దులుదాటి దానిని చిత్రించడం, ఇతర ప్రతీకలు చొప్పించడం, ఉన్నట్టుండి ప్రతీకలను విసర్జించడం, ప్రత్యక్షంగా భగవంతుణ్ణి సంబోధించడం — ఇవన్నీ సాధారణంగా ఆధ్యాత్మిక కవితలో కానవచ్చే లక్షణాలే. తిరువిరుత్తంలోనూ ఇవి గోచరిస్తాయి. ఆదర్శ ప్రణయ చిత్రీకరణలో సంగకాలపు తమిళ కవులు వాడుకచేసిన సన్నివేశా

34. తిరువిరుత్తం : 97.
35. పైదే : 95.
36. పైదే : 96.

లను స్వీకరించి నమ్మాళ్వారు వాటిని మధుర భక్తిపరంగా అభివర్ణించి వుండవచ్చునని పేర్కొనవచ్చు.[37] ఒక్కొక్కసారి భక్తిభావం ఆసన్నివేశాలను అధిగమించింది. కొన్ని సందర్భాలలో ఆసన్నివేశాలు స్వీయానుభవాన్ని ప్రతీకల ద్వారా అభివర్ణించడంలో ప్రతిబంధకములైనాయి. కాని అది నిజమైన ఆధ్యాత్మిక కవితాలక్షణం! బుద్ధి కుశలుడైన కవి ప్రతీక ద్వారా పయోజనాన్ని సహేతుకమేమో అన్నంతగా సాధించగలుగుతాడు. అయితే జలాలుద్దీన్ రూమీ పేర్కొన్నట్లుగా; 'హేతువు భగవంతుని ఛాయ భగవంతుడేమో సూర్యుడు. బుద్ధి కుశలత కేవలం అభిప్రాయం. ఆశ్చర్యం సహజ జ్ఞానం.'[38] తిరువిరుత్తం సహజజ్ఞాన విలసిత కావ్యం.

---

37. ఎప్పుడు, ఎలా నమ్మాళ్వారు సంగకాలపు ప్రణయ కవిత్వ సంప్రదాయాల పరిచయం పొందాడో సరిగా తెలియ రావడం లేదు. అలాగే వేదోపనిషత్తుల పరిచయం కూడా ఎలా పొందాడో తెలియడం లేదు.
38. పారశీక ఆధ్యాత్మిక వేత్త ఈయన. ఆల్డస్ హక్స్లీ తన ది పెరెన్నియల్ ఫిలాసఫీ (యఫ్. బి. కాలిన్స్ - లండన్, పు 149)లో ఈ వాక్యాలు ఉదాహరించాడు.

# 4. తిరువాసిరియం

తిరువాసిరియం 7 పాశురములూ, 71 పాదాలు గల లఘు కృతి. మొదటి పాశురంలో 15, రెండవ మూడవ నాలుగవ ఏడవ పాశురాలలో 9 చొప్పున, అయిదవ అరవ పాశురాలలో 10 చొప్పున పాదాలున్నాయి.

ఆదిశేషునిపై శయనించిన నారాయణుని వైభవాన్ని మొదటి 15 పాదాలూ అభివర్ణిస్తున్నాయి.

'అరుణ మేఘ మాచ్ఛాదించిన
మరకతమయ పర్వత మనగా,
జ్వలించు సూర్యుని, శీతల చంద్రుని
చుక్కలను శిరసున దాల్చి
విసపు పడగలు క్రిందికి వంచి
సాగర తరంగాల నిలిచిన
ఆదిశేషునిపై
శయనించిన వాడా!
కెంపు పెదవులు పద్మనయనాలు కలిగి
స్వర్ణ దుకూలము ధరించి
మకుట భూషలు దాల్చిన వాడా!
అంజలి బద్ధులై శివ బ్రహ్మేంద్రులు
సర్వ దేవతలును పూజించు
పద్మనాభుడా!
పాదములచే జగత్రయిని కొలిచిన
జగన్నాయకుడా!'[1]

ఐహిక సుఖాల మీది కోరికతో విజ్ఞులైనవారు భగవంతుని మీది భక్తి భావాన్ని విసర్జించరనే విషయాన్ని ఆ భగవంతునికి నివేదిస్తున్నట్టుగా తరువాతి తొమ్మిది పాదాలలో చెప్పబడింది.

'విశ్వమును సృష్టించిన విభుడా!
సర్వ భువనముల లోగొనిన వాడా!
త్వదీయ భక్తి సంజనితమౌ
మకరంద మధుర భావమును వీడి
భవదీయ మంజీర పాద యుగళిని

---

1. 1 - 15 పాదాలు.

అనంద పారవశ్యమున తిలకించుట మాని
సంచరింతురే
విమల లోచనులు విబుధులు ?
వారట్లు సంచరింపరు.
ఐహిక సుఖముల చవి చూచువారు
అర్రులు చాతురు వాటికోసము.
అనంత శక్తియో ముజ్జగముల సిరులో
స్వర్లోక సౌఖ్యమో మోక్షమో
కాంక్షింపరు బుధులు
నీ దర్శన మాధుర్యాభి లాషతో.'[2]

నారాయణుడు కావించిన క్షీర సాగర మథన వృత్తాంతం ఆ తరువాతి పాదాలలో అభివర్ణితం. నిరంతరం అతని భక్తుల్ని సేవించే మహాభాగ్యం తనకు ప్రసాదించమని నమ్మాళ్వారు అర్థించాడు.

'అతడు
త్రిమూర్తులలో పరముడు,
సర్వలోక వంద్యుడు సత్య నిరతుడు
వేద సమ్మతుడు జ్యోతిర్మయుడు.
శేషుని రజ్జువుగా ఒనరించి
కొండను కవ్వముగా కావించి
సాగరము నతడు మథించె.
అల్ల కల్లోల మయ్యె అర్ణవము
కొండలా అలలు పై పైకి లేచె
పర్వతములు భయమున చలించె.
అతని భక్తుల సేవించు భాగ్యము
మా కతడు కరుణించు గాక
అవధిలేని కాలము దాక
ఆటంకములు కలిగింపక !'[3]

నాలుగవ పాశురంలో సృష్టికర్తా, సర్వ వస్తువులకు స్థితికీ మూలా కారణుడూ అయిన ఆ జగన్నాథుని సేవించవలెననే నమ్మాళ్వారు తపన వ్యక్తీకరించబడింది.

---

2. తిరువాసిరియం : 16–24 పాదాలు.
3. తిరువాసిరియం : 25 – 33 పాదాలు.

'నిరంతరము నిర్విఘ్నముగా
జయోస్తు జయోస్తనుచు
అతనిని సేవించు భాగ్యము
కలుగునా మాకు ?
విశ్వమో ప్రాణులో లేనపుడు
పెంజీకటి అలుముకొన్నప్పుడు
మూలమునకే మూలకారణుడు
ఆ అనంతుడు
ఆ పద్మనాభుడు
సృష్టించె చతుర్ముఖ బ్రహ్మను
శివాది సకల దేవతలను.
ఎల్లలోకముల నధిగమించిన
ఆతని దివ్య పాదములను
అర్చించు మహా భాగ్యము
అనయము కలుగునా మాకు ?'[4]

త్రివిక్రమావతారం గురించి అయిదో పాశురంలో చెప్పబడింది. రెండడుగులతో భూమ్యాకాశములనూ సకల లోకములనూ అతడు కొలిచాడు. ఈ ప్రపంచం ఇంకెవరిని సేవిస్తుంది? అనే ప్రశ్నతో పాశురం అంతమవుతుంది.

'తలక్రిందులు చేసిన ముకుళ మనగ
ఒక అడుగు
ఆక్రమించెను అవని నంతటిని
పృథివి పుష్పమై తోచె.
మరొక అడుగు
ఆక్రమించెను గగనమును.
బ్రహ్మాది దేవత లెల్లరు
సంభ్రమ చిత్తులై సేవించిరి.
పద్మనయనుడై బింబాధరుడై
సహస్ర మకుట ధారియై
సహస్ర సూర్య చంద్రుల ప్రభలతో
సహస్ర బాహు కల్పకములతో[5]

4. తిరువాసిరియం : 34 - 42 పాదాలు.
5. కోరిన వస్తువులు ప్రసాదించే దేవవృక్షం.

శత పత్రమున నిలిచె ఆదిదేవుడు.
మరెవ్వరి కొలుచు నీ జగతి
ఆ పరబ్రహ్మమును గాక ?'[6]

ఈ ప్రపంచం అవివేకంలో మునిగి, ఇంద్రియ సుఖాలకు లోనై సృష్టి స్థితులకు కారకుడైన ఆతనిపట్ల విముఖత్వం వహిస్తున్న విషయం ఆ తరువాతి పాశురంలో చెప్పబడింది.

'అహో ! ఏమి లోకమిది !
కన్నతల్లి చెంత నుండగా
అభిషేకించుచున్నది కొయ్యను.
సృష్టించిన జగముల నతడు
లోగొని వెలికి ఉమిసె.
స్థితికారకుడతడు, సర్వజ్ఞు డతడు
మూలకారణ మాతడు.
అతనిని కాదని
అంధకారమున క్రుగ్గి సంతసించుచు
అధర్మ కార్యాచరణ మొనర్చు
ఇంద్రియ వాంఛలకు చిక్కి
ఆ తిమిరమున పొర్లాడుచు
ఇతర దైవతముల సేవింతురు.
అహో ! ఏమి లోకమిది !'[7]

సకల లోకములూ దేవతలూ సర్వమూ అతనిలో లీనమయ్యే ఆ ప్రళయ కాలాన్ని కావ్యంలోని కడపటిభాగం అభివర్ణిస్తుంది.

'జటను చంద్రుని దాల్చినవాడు
చతుర్ముఖ బ్రహ్మ
దేవనాయకుడు
భూమి జలములు, అనల వాయువులు
రవిచంద్ర సహిత గగనము
సర్వ భువనములు సకల ప్రాణులు
అతనిలో లీనము కాగా
వాటిని తనలోనే ఇముడ్చుకొని
వటపత్ర శాయియై వెలుగొందు

---

6. తిరువాసిరియం : 43 - 52 పాదాలు.
7. పైదే : 53 - 62 పాదాలు.

ఆ మాయగానిని గాక
అ్యనదైవముల గొలుతుమే మేము ?'[8]

లఘుకృతి అయినా, ఇందులో నమ్మాళ్వారు భావుకత, పౌరాణిక గాథల ప్రగాఢ పరిచయం, మాయాతీతుడైన ఆ నారాయణుని యందు అచంచల విశ్వాసం మొదలైనవి ప్రతిఫలిస్తున్నాయి.

8. తిరువాసిరియం : 63 - 71 పాదాలు.

# 5. పెరియ తిరువంతాది

ఎనభై యేడు 'వెణ్బా' పద్యాలు (పాశురాలు) చోటు చేసుకున్న కావ్యం పెరియ తిరువంతాది. ప్రతి పద్యంలోనూ నాలుగు పాదాలు. ఈ కావ్యం పెరియ తిరువంతాదిగా ఎందుకు వ్యవహృత మవుతున్నదో, ఆ విషయం పూర్వోదాహృతం.

పాశురానికీ పాశురానికీ మధ్యగల సహేతుకమైన సంబంధాన్ని నిర్ణయించ ప్రయత్నించడం కష్టతరమే కాక నిష్ప్రయోజనం కూడా. కాని వేదాంతులు అలాంటి ప్రయత్నం చేశారు. మణితుల్యమైన ప్రతిపాశురమును ప్రత్యేక గీతంగా భావించడం సముచితం. నమ్మాళ్వారు మానసిక స్థితిని పాశురాలలో దర్శించవచ్చు. భక్తి సూత్రం చేత వాటిని బంధించవచ్చు. ఆ భక్తి సాధనలో ఆయన పడిన కష్టాలు, పొందిన జయాపజయాలు అభివ్యక్తము లవుతాయి.

ఈ కావ్యంలోని చాలా పాశురాలు నమ్మాళ్వారు తన హృదయాన్ని సంబోధిస్తూ చెప్పినవే. కొన్ని యిక్కడ ఉదాహరించబడినవి. వీటిలో ఆయన వివిధ మానసికావస్థల్ని దర్శించవచ్చు. ఇద్దరమూ కలిసి దైవ స్తుతి చేద్దామని ఆయన హృదయాన్ని ఆహ్వానిస్తూ చెప్పిందే మొదటి పాశురం.

'హృదయమా !
నీ భారమున నీవే క్రుంగెద వెందుకు ?
నా కన్నను ముందుగా
ఎందుకు పరుగులు తీసెదవు ?
రమ్ము, నను చేర రమ్ము.
ఇంచుక తాళుము.
కయ[1] పూలరంగున వరలు వానిని
మృదుమధురోక్తులతో
నుతింతము మన మిద్దరము.'[2]

దైవసాన్నిధ్యము చేరవలయుననే తన దురాశను ఆళ్వారు ఇలా భావించుకున్నాడు :

'అష్ట వసవులు
ఏకాదశ రుద్రులు

---

1. ముదురునీలం రంగుపూలు.
2. పెరియ తిరువంతాది : 1.

ద్వాదశ సూర్యులు
కొలుచు నాతని ముందు
మన మెంతటి వారము ?
అతనిని చేర నాశించుట
ఎంత పాపమో !
గ్రహించితివా హృదయమా
మన దురాశ ఎంతటిదో !'[3]

అవిధేయమైన తన హృదయాన్ని తలచుకొని ఆళ్వారు పరితపిస్తున్నాడు :

'వ్యథలలోకి బాధలలోకి
నన్ను నిరతము త్రోయువారెవరు ?
నా హృదయమా, నీవే !
నీకు హితవు చెప్పి లాభమేమి కలదు ?
అవిధేయవు, ముక్కోపివి నీవు !
నా మాటను పెడ చెవిని పెట్టెదవు.
రమ్మ రమ్మ
అతని పాదముల నుతింతము
అదియెపో మన కర్తవ్యము.'[4]

దైవస్తుతి, ఎంత దుర్బలంగా వున్నా, అతని అనంతత్వానికి భంగం వాటిల్లదని ఆళ్వారు తన హృదయాన్ని ఉత్సాహపరిచాడు :

'హృదయమా !
మొదట ఇది తెలిసికొనుము.
తరంగములు పాదముల ముద్దిడగా
సాగరమున అతడు శయనించును
నిమీలిత నేత్రుడై.
నీ బాధల నెల్ల పోద్రోలి
మాటి మాటికి అతనిని స్తుతింపుము.
తలచితివా ఎప్పుడైనా
మన దుర్బల వాక్కు లతని మహత్తుని తగ్గించవని.' [5]

3. పెరియ తిరువంతాది : 10.
4. పైదే : 12.
5. పైదే : 15.

అది కపటమే అయినా సరే, భగవత్ప్రశంస చేయమని తన హృదయాన్ని ఆళ్వారు ఉద్బోధిస్తున్నాడు :

'హృదయమా !
తడయగా జనదు ఒక క్షణమైనా.
ఆ మాయాతీతుని
నీవు నుతింపక పోవచ్చు
పరిహసింపగ వచ్చు.
తులసి మాలలు దాల్చు నాతనిని
దండించెను ఒక గోప వనిత.
అదియు నీకు అనుమానమే.
అది నీ పాపము !'[6]

దైవానుగ్రహం తనకు సంప్రాప్తం కానందుకు ఆళ్వారు పరితపించాడు :

'గోవర్ధనగిరి నెత్తి
కాచినావు నోరులేని పశువులను.[7]
ఏల నా యందు ప్రసన్నుడు కాడు
ఏల నా ముందు సాక్షాత్కరింపడు
ప్రతి నిత్య మతనికై పరితపించినను ?
మేము నిలిచిన భూమి
మరీ నిట్ట నిలువా, హృదయమా !
అతని కరుణ మము చేరదు.'[8]

మానవ లోకం మధురమనీ, దేవలోకం ఇంకా మధురమనీ ఆళ్వారు పేర్కొన్నాడు :

'మధురము మైత్రీ కాలము
మధురము వంశ విస్తృతి
మధురము బంధు ప్రేమ
మధురము ఆభిజాత్య లాభము.
అయినా, హృదయమా !
పొందుము భగవన్నుతిలోని అతులిత మాధుర్యము.

---

6. పైదే : 38. కృష్ణావతారంలో యశోద కృష్ణుణ్ణి దండించింది.
7. ఇదికూడా కృష్ణావతార ఘట్టమే.
8. పెరియ తిరువంతాది : 74.

అతని దివ్యధనువు వంగెను
అతని భక్తులను బ్రోవగ.'[9]

భగవన్నుతి సలుపుతూ జీవించాలని హృదయానికి విజ్ఞప్తి చేస్తూ కావ్యం అంత మవుతుంది. కాని కావ్యారంభంలో వ్యక్తం చేసినట్లుగా, అపమార్గాన సంచరించే తన హృదయం సవ్యమైన మార్గం చేపట్టడంలో ఆళ్వారు కృతార్థుడైనాడు.

'అవును—
అంగీకరించితిమి మే మిద్దరము.
నీలమేఘ శ్యాముని కరుణను
తోలి వైచితిమి నట్టడవులకు
మా పాప కర్మను!'[10]

భగవంతుడికి సంబంధించినవీ హృదయాన్ని స్పందింపజేసే ప్రత్యక్ష విజ్ఞప్తులు కావ్యంలో ఉన్నాయి.

'కన్నయ్యా!
ఏమి చేయ దలచితివి మాకు ?
మీ యిచ్ఛ వచ్చిన రీతి పొందని
మమ్ము విసర్జించితివా ?
మావి తీగను బోలు నీ రూపు
మాకు కనుపింప కరుణింతువా ?
మే మెరుగము.
మా కేమి చేయ దలచితివో
ఆది నుండియు మే మెరుగము.
నీ యిచ్ఛ ఏదైనను
సహింపమా మేము ?'[11]

సత్పథమున సంచరించ గల శక్తి తనకు లేనందుకు, ఆ నిస్సహాయతను తలచుకుని ఆళ్వారు ఇలా పేర్కొన్నాడు :

'దేవా!
ఏమి చేయుదు నేను.
మంచి యేదో చెడు యేదో తెలియు నాకు

9. పెరియ తిరువంతాది : 78.
10. పైదే : 26.
11. పైదే : 6.

కాని అలవి కాదు నాకు
ఒకటి అనుసరించుటయు
మరొకటి విసర్జించుటయు.
ఏమి చేయుదు నేను.'[12]

భగవంతుడు తనకు అతీతుడని గుర్తించిన తర్వాత, ఆళ్వారు భగవద్భక్తి అగ్గల మయింది.

'దేవా !
నీ అనంత సౌజన్యము
ఘాటైన పానీయము.
నీవా అగోచరుడవు
మేమా పాపులము.
తెలియదు మాకు
నిను సమీపించు మార్గము
నిను సమిపించు తీరును.
అయినా మా ప్రేమ
ఉత్తుంగ తరంగ సమానము
కారణ మేమో నీవే చెప్పుము.'[13]

తనను విస్మరించ వద్దనే ఏకైక వరాన్ని ఆళ్వారు అర్థిస్తున్నాడు.

'అనంత వైభవో పేతుడా !
మగ్నుడ నైతిని
నీ దివ్యాను గ్రహములో.
ఈ స్థితిని మార్చవలదు
ఇదియే నా అభ్యర్థన.
వాంఛింపను నేను
జన్మ రాహిత్యమో
స్వర్లోకములో నీ దాస్యమో.
నేను వాంఛించు సంపద
నిన్ను విస్మరింపని భాగ్యమే.'[14]

---

12. పెరియ తిరువంతాది : 3.
13. పైదే: 8. మానవుని మీది భగవంతుని కరుణ సతతమూ పెరుగుతున్న దని కొందరు వ్యాఖ్యానిస్తారు.
14. పెరియ తిరువంతాది : 58.

కావ్యంలో చాలాచోట్ల తన బాధను గురించీ, నిష్ఫలమైన తన అన్వేషణ గురించీ నమ్మాళ్వారు పేర్కొన్నప్పటికీ, మనోరథ సిద్ధిని పొందిన సంతోషాన్ని తెలియచేసే పాశురాలూ కొన్ని ఉన్నాయి.

'పూవై, నీలం, కయ, కావిపూలను
అవలోకించినప్పుడెల్ల -
పాపమతి నైనా
పొందుదు ఆనంద పారవశ్యము
అవియన్నీ నీ ఆకృతులే నని.'[15]

ఈ భాగ్యం నాకు చాలు – అంటాడు ఆళ్వారు. అంతిమ ఫలమైన స్వర్లోక ప్రాప్తి కంటే భగవంతుణ్ణి ప్రేమించడమే మిన్న అని ఆయన అభిప్రాయం.[16]

'నా కంటె మరెవరు కలరు
ప్రశం సార్హులు ?
నీల జలధిని పోలు వానికి
అనంత కరుణాన్వితునికి
అర్పించితి నా హృదయము.'[17]

తన భక్తి ఉచితరీతిని సమ్మానించ బడిందని నమ్మాళ్వారు పేర్కొన్నాడు. 'అతడు ప్రవేశించె నా హృదయమును, అంతకంటే కోరదగినది మరేమి కలదు ?'

'ఆ గోపాలుడు
బహు దూరమున నున్నవాడు
ఎవరును సమిపింప నట్లు
ఆ కృతులు మార్చువాడు
ఆ నాడు
అడుగులతో లోకములు కొలిచిన
ఆ మాయగాడు
ఈనాడు
నా యొద్దకు వచ్చినాడు
ఎటుల వచ్చెనో నే నెరుగ
జీవిత మెంత మధురము !'[18]

---

15. పెరియ తిరువంతాది : 73.
16. పైదే : 53.
17. పైదే : 4
18. పైదే: 56.

కాగా, భగవంతుడా లేక నేనా, ఎవరు గొప్ప ? అని ప్రశ్నిస్తున్నాడు ఆళ్వారు.

'నీలో ఉన్నవి
ద్యావా పృథువులు.
చెవి ద్వారా చొచ్చితివి
నా హృదయము లోనికి.
అటనే యుండుము.
నీ చక్రము
నీచుల నెత్తురు చవి చూచును.
తలచి చూడుము
మనలో ఎవరు గొప్ప
నీవా, నేనా ?'[19]

అంతస్తత్వంలోనూ హృదయాన్ని స్పందించే స్వభావంలోనూ, నమ్మాళ్వారు సర్వోత్తమ కృతి అయిన 'తిరువాయ్‌మొళికి' 'పెరియ తిరువంతాది' సంగ్రహ రూపం.

19. పెరియ తిరువంతాది : 75.

# 6. తిరువాయ్‌మొళి

నమ్మాళ్వారు కృతులలో తిరువాయ్‌మొళి పెద్దదే కాక ప్రశస్తమయింది కూడా. 9 వ శతాబ్దిలో వర్ధిల్లిన ప్రముఖ వైష్ణవాచార్యుడూ వీరనారాయణ పురం[1] వాస్తవ్యుడూ అయిన శ్రీనాథముని కనక శ్రద్ధ వహించి వుండకపోతే, ఇదేకాక నమ్మాళ్వారు ఇతర కృతులు కూడా కాలగర్భంలో కలిసివుండేవని చెపుతారు. దక్షిణాపథానికి చెందిన యిద్దరు వ్యక్తులు తిరువాయ్‌మొళిలోని 11 పద్యాలు చదవగా ఆయన విన్నాడు. ఆ పద్యాలు ఆయన్ని బహుధా ఆకర్షించాయి. మొత్తం కృతిని సంపాదించాలనే అభిలాష కలిగింది. ఆ అభిలాషతో ఆయన కురుగూరుకి[3] ప్రయాణ మయ్యాడు. నమ్మాళ్వారుని స్తుతిస్తూ చెప్పబడిన 11 పద్యాలే మొదట్లో ఆయనకి లభించాయి. నమ్మాళ్వారు కృతులేకాక ఇతర ఆళ్వారులవి కూడా తనకు తెలియ వచ్చేంతవరకూ ఆయన ఆ పద్యాలు చదవసాగాడు. తర్వాత వాటికి ఆయన స్వరకల్పన చేసి, వైష్ణవాలయాలలో అవి పాడబడాలని తగు యేర్పాట్లు చేశాడు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉన్నది. అయితే ఆ పద్యాలు పాడబడడం లేదు; చదవబడుతున్నాయి.

శ్రీనాథముని కాలంనుంచీ నమ్మాళ్వారువే కాక ఇతర ఆళ్వారుల కృతుల లోనూ తిరువాయ్‌మొళికి అగ్రస్థానం లభ్యమయింది. అది ద్రావిడ వేద సాగరమనీ, అందులో ఉపనిషత్తులు ఇమిడి వున్నాయనీ ఆయన ఆ కృతిప్రాశస్త్యాన్ని కొనియాడాడు. వేదములనూ భగవద్గీతనూ వ్యాఖ్యానించేటప్పుడు శ్రీరామానుజులు ఆ గ్రంథ సహాయాన్ని అభిలషించిన అంశాన్ని అందరూ అంగీకరిస్తారు. శ్రీ పిళ్లైలోకాచార్యులు[5] తన శ్రీవచన భూషణం[6]లో నమ్మాళ్వారుని తరుచు సభక్తికంగా స్మరించారు. శ్రీ వేదాంత[7] దేశికులు

---

1. ఇది దక్షిణార్కాడు జిల్లాలో చిదంబరానికి దగ్గరలో ఉన్నది. శ్రీరామానుజులకు పూర్వులుగా శ్రీనాథముని సంభావించబడుతున్నారు.
2. తిరువాయ్‌మొళి : 5, 8.
3. ఇది యిప్పుడు ఆళ్వార్ తిరునగరి అని వ్యవహృతం. తిరునెల్వేలి జిల్లాలో ఉంది.
4. మధురకవి ఆళ్వారు రచించిన ఆ కావ్యంపేరు కణ్ణినున్‌చిరుత్తాంబు. పరాంకుశదాసుని నుంచి శ్రీనాథముని యీ కావ్యాన్ని సంపాదించాడు.
5. 13వ శతాబ్దంలో వర్ధిల్లిన వైష్ణవాచార్యులు.
6. శ్రీవచనభూషణం 45-50.
7. 13 వ శతాబ్ది ఉత్తరార్ధంలోనూ 14వ శతాబ్ది పూర్వార్ధంలోనూ జీవించిన వైష్ణవాచార్యులు.

తిరువాయ్‌మొళిని ద్రావిడోపనిషత్తని కీర్తించడమేకాక సంస్కృతంలో రెండు గ్రంథాలు వెలయించారు.[8] ఒకదానిలో[9] ఆయన పేర్కొన్నాడు గదా: తమిళంలో సంతరించబడడంవల్ల, వేదాలవలెగాక, తిరువాయ్ మొళి అందరికీ అందుబాటులో ఉన్న అమూల్య రచన - అని. తన ఆచార్య హృదయంలో శ్రీ అళగియ మణవాళ పెరుమాళ్ నాయనార్[10] ఈ అభిప్రాయమునే ఇలా వ్యక్తీకరించారు. 'అది మృణ్మయ పాత్రకాదు, స్వర్ణపాత్రం'[11] ఇందులోని అంతర్యం ఏమిటంటే, ఒక నిర్దిష్ట ప్రయోజనానికి ఒకసారి వాడబడిన మృణ్మయపాత్రను మళ్లీ వాడరు; అది అపవిత్ర మవుతుంది (ఇది ఆనాళ్లలోని నమ్మకం). కాని వివిధవర్ణాలవారు తిరువాయ్‌మొళిని ఉపయోగించుకోవచ్చు. అది ఎప్పటిలా ప్రకాశవంతంగానే ఉంటుంది. తిరువాయ్ మొళిలోని దశకాని కొక పద్యం చొప్పున వందపద్యాలు (వెణ్బాలు) వెలయించి శ్రీ మణవాళమాముని అనే ప్రముఖ వైష్ణవాచార్యుడు ఆ కృతిపట్ల తనకు గల గౌరవభావాన్ని వ్యక్తం చేశాడు. ఆ కృతికి సంబంధించి వెలువడిన వివిధ వ్యాఖ్యాన గ్రంథాలను పరిశీలిస్తే, వైష్ణవ వేదాంత లోకంలో ఆ కృతికి గల ఆదరభావం అభివ్యక్త మవుతుంది. శ్రీ రామానుజుల ఆదేశానుసారం ఆయన సమకాలికుడైన తిరుక్కురుగై పిరాన్‌పిళ్లన్ ఒక వ్యాఖ్యానం వెలయించాడు. ఇతర వ్యాఖ్యానాలలో నంపిళ్లైది[12] చాలా విపులమైన వాఖ్య. ఈ వ్యాఖ్యానాన్ని భగవద్విషయం అని వ్యవహరిస్తారు. అనగా తిరువాయ్‌మొళి కేవలం భగవంతుణ్ణి గురించే చెప్పబడిందని భావం. దాక్షిణాత్యులైన వైష్ణవులు తిరువాయ్‌మొళికి ఎంత ప్రాధన్యం ఇస్తున్నదీ, పై విషయాదికం వల్ల విదిత మవుతుంది.

ఇక కృతిని పరిశీలిద్దాము. వివిధ వృత్తాలలో రచించబడిన 1102 పద్యాల కృతి యిది. ఈ పద్యాలను పాశురము లంటారు. ప్రతి విభాగంలోనూ 11 పాశురాలు ఉంటాయి. కాని ఒక విభాగంలోమాత్రం 13 పాశురాలు ఉన్నాయి.[13] ప్రతి విభాగమునకూ తిరువాయ్‌మొళి అని పేరు. అలాంటి పది విభాగలు కలిస్తే, ఒక 'ఎత్తు' అవుతుంది. కాగా తిరువాయ్

8. ద్రమిడోపనిషత్తు సారం, ద్రమిడోపనిషద్ తాత్పర్య రత్నావళి.
9. తాత్పర్య రత్నావళి : 4వ శ్లోకం.
10. శ్రీ పిళ్లైలోకాచార్యుల తమ్ముడు.
11. ఆచార్య హృదయం : 73వ పంక్తి.
12. ఈయన 13 శతాబ్ద మొదట్లో నివసించిన ఆచార్యులు. ఆయన వ్యాఖ్యానం పేరు 'ఏదు',
13. తిరువాయ్‌మొళి 2. 7.

మొళిలో పది పత్తు లున్నాయి ; వంద తిరువాయ్‌మొళులూ, 1102 పాశురాలు ఉన్నాయి.

ఈ పుస్తకంలోని పరబ్రహ్మాన్వేషణ, నమ్మాళ్వారు కవిత, నమ్మాళ్వారు తాత్త్విక చింతన మొదలైన అధ్యాయాలలో తిరువాయ్‌మొళిలోని పాశురాల అనువాదం చోటు చేసుకుంది. ఈ అధ్యాయంలోనూ కొన్ని అనూదితములైనాయి.

ప్రతి తిరువాయ్‌మొళి చివరను నమ్మాళ్వారు పేరు వచ్చే పాశురం ఒకటి ఉంది. అలాంటివి వంద ఉన్నాయి. ఈకృతి కర్త నమ్మాళ్వారనీ, ఈ పాశురాలు చదివేవారికి శుభం కలుగుతుందనీ వాటిలో చెప్పబడింది. ఇలా కవినామాంకిత పద్యాలు చేర్చడం ఆనాటి కొందరు భక్తకవులకు అలవాటనీ, ఆ సంప్రదాయాన్ని నమ్మాళ్వారు పాటించాడనీ చెప్పవచ్చు.[14]

కావ్యంలోని యితర పాశురాల ధోరణికీ ఈ కవినామాంకిత పాశురాలకీ పొందిక ఉన్నాదా? అని ఎవరైనా అడగవచ్చు. తాను భగవద్భక్తుల దాసాను దాసుణ్ణి [15] – అని నమ్మాళ్వారు చెప్పుకున్న పద్యాలకీ వీటికీ పోలిక ఉంది; కొన్ని అలా లేవు. ప్రతి తిరువాయ్‌మొళిలోని ప్రతి పాశురమూ వివిధ మానసికావస్థల్ని సూచించేదిగా గోచరిస్తుంది. అజ్ఞానంలో కొట్టు మిట్టాడే ఆత్మ ఆనంద పారవశ్యం అనుభవించే ఆ దివ్యానుభూతి మొదలైన వివిధ మనోగతుల్నీ చూడవచ్చు. ఒక పాశురానికీ మరో పాశురానికీ మధ్య సంబంధం ఉన్నట్లు ఒక్కొక్కసారి కనిపించదు. కాగా, ఈ తిరువాయ్‌మొళులన్నీ ఒక్క బిగిని చెప్పబడినవా లేదా అనే విషయం గురించి గట్టిగా చెప్పలేము.

కొన్ని తిరువాయ్‌మొళులు నీతి ప్రధానంగా నిష్పక్షపాతంగా ఉన్నాయి. మానవుణ్ణి ఐహికంనుంచి పరార్థం వైపుకి ఉన్ముఖుణ్ణి చెయ్యడమే వాటి లక్ష్య మనవచ్చు. ఐహిక జీవితపు క్షణికత్వం, అద్భుత ప్రపంచానికి ఇంద్రియాలులోను కావడం, ప్రాపంచిక విషయాలు ఆత్మను తృప్తి పరచక పోవడం, నిత్య సౌందర్యం సౌజన్యం భగవదనుగ్రహం మొదలైనవాటిని సాధించవలసిన అగత్యం – ఈ వివిధ విషయాలూ అవి అభివర్ణిస్తాయి. కొన్ని ఉదాహరణాలు :

14. తిరువాయ్‌మొళి, తిరువిరుత్తం - ఈ రెండు కృతులలోనే కవినామాంకిత పద్యాలు కానవస్తున్నవి. కడమవాటిలో లేవు (తిరువాసిరియం, పెరియ తిరువంతాది)

15. తిరువాయ్‌మొళి. 6. 9. 11, 7. 1. 11, 8. 9. 11.

'మెరుపు కంటెను అస్థిరము[16]
మానవ దేహము
త్యజింపుము పరిత్యజింపుము సర్వము'.
'సర్వము త్యజించు పిదప
మరల్చుము ఆత్మను
ఆ మోక్ష ప్రదాతవైపు'.[17]
'ఛేదింపుము సమూలముగా
నాది, నాదను భావము.
ధ్యానింపు మా భగవంతుని
ఆత్మకదియె పరమ తృప్తి'.[18]
'శబ్ద మెరిగినవారు
దైవలీలల నెరిగినవారు
విమలదృష్టి గలుగువారు
ఆ మాయగానిని గాక
అన్యుల సేవింతురె ?
జనన మరణములను
జరను వ్యాధుల నెల్ల
వేరుతో పెకలించు నాతడు.'[19]

'ఏమి లోక మిది !
మరణించి నశింపగా
విలపించుచు చుట్టు చేరెదరు
బంధు మిత్రాదులు
ఏమి లోక మిది !'[20]

తనకు విముక్తి ప్రసాదించమని భగవంతుణ్ణి అర్థించాడు. ఆళ్వారు ఈ భావం ఇలా రూపు దిద్దుకుంది.

'శేషశయనుడా !
త్రోవనెరుగను నేను

---

16. తిరువాయ్‌మొళి : 1. 2. 2.
17. పైదే : 1. 2. 1.
18. పైదే : 1. 2. 3.
19. పైదే : 7. 5. 10.
20. పైదే : 4. 9. 2.

బిరాన నన్ను పిలవవా
నీదరికి చేర్చుకొనవా ?'[21]

ఇంద్రియ సుఖాలు పరిమితములు ; తుచ్ఛములు. 'భగవంతుని అనంత సౌందర్యాన్ని ఆకాంక్షించి వాటిని త్యజించాను' అని ఆయన పేర్కొన్నాడు.

వినుట కనుట తినుట తాకుట వాసన చూచుట –
తుదిలేని ఈ సుఖములను
త్యజించితి తుచ్ఛము లని.
కనుగొంటిని
నిన్ను, నీ దేవేరిని
మధుర మోహన మూర్తులను.
నీ పాద సన్నిధిని చేరితి ?[22]

కొన్ని సందర్భాలలో, పరులకు ఉపదేశించే ఆళ్వారు తన అవస్థలను తెలియజేయడంలో మునిగిపోవడాన్ని మనం చూడవచ్చు. తత్ఫలితంగా పరాశ్రయత్వం గీతికా రూపంగా మార్పు చెందింది.

ఈ కోవకు చెందిన గీతికా సందోహమే తిరువాయ్‌మొళి అనవచ్చు. ఆళ్వారుకి భగవంతుని పట్లగల ప్రేమను ఈ గీతాలు వ్యక్తం చేస్తాయి. ఈ దివ్య ప్రేమలోని వివిధ రీతుల్ని పరబ్రహ్మాన్వేషణ అనే అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఆ భావాలు ప్రత్యక్షంగాను ప్రతీకల సహాయంతోను వివరించబడ్డాయి. ప్రత్యక్ష పద్ధతిని సాగిన భావ వ్యక్తీకరణాన్ని ఈ కింది పాశురాలలో చూడవచ్చు.

'పంచేంద్రియములను ఉసిగొలిపి
నన్ను మార్కొనగా, హింసింపగా జేసి
నీ పాదములకు దూరముగా చేసి
నీవేమి బాగుకొనెదవు, దేవా !'[23]
'సప్తభువనములు లోగొన్నవాడు
సంతసమున అరుదెంచె నేడు –
అతడు నాలోనె ఉన్నవాడు, వీడిపోడు,
ఇక నేను సాధింపనిది వేరె కలదె ?'[24]

21. తిరువాయ్‌మొళి : 4. 9 2.
22. పైదే : 4. 9. 10.
23. పైదే : 7. 1. 3.
24. పైదే : 2. 6. 7.

'దేవాధిదేవు డతడు
తిరువేంకటాధీశుని కాపేరు
అర్థమై తనరునె ?
నీచమతిని నేను
గుణ రహితుడ నేను
అయినా ఆ పరంజ్యోతి
అనుగ్రహించె నన్ను
ఆదర పురస్సరముగా.'[25]
'సాటిలేని వాడతడు
వీడదు నా మన సతనిని
పాడును జిహ్వ అతని పాటలే.
ఆడెద నింక నేను
అతనిని మనసున నిలిపి.'[26]
'నీవు లీనమైతివి నాప్రాణమున
నన్ను నీకు సమర్పించుకొంటి
ఇక వెనుకకు మరలజాల.
ఇదియెహో నేనొనర్చు ప్రత్యుపకారము.
నా ప్రాణమేది? నేనెవరను ?
నీవు నాప్రాణ ప్రాణమవు.
ఇచ్చిన ప్రాణమును గైకొందువు
రూపురేఖలు కల్పించుటకు'.[27]
'గగనము కన్నను పెద్దవిగా
మాయ లెన్నో పన్నెద వీవు
సురలను సైతము భ్రమింపజేతువు
నీలమేఘ శ్యాముడా !
నే నెన్నటికిని విస్మరింపను
భూమి నధిగమించు నీపాదపద్మముల.
వాటిని గూర్చియే ముచ్చటింతును
వినుగేమియు చెందక.
ఆశ్రయింతు వాటినే
అర్చింతును సతతము.[28]

25. తిరువాయ్‌మొళి : 3. 3. 4. 26. పైదే : 1. 6. 3.
27. పైదే : 2. 3. 4.
28. పైదే : 1. 3. 10.

'నా హృదయమే
అతడలదుకొను గంధము
నా మాటలే
అతడు దాల్చు సుమహారము
అదియె అతని పట్టు పుట్టమును.
నా అంజలియే
ఆతని భూషలు.[29]
'తీసికొనిరాలేదు నీకై
సుమహార మేదియు.
సేవించు చుంటి.
అయినా
నీ మకుటమున నున్న సుమహారము
నా జీవమే'.[30]

ఇలా ప్రత్యక్షంగా కాక ప్రతీకల ద్వారా ఆయన భావవ్యక్తీకరణ చేయడాన్ని పెక్కు తిరువాయ్‌మొళులలో చూడవచ్చు. నమ్మాళ్వారు తాత్త్విక చింతన దృష్ట్యా ఆప్రతీకలు పొందిన విలువ ఈ పుస్తకంలో మరొకచోట చర్చించబడింది. తిరువాయ్‌మొళిలోని ప్రతీకకు సంబంధించి ఒక ముఖ్యాంశం ఇక్కడ ఉదాహృతం. భగవంతుణ్ణి ప్రియునిగాను, ఆతని ప్రేమకోసం తపన చెందే జీవిగా తనను సంభావించుకోవడం ప్రతీకలోని ముఖ్యాంశం. వివిధావతారాలలో భగవంతుణ్ణి ప్రేమించిన స్త్రీల వృత్తాంతాలను ఆయన పురాణేతిహాసాల నుంచి గ్రహించాడు. ఉదాహరణానికి, ఆయన తనను గోపస్త్రీలతో పోల్చుకున్నాడు. గోపస్త్రీలు భగవంతుడి పట్ల పరమ ప్రేమ ప్రదర్శించారు. గోపస్త్రీ తన వియోగబాధను అభివ్యక్తం చేస్తున్నట్లుగా నమ్మాళ్వారు ఈ కిందివాటిలో పేర్కొన్నాడు.

'వెదుళ్లవంటి నా బాహువులు
శుష్కించినవి దుర్బలము లై.
నాదురవస్థను ఏకాంతతను
మరేదియు కనుగొనక
కూయుచున్నవి ప్రేమను మునిగిన కోయిలలు
చేయుచున్నవి మయూరములు నృత్యము
కలిసికొన్న కారణమున.

29. తిరువాయ్‌మొళి : 4. 3. 2.
30. పైదే : 4. 3. 4.

ఇప్పుడు నే నేమి చేయుదు?
నీవా వెడలిపోదువు
పశువుల మేపగా.
గడచు నాకు దినమొక యుగము..'
కమల నయనుడా!
ఏల కలిగింతువు
నాకీ హృదయ వైకల్యము?
తగదు నీకిది, తగదు!'[31]
'నాతో నీ వుంటివి
అంబరమును తాకెను
నా ఆనంద స్రవంతి.
అందులో మున్కలు వైచితి
అంతలోనె అది కల యని తోచె.
నీ వేమో వెడలుదువు
నన్నావహించు విరహము
నమిలి వేయుచున్నది.
ఇక భరింపజాలను
నీ గోపాలకత్వమును
చాలింపుము, చాలింపుము.[32]

కన్నయ్యకు తమ హృదయాలు అర్పించిన గోపస్త్రీల తరపున, ఒక గోపిక మాట్లాడుతున్నట్లుగా తరువాతి పాశురంలో పేర్కొనబడింది.

'పశువుల మేపగ నీవు వెడలిన
అసువులు నిలువవు నాకు.
తపించుచున్నది నా జీవము
అయినా జీవింతు, అది మొండిది.
నే నొంటరిదానను, నిస్సహాయను.
కనులముందు కదిలే నీ రూపును
కనుగొన లేకున్నాను
కనులు చేప కనులై చలింపగా
కన్నీరు నిండగా.
పగలు దీర్ఘమై తనరు

31. పైదే: 10. 3. 1.
32. గోకులంలో ఉన్నప్పుడు కృష్ణుడు గోపాలకుల వలె గోవుల్ని మేపాడు.

నీవు లేని వేళల.
అంతము కాదది.
వియోగము మాకు మరణము
గోప కాంతలమై జన్మించిన
యీ నికృష్ట జీవులకు.'[33]

గడచిన రాత్రి తన ప్రియుడు పలికిన మధురోక్తిని స్ఫురణకు తెచ్చుకుని గోపస్త్రీ బాధపడింది. అప్పుడే సాయం సమయం తన పాలిటి మదగజమై తనను కాళ్లతో నొక్కివేయాలని సమీపిస్తోందనీ, మల్లెల సౌరభాన్ని మారుతం గుబాళింపజేస్తుందనీ ఆమె భావించింది. ఈ బాధను నే నెలా సహించగలను - అని అనుకుంది. తనవలె ఎందరో అతనిని ప్రేమించి వుంటారనీ, బహుశః అతడు వారివద్దకు వెళ్లి వుండవచ్చుననీ అనుకుంది. ఇక్కడ మేము కన్నీళ్లు మ్రింగుతూ వున్నాము. మా హృదయాలు చలిస్తున్నాయి. పశువులు మేసే ప్రదేశానికి మేము వెళ్లలేక పోతున్నాము. వెడితే మేము ద్రవించిపోతామనీ అనుకుంది. అంతలోనే ఒక సందేహం తలెత్తింది. అంతవరకూ తన బాధ గురించి సతమత మవుతున్న ఆమెకు, అడవిలో తన ప్రియునికి మలినాత్ములైన రాక్షసులవల్ల బాధ కలుగుతుందేమోనని అనిపించింది. అతడు వెళ్లకూడదని గోపిక అరచింది. అతడు నాపట్ల విముఖత్వం వహించి, మరో గోపకాంతకు తన పద్మనేత్రాలను అరుణాధరాల వైభవాన్ని ప్రదర్శించినా, అతను చెంతనే ఉండాలి - అనుకుంది.

ఈ భావన, అందులోనే ఒకస్త్రీ అనుకోవడం, విడ్డూరంగా ఉంది. ప్రియుడు తన ఆధీనంలోనే ఉండాలనుకుంటుంది.

గోపికగా నమ్మాళ్వారు ఈ తిరువాయ్‌మొళిలో దర్శన మిస్తాడు. అంతేకాదు. గోపిక నమ్మాళ్వారవుతుంది. ఈ దశకంలో అభివ్యక్త మయ్యే హృదయావేదన నమ్మాళ్వారుదే.[34]

ప్రత్యక్షంగానో పౌరాణిక పాత్ర ద్వారానో గాక ప్రేయసిగా తిరువిరుత్తంలో మాదిరిగా నమ్మాళ్వారు తల్లిగా, చెలికత్తెగా, సోదెకత్తెగా కూడా కనిపిస్తాడు. అయితే, ప్రతి తిరువాయ్‌మొళిలోనూ ఒక ప్రత్యేక ప్రతీక ప్రయుక్తం. స్వయం శక్తిగల కవితగా భాసిస్తుంది. కలగాపులగం లేదు. ఒకే కథావిత్రంగా అన్ని ప్రతీకలు ఒక్కసారిగా కనిపించవు.

---

33. తిరువాయ్‌మొళి : 10. 3. 3.
34. పైదే : 10. 3.

ఆళ్వారు తనను ప్రేయసిగా భావించుకుని ప్రియసఖిని ఉద్దేశించి చెప్పినట్టుగా ఈ క్రింది తిరువాయ్‌మొళిలో చూడవచ్చు.

'హరిణాక్షులారా ! నేస్తములారా !
వ్యర్థమగుచున్నది కర్మభరమున
నా జీవితము.
అతడేమో
మల్లెల సువాసనలు గుబాళింపగా
తాళ వృక్షములు గగనము నంటగా
తిరువల్లవాళ్[35] మధు వనాలలో
తిరుగుచున్నాడు.
ఎపుడీ దాసురాలు చేరునో
ఆతని పాదముల.'[36]

ప్రియుని రాక ఆలస్యమైనందువల్ల, పరితపించే ఒక గోపకాంతను దర్శించండి :

'మమ్మిక వీడుము దేవా !
నీ అరుణాధరములు పద్మనేత్రములు
నీ దరహాసము వలన
బాధ మాత్రము మిగిలెను మాకు.
మే మింత మాత్రమే బడసితిమి
పురాకృత పుణ్యమున.
మయూరివలె మనోజ్ఞ మూర్తులు
నీ కరుణా న్వితలు
నీ కోసము వేచియున్నారు
ఎంద రెందరో కాంతలు.
పశువుల నెల్ల విడిచి
పొమ్ము వారి యొద్దకు.
నీ మురళిని మ్రోగింపుము
వారు సంతస మందగా.'[37]

ఈ తిరువాయ్‌మొళిలోని గోపస్త్రీ యింకా పరిణతి చెందలేదు. సఖులతో కలిసి పిచ్చుక గూళ్లూ బొమ్మరిళ్లూ కట్టే కన్నెలా కనిపిస్తుంది.

---

35. కేరళలోని తిరువెల్లా.
36. తిరువాయ్‌మొళి : 5. 9. 1.
37. పైదే : 6. 2. 2.

మందస్మితవదనుడైన దేవుడు తమ వద్దకు వచ్చి తాము కట్టిన పిచ్చుక గూళ్లనీ వండిన అన్నాలనీ చూసి మెచ్చుకోలేదని ఆమె బాధపడుతుంది.[38] ఈ కోవకు చెందిన అల్ప విషయాలకి భగవదనుగ్రహాన్ని అర్థించడానికీ అతడు వీటిని త్రోసిపుచ్చడానికీ ప్రతీక యిది. అలాచేసే, వారాతర్వాత అతణ్ణి స్మరిస్తారు.

ఈ కింది పాశురంలో గోచరించే ప్రేయసి తరుణ వయస్కురాలు. ఆమె తల్లి మాటలివి.

'సుగంధ కుంతల మా చిన్నది
మోహము గొన్నది.
ముజ్జగములు కొలిచిన
ఆ నీలమేఘ శ్యామునిపై
ఆ పద్మనేత్రునిపై.'[39]

తన కూతురు పాలిపోయిందనీ, కృశించి పోయిందనీ, కన్యాత్వం కోల్పోయిందనీ తల్లి ఘోష.[40] మధుర భక్తి సంప్రదాయం తెలియనివాళ్లకి ఈ తరువాతి పాశురాలలోని తల్లిమాటలు అనవసరంగా తోచవచ్చు.

'ఆ హరిణాక్షి పలుకును –
తిను అన్నము త్రాగు నీరు
సేవించు తాంబూలము
సర్వమూ ఆ కృష్ణుడే— అని.
అశ్రుపూరిత నేత్రయై అడుగు—
ఈ జగతిని
అతని కీర్తి నెలకొన్న చోటేదని.
వెదకి వెదకి తుదకు
తిరుక్కోళూరు చేరును.'[41]

'ఊరూ నాడూ లోకము అతడే అనుచు
అతనినీ సుమహారముల జపించు.
లత వంటిది నా కూతురు
పంటచేల తిరుక్కోళూరునకు

38. తిరువాయ్‌మొళి : 6. 2. 9.
39. పైదే : 6. 6. 1.
40. పైదే : 6. 6. 2. 5. 10.
41. పైదే : 6. 7. 1. తిరుక్కోళూరు నమ్మాళ్వారు జన్మస్థలానికి సమీపంలో ఉంది.

పయనమయ్యె నేమో! –
పక్షులారా! మీరు చెప్పుడు.'[42]
'పూవై పక్షుల, చిలుకల
బంతుల, క్రీడా వస్తువుల –
అన్నిటినీ వ్యవహరించును
ఆ తిరుమాల్[43] దివ్యనామమున.
బింబోష్ఠము లదరగ
కనుల నీరు తొల్కాడగ
ప్రతిమ వంటి ఆ సుందరి
తిరుక్కోళూరున కరిగెను
ఏమి చేయు నా శ్యామలకేదారములందు ?'[44]

భగవంతుణ్ణి ఉద్దేశించి తన కూతురిని ఏమి చేశావనీ, యికముందు ఏమి చేయనున్నావనీ సంభ్రమాశ్చర్యాలతో తల్లి అడగడాన్ని మనం చూడ వచ్చు.

'కను మూయదు పగలుగాని రేయిగాని
కనులు తుడుచుకొనును
తన చేతులతో సతతము.
కరములు ముడుచును ధ్యానమున
నీ శంఖ చక్రములు స్మరించుచు.
కనులు పద్మము లనుచు
కరిగి పోవును.

"నిను వీడి నేనెట్లు మనగలుగుదు"
అనచు చేతులు చూపును.
నిను కనుగొను రీతి
నేలను చూపును వ్రేలితో.
ఎఱ్ఱచేపలు మిలమిలలాడ నీరు పారెడి
శ్రీరంగ పురాధీశ!
ఏమి చేయ నెంచితివో!'[45]

---

42. తిరువాయ్‌మొళి : 6. 7. 2.
43. శ్రీమన్నారాయణుని తిరుమాల్ అందురు.
44. తిరువాయ్‌మొళి : 6. 7. 3.
45. పైదే : 7. 2. 1.

'చాపిన కాలుసేతులు చాపినట్లే యుండు
మేల్కొను, నడచు, మూర్ఛపోవు
చేతులు జోడించును
ప్రేమించుట బాధయే యనును
సముద్ర వర్ణుడా !
కఠినుడవు నీవు.
రమ్ము రమ్ము దేవా అనుచు
సొమ్మసిలిపోవు పిదప.
శ్రీరంగ నాథుడా !
ఏమి చేయ నెంచితివో !'[46]

పక్షుల ద్వారా తుమ్మెదల ద్వారా నమ్మాళ్వారు భగవంతుడికి తన సందేశం పంపిస్తున్నట్లుగా అభివర్ణించే చవిగల నాలుగు తిరువాయ్‌మొళులు ఉన్నాయి. నారాయణ పక్షికి (బకం) చేసిన విన్నపం ఇలా ఉంది.

'మెత్తని మనసుదానా
అందాల విహంగమా !
నా పై కరుణ వహింపుడు
నీవు, నీ ప్రియుడును.
ఆ గరుడధ్వజుని కడకు
అరుగరా నా పక్షమున.
అతడు చెరబెట్టు నని
అడలుచున్నారా మీరు !
అయిన నేమి?' [47]

అతనిచే బందీకావడం కంటె భాగ్యం మరొకటి లేదనీ, అతని హృదయమే బందిఖానా అనీ యీ సందర్భంలో నంపిళ్లై వ్యాఖ్యానించాడు.

ఆ తర్వాత కోయిలలు, ఒయ్యారపు నడకల హంసలు, నీలంరంగు మగన్రిల్ విహంగాలు మొదలైనవాటిని ఉద్దేశించి ఆళ్వారు చెప్పాడు.

'నా స్థితి జూచి
నన్ను కరుణించి
ఇది తగదని పలుకవలె
ఆ నీలమేఘ శ్యాముడు.
అతని కెట్లు తెలుపుదు సందేశము ?

46. తిరువాయ్‌మొళి : 7. 2. 4.
47. పైదే : 1. 4. 1.

మాటలా తగినవి లేవు.
ధర్మ మిక నీ యొద్ద నెలకొనినదని
అతనితో నా మాటగా చెప్పి
చేసెదరా సహాయము
మగన్రిల్ పక్షులారా !'48

తర్వాత ఆళ్వారు తుమ్మెదలు, చిలుకలు, పూవాయ్ మొదలైన పక్షుల్నీ, ఇటూ అటూ విహరించే చల్లనిగాలినీ, చివరికి తన హృదయాన్నీ సంబోధించాడు. అయితే ఆ విన్నపాలు కూడా లాభరహితాలైనాయి. తత్ఫలితంగా ఒక ప్రత్యేక దూతమీద విరుచుకు పడడం జరిగింది.

'అతనికి నా బాధ తెలుపుమని
నీతోనే చెప్పి పంపితిని
నాకు గుర్తున్నది
చిన్నారి విహంగమా !
నీవు చెప్ప నైతివి
నారూపు చెడెను
ఒడలు పాలిపోయెను
హొమ్ము హొమ్మిక.
నీ వారికి ప్రతినిత్యము
ముద్ద లిడువారిని
వెదకి కొనుము క్రొత్తగా.'49

మారుతానికి చేసిన విన్నపం ఘాటుగా వుంది.
'నా దుర్విధి వశమున
నా పుణ్యము తీరిన కతమున
అతడు నన్ను విసర్జించె
అతడు నాదరికి రాడు.
ఓ శీతల మారుతమా !
చీల్చుము నన్ను, తీయుము ప్రాణము !
ఇంతకు మునుపే
నే కనుమూసిన బాగుండెడిది.'50

---

48. తిరువాయ్‌మొళి : 1. 4. 4.
49. పైదే : 1. 4. 8.
50. పై : 1. 4. 9.

విహంగము లేమో భగవంతుని వద్దకు వార్తాహరులుగా వెళ్లాయి. కాని, తన తపనకు జీవితానికీ అంతం కల్పించమని మారుతాన్ని అర్థించడం జరిగింది.

మరొక తిరువాయ్‌మొళిలో[51] తిరువానవండూరుకు[52] సమీపంలో నెలకొన్న భగవంతుడి వద్దకు ఆళ్వారు సందేశం తీసుకువెళ్లమని పక్షుల్నీ తుమ్మెదల్నీ అర్థించడ మయింది. ఇప్పటి ధోరణి కొంచెం ఆశాజనకంగా ఉంది. ఆళ్వారుని 'చీల్చ' మని మారుతాన్ని అర్థించలేదు. మరొక తిరువాయ్‌మొళిలో, తన సందేశాన్ని తీసుకువెళ్లమని తుమ్మెదల్నీ ప్రేయసి అర్థించినట్లుగానే గాక, అతని తులసిమాలల్నీ వాసన చూసిన నోళ్లతో తన కేశపాశంలోని విరులమీద గాలి వీచవలసిందిగా కోరినట్లు చెప్పబడింది.[53] భగవంతుడు ఎక్కడున్నా, అతనికి తన బాధను విన్నవించమని పెంపుడు చిలకల్ని కోరడం జరిగింది.[54] తిరుమూళికలంలో వేంచేసివున్న భగవంతుని[55] వద్దకు సందేశం తీసుకు వెళమని ఆ పక్షుల్నీ తుమ్మెదల్నీ కోరడం మరో తిరువాయ్‌మొళిలో[56] చూడగ్చ్చు. తన సందేశాన్ని కనక ఆ నీలమేఘ శ్యాముడూ, జగత్త్రయ కారకుడూ అయిన దేవదేవుని వద్దకు తీసుకుని వెళ్లగలిగితే, ఆ విహంగాలు దేవలోకాన్నే కాక సకల భువనాలను పాలించవచ్చునని ప్రేయసి చెపుతుంది.

కాని ఆ దూతలు తిరిగి వచ్చేంత లోపల (అసలవి తిరిగి వస్తాయా?) సహనం లేని ఆ ప్రేయసి ప్రేమ పరవశయై తిరునావాయ్‌లో[57] వేంచేసివున్న దేవుణ్ణి ఇలా సంబోధించింది.

'ఎపుడు నీదరి చేరుదు ?'

ఇది తిరువాయ్‌మొళికి మకుట మయింది. దీనికి ఎన్నో పాఠాంతరాలు వెలిశాయి. వేదాంత పరమైన భావనకూ నమ్మాళ్వారు ఆంతరిక జీవనానికీ, వివిధ తాత్త్విక భావవ్యక్తీకరణకూ ఈ కృతి నిలయం. ఇదే యీ కృతి ప్రత్యేకత.

---

51. తిరువాయ్‌మొళి : 6. 1.
52. కేరళలోని కొట్టారక్కారకు ఇది 35 మైళ్ల దూరంలో ఉంది.
53. తిరువాయ్‌మొళి : 6. 8. 3.
54. పైదే : 6. 8. 5.
55. కేరళలోని అంగమలైకి సమీపంగా ఉన్న ఒక ఆలయం.
56. తిరువాయ్‌మొళి : 9. 7.
57. పైదే : 9. 8. కేరళలోనిదీ ఆలయం.

# 7. పరబ్రహ్మాన్వేషణ

సాధారణంగా పరబ్రహ్మ (నారాయణ) అన్వేషణకు ప్రయత్నించే వారికి ప్రశాంతత లోపిస్తుంది. నమ్మాళ్వారు ప్రయత్నమూ ఇలాగే మొదలయింది. వారు ఐహికాన్ని విసర్జిస్తారు. ప్రాపంచిక జీవితపు అస్థిరత్వమూ స్వల్పకాలికత్వమూ వారికి చక్కగా గోచరిస్తాయి :

'రాజులు అవనత శిరస్కులు కాగా
రత్న కిరీటములు పాదము లంటగా
రాజాధిరాజులు పరిపాలింతురు.
వారి పరాక్రమమును చాటును
సభా స్థలిని మ్రోగు భేరీలు.
కడపట వారును
కలియుదురు ధూళిలో.
ఇది యీ నాటిది కాదు
ఇదే స్థితి జగతి పుట్టిన దాదిగ.
మబ్బు తునకలవలె మాసిపోవును
మహిత వైభవాదులు.'[1]

మానవ సంబంధాలు ఆకస్మికములనీ, విశ్వసనీయములు కావనీ వారి అభిప్రాయం. మన చుట్టూరా ఉన్న లోకం అంధకార బంధురమూ అసంతృప్తికి నిలయమూను.

'ఈ ప్రపంచములో
ఎన్నెన్నో బాధలు.
దూరస్థులు మనల జూచి
పరిహసింతురు.
సన్నిహితులైన సజ్జనులు
పరితపింతురు.
ఏమి లోక మిది !
తన కతి సన్నిహితులు
చెడువారు, గిట్టువారును.
ఏడ్పుటెల్ల నిజము.
గ్రహింపు మని వచ్చి

1. తిరువాయ్‌మొళి : 4. 1. 3. 6.

సంపద అగ్ని పాలగును.
గ్రహింపుమని వచ్చి
అజ్ఞానము మనల లోగొనును.
పట్టి పల్లార్చి దుర్జనులు
హింసింతురు, నమిలి మ్రింగుదురు
ధర్మ మేదో వారికి తెలియదు
ఏమి లోక మిది !'[2]

ఈ యాతనలలోంచి బయటపడి, నమ్మాళ్వారు భగవంతుని వైపు మనస్సుని కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తాడు. అది తపన చెందే ఆత్మకు ఊరట కలిగినట్లవుతుంది. ఇక ఆయన మాటలు విందాము :

'ఈ వింత గొలుపు పథమున
చరించు చున్నది
నీ వొసగిన యీ దేహము.
దహియించు ఈ కాల మెపుడు తీరునో !
ఎపుడు పెరికి వేయుదునో
కర్మను సమూలముఁగా ?
ఎపుడు నీ వాడ నగుదునో !'[3]

'కేక లిడుచున్నాను
నిబిడమౌ క్రూర కర్మను మునిగి.
పాపాత్ముడను నేను
పరిభ్రమించు చున్నాను
తుదిలేని చిక్కులలో పడి.
ఎచట కలియుదు నే నాతని ?'[4]

లోకం ముళ్ల పొదవంటిది. చిక్కులా లెక్కలేనన్ని. వీటిలోంచి విముక్తుడు కావడానికి ఆళ్వారు యత్నిస్తున్నాడు. అయితే యిది సులభం కాదు. శరీరమూ ఇంద్రియాలూ ఆయన్ని లోకానికి కట్టివేస్తున్నాయి. అంతే కాదు. ఇంద్రియాలు ఈ జీవితాన్ని మెచ్చుకుఃంటూ యిందులోనే ఉండాలని ఆశిస్తున్నాయి. ఈ విషయాన్ని ఆయన వ్యక్తం చేయడమేకాక, యిందుకు బాధ్యత తాను అన్వేషిస్తున్న ఆ పరబ్రహ్మానిదే అని పేర్కొన్నాడు.

---

2. తిరువాయ్‌మొళి : 4. 9. 1. 2. 4. 6.
3. పైదే : 3. 2. 1.
4. పైదే : 3. 2. 9.

'పాలించు చున్నవి నన్ను పంచేంద్రియాలు.
రేయనక పగలనక
వేధించుచున్నవి నన్నవి.
నుగ్గు నుగ్గు చేయుచున్నవి.
వాటిని నీవే యిచ్చితివి.
నీవు నీ త్రోవను వెడలితివి
నిన్ను చేరనైతిని.[5]

'నయము కాదు
నన్ను హింసించు ఈ వ్యాధిపంచకము
మందును లేదు.
తీర్చి దిద్దితివి నీవే
ఈ పంచేంద్రియములను
ముందు వెనుకల నలువైపుల
నుగ్గుచేసి ముద్ద చేసెడు
ఒక గానుగగా.
దేవాధి దేవా !
నీవు గాక ఎవరు నన్ను బ్రోచువారు ?'

ఈ పంచేంద్రియాల బాధ ఎలా వచ్చిందని !

'నా కను గప్పి
నా ముందు త్రోసితివి నీవు
వంచనా వలయము.
పంచేంద్రియములకు చిక్కువడితి.
నీ పాదపద్మముల జేరగా
నిరోధించితివి నీవు.'[7]

ఇంద్రియాలనూ మనస్సునీ జయించడం మొదటి కర్తవ్యం. అయితే, వస్తులుండడం వల్ల ఇది సాధ్యమవుతుందా ? నమ్మాళ్వారుకి తపోవిధి తెలుసు. శరీరాన్ని శుష్కింప జేయడం, ఇంద్రియ వ్యాపారాలను మనస్సునీ నిగ్రహించడం అన్నమాట. కాని భగవంతుడితో సంబంధం పెంచుకోవడం వల్లనే ఇహానికి దూరంగా ఉండవచ్చునని ఆయనకి తెలుసు.[8] ఆధ్యాత్మిక

---

5. తిరువాయ్మొళి : 7. 1. 2.
6. పైదే : 7. 1. 5.
7. పైదే : 7. 1. 4.
8. పైదే : 1. 2. 1.

సాధకుడు ఇహానికి దూరముగా ఉండవలెననీ అది అవసరమనీ ఋషిఅయిన వాడు భావిస్తాడు. శరీరాన్ని శుష్కింపజేయడం భగవద్దర్శనానికి గాక ఆత్మ ప్రశస్తికీ సంకుచిత తత్వానికీ గర్వానికీ దారి తీస్తుందనే అభిప్రాయం నమ్మాళ్వారు రచనలో కనిపించదు. శూన్యాన్ని సృష్టించడం తద్వారా శారీరక విధుల్నీ ఐహిక సంబంధాన్ని అధిగమించ వచ్చునని ఆయన భావించలేదు. అయితే భగవంతుడితో సంబంధం ఏర్పరుచుకుని వాటిని అధిగమించ వచ్చునన్నది ఆయన విశ్వాసం. ఈ విషయంలో ఆయన ప్రముఖ సుభాషిత గ్రంథకర్త తిరువళ్లువరుకి సమానుడు.

అయితే యిది సాధ్యమా? భగవంతుణ్ణి గురించి యేమీ తెలియనప్పుడు, దీన్ని ఎలా సాధించడం? గొడ్ల సావిడి ఎక్కడుందో తెలియకపోయినా, ఇతర ఆవుల్ని అనుసరించి వెళ్లే గుడ్డి ఆవులా ఈ వ్యవహారమని నమ్మాళ్వారే చెప్పాడు.[9] భగవదన్వేషణలో ఇది మూడవ ఘట్టం. భగవంతుని లక్ష ణాన్ని ఇదమిత్థమని నిర్వచించడం సాధ్యం కాకపోయినా, ఆళ్వారు అతనినే పరమలక్ష్యంగా భావించు కున్నాడు. పరబ్రహ్మపు అనంతత్వాన్ని గుర్తించిన వాడవడం వల్ల, ఆ విషయాన్ని అవగాహన చేసుకోవడం తన శక్తికి మించిన పనిగా భావించాడు. భగవంతుడు కంటికి కనిపించడని ఆయన ఇలా అన్నాడు.

'సలుప వచ్చుగాక విశ్వప్రయత్నము
తెలిసి కొనలేని అగాధ మిది
కొలువ లేము పొడవు వెడల్పులు
బ్రహ్మాండమైన ఆకృతి.
జీవులారా !
ఎరుగ లేరు మీరు
ఎంత ప్రయత్నించినా.'[10]

'ఎట్లు పిలువ వలెనో
ఎట్లు తలప వలెనో
ఎరుగను.
అత్యల్పము నా జ్ఞానము
అతడు అన్నిటిలో ఉన్నాడు.
అతడు అందరిలో ఉన్నాడు.
షణ్మతముల చిక్కులు సడలించువారును

9. తిరువిరుత్తం : 94.
10. తిరువాయ్‌మొళి : 1. 3. 6

సంభావింపలే రాతనిని
అతీతు డతడు
అనిర్వచనీయు డతడు
జీవకోటియందు వసించు.
చేరవచ్చు నతనిని
పరిపూర్ణ నిస్సంగత్వమున.'[11]

ఇది ఒక విచిత్రమైన పరిస్థితి. భగవంతుణ్ణి చేరడానికి నిస్సంగత్వం అవసరం. నిస్సంగత్వం కోసం తెలియని భగవంతుణ్ణి శరణు వేడాలి. తన అల్పత్వ మేమిటో ఆళ్వారుకి తెలుసు. ఇంద్రియాలకూ ప్రాపంచిక బంధాలకూ ఆయన వశుడు.

'నాకు తెలిసినది కొంచెము
అయినా
ఆశింతు నాతనిని దర్శింప.
అతడా అగమ్యుడు.
ఇంతకంటె విసుగైనది వ్యర్థమైనది
వేరొకటి గలదె ?'[12]

'నాలో లేదు
గుణమో పుణ్యమో ప్రతిభయో.
అల్పజ్ఞుడ నేను
కర్మ మాత్రము అనంతము.[13]

'మస్త కన్యస్త హస్తుడనై
స్మరించు చున్నాను నిన్ను సతతము.
నీవు నన్ను పిలువవు
నీ అందమునైనా చూపవు నాకు.'[14]

'నడుమ ఎడము లేకుండా
సతతము నీవుందువు

---

11. తిరువాయ్‌మొళి : 1. 5. 6. 7. 1. 3.
12. పైదే : 1. 5. 7.
13. ఇక్కడ కర్మ అంటే పాపకర్మ అని నంపిళ్లై తన వ్యాఖ్యానంలో సరిగ్గా పేర్కొన్నాడు. భగవంతుని అపారమైన కరుణకంటె తన పాపములే ఎక్కువగా ఉన్నాయని నమ్మాళ్వారు అభిప్రాయం. కర్మను తమిళంలో 'వినై' అంటారు.
14. తిరువాయ్‌మొళి : 4. 7. 1.

నా ఆత్మలో దేహములో సర్వత్రా.
అజ్ఞానుడ, అంధుడ నేను.
నిన్నెరుగ దలచి
నేను వెదకుదు దేహములో.
నీ నామము స్మరింతు.
నిన్ను దర్శింప నభిలషింతు.'[15]

'నేను గ్రహించక పోవచ్చు. కాని అతనికి తెలుసునని మాత్రం నాకు తెలుసు. అందువల్ల అతన్ని పిలుస్తున్నాను. నేను అనర్హుణ్ణి నైనా, అతని తత్వం నాకు తెలపుమని కోరుకున్నాను' అంటాడు ఆళ్వారు.

'ఎటుల నేను జయింతు
భయము గొలుపు ఈ ఐదింటిని ?
నీ కరుణ లేకున్న
నేను గెలువ లేను.'[16]
'జీవితపు ఊటను ధ్వంసము చేసి
భీకరమౌ అగాధములోనికి త్రోసి
నన్నలయించే యీ ఐదింటిని
సమూలముగా ధ్వంసము చేయుము
నాపై నీ కరుణ ప్రసరించి.'[17]
'అమృతమై రమ్ము
మద మెక్కిన యింద్రియముల నిచ్చితివి
మాయా ముఖముగ.
ఆ మాయా తిమిరమును పారద్రోలుము.'[18]

ఇంద్రియాల సంకెళ్ల నుంచీ, ప్రాపంచిక బంధాలనుంచీ తాను విముక్తి పొందేందుకు నమ్మాళ్వారు ఆధారపడిన పరబ్రహ్మతత్త్వం మానసికం కాదు ; ఆత్మనేకాక మిగిలిన వ్యాపారాలను కూడా సంతృప్తి పరచగలిగిన అనంత సౌందర్యోపేతుడైన అభిమాన దైవమే అది.[19] భగవంతుని అపార కరుణ, సౌందర్యాలను ఆధారంగా చేసుకున్నాడు ఆయన. 'వాటిని గురించి నేనెలా మాట్లాడగలను ? మనోజ్ఞతకు మారు పేరైన పద్మం నీనయన రామణీయకంతో

15. తిరువాయ్‌మొళి : 4. 7. 6.
16. పైదే : 7. 1. 7.
17. తిరువాయ్‌మొళి : 7. 1. 9.
18. పైదే : 7. 1. 8.
19. నమ్మాళ్వారు తాత్త్విక చింతన అధ్యాయం చూడండి.

ఉపమించడానికి అర్హమయింది కాదు. నీ పాదాలు నీ చేతులు - నీమనోహరాకృతితో పోల్చడానికి మేలిమి బంగారం ఎందుకూ పనికిరాదు. నీ ముందు ఈ ప్రాపంచిక వస్తువు ఏదీ ఉపమించడానికి అర్హంగా లేదు.'20 ఈ సందర్భంలో, తన యింద్రియాలను మనోవ్యాపారాలను వినియోగించి అనంత సౌందర్యానికి నామాంతరమైన ఆ భగవంతుడితో సంబంధం ఏర్పరుచుకోవాలని ఆయన ప్రయత్నించాడు. ఆవిధంగా తన యింద్రియాదులకు ఆ పరిపూర్ణునితో ఒక సంబంధం కల్పించి, వాటిని అదుపులో ఉంచుకోవాలనుకున్నాడు.

'నీలవర్ణుడా ! కిరీటధారీ !
నా మనస్సు
నీయందే లగ్నమై యున్నది
భువనత్రయము సేవించు
నీ పాదములందే యున్నది.'[21]

'నిన్నే ఆశ్రయించి యున్నవి
నా మాటలు.

నీవు నివసింపగా
నాహృదయ పట్టణ మున్నది.
దేవదేవా !
నిన్నే తడవుచున్నవి నాచేతులు ....
'సంతత దర్శన భాగ్యము కోసము
క్షణమైనా విరామము లేక
తహతహ లాడుచున్నవి నా కనులు.
'నీవాహనపు రెక్కల సవ్వడి వినగా
రిక్క పొడుచుకొన్నవి నా చెవులు
నీ నామ మాధుర్యము

నిండి యున్నది నా చెవుల ....
'చక్రధరుడా !
తపించుచున్నది నా ఆత్మ
భువినుండి నిన్ను చేరగా ....
'నన్ను లోగొనుము

---

20. తిరువాయ్‌మొళి : 3. 1. 2.

21. కిరీటమనగా భూమి, స్వర్గమని నంపిళ్లై అభిప్రాయం.

ఓ సుందరుడా
నీలమేఘ శ్యాముడా ! ....'[22]

ఆళ్వారు పరబ్రహ్మాన్వేషపు ఈ ఘట్టంలో, ఇంద్రియాలు పెరిగి పుష్టి పొందుతున్నయీ భూప్రపంచాలు భగవంతుడికి నివాసస్థానములవుతున్నాయి. ఎన్నిలోపాలున్నా, భూమి దేవలోకానికి సోపాన మవుతున్నది. ఇంద్రియాలు తమ యిచ్చవచ్చినట్టు సంచరించవచ్చు. అవి యిప్పుడు భౌతిక బంధాలకు కట్టువడలేదు. భౌతికాన్ని అధిగమించి భగవంతుణ్ణి చేరుకుంటాయి. ప్రత్యక్ష ప్రపంచపు ప్రతిబింబమే ప్రపంచ సౌందర్యం. అంతే కాదు. అది పరబ్రహ్మంలోని ఒక భాగం. సవ్యంగా కనక అనుభవించ గలిగితే, దాని పరిపూర్ణతను కూడా గ్రహించవచ్చు. పరబ్రహ్మాన్వేషణ ప్రారంభంలో ఆళ్వారు ఇహానికి దూరం కాదలచుకోలేదు. పైపెచ్చు ఇహలోకపు దృశ్యాలు ధ్వనులు సూర్యుడు వాన పువ్వులు కొండలు సముద్రం పచ్చని పొలాలు తోటలు మొదలైనవాటి రామణీయకాన్ని అనుభవిస్తున్నాడు. ఎందుకంటే అవి అన్నీ భగవంతుడివే. వాటిలో భగవంతుడి సౌందర్యం ప్రతిఫలిస్తున్నది కూడా. ప్రకృతిలోని ప్రతివస్తువూ పరిపూర్ణత నుంచి తాను వేరవుతున్న అంశాన్ని గుర్తు చేయడమే కాక భగవంతుని అనంత వైభవాన్ని గుర్తు చేస్తోంది.

అన్వేషణలోని తరువాతి ఘట్టంలో భగవద్దర్శన భాగ్యాన్ని నమ్మాళ్వారు క్షణకాలం పాటు పొందిన అనుభూతిని పొందుతున్నాడు. ఒక తిరువాయ్‌మొళి (4.7) లోని తొలి ఆరు పాశురాలలోనూ భగవత్ సాక్షాత్కారం కాని విషయాన్ని పేర్కొన్నాడు. వాటిలో ఆయన నిరాశ వ్యక్తమవుతోంది. కాని ఆ తరువాతి పాశురంలో ఆయన ఆకస్మిక ఆనందం ఇలా వర్ణించబడింది. 'దేవా! నేను నిన్ను కనుగొన్నాను. నీవు తులసిమాల ధరించావు.' ఆయన మొదట పొందిన నిరాశను ఈ కింది మూడు పాశురాలు వ్యక్తం చేస్తున్నాయి :

'చక్రధరుడా!
నీ కోసము వెదకుచున్నాను
నిన్నెచట చూడ గలను?....
సజల నయనుడనై
పరికించు చున్నాను ప్రతి చోటు.
ఫలము మాత్రము హుళక్కి.
పాపాత్ముడను నేను
నిన్ను కనుగొన లేకున్నాను'.... [23]

---

22. తిరువాయ్‌మొళి : 3. 8.
23. పైదే : 4. 7. 9. 10

భగవంతుణ్ణి క్షణకాలంపాటు కనుగొన్న ఆ అనుభూతితో పాటు వివిధ అవతారాలకు సంబంధించిన సన్నివేశాలను ఆళ్వారు అభివర్ణిస్తాడు. విజయాన్ని స్ఫురింపజేసే ఆనందాన్ని ఆయన వ్యక్తం చేశాడు. 'భూభారాన్ని తగ్గించే నిమిత్తం భగవంతుడు భారతయుద్ధం తలపెట్టాడు. మాయ లెన్నో పన్నాడు. యుద్ధం చేసిన ప్రతిపక్షుల్ని సంహరించాడు. ఆ తర్వాత తన లోకానికి వెళ్లిపోయాడు. అతని వైభవాన్ని దర్శించాను. అతని పాద పద్మాలను సేవించాను. అతడు తప్ప నా కింకెవరు భగవంతుడు? ఇంతకంటె నాకు కావలసింది ఏమిటి ?.... ఈ విశాల ప్రపంచంలో నాతో సమాను లెవరు?' అన్నాడు.[24]

'పద్మ నయనుడు నీలవర్ణుడు
శంఖ చక్రధరుడు
నిర్మలుడు మాయగాడు
అవాఙ్మానసగోచరుడు
ఇప్పుడాతడు నా కళ్లలో ఉన్నాడు
నా బుజములపై ఉన్నాడు
భరించుచున్నాను.'[25]

మళ్లీ ఇలా అన్నాడు

'దేవా! నిన్నీ క్షణమున
గట్టిగా పట్టుకొంటి'[26]

కాని అంతలోనే ఆ ఆనందోత్సాహం ఎలా వచ్చిందో అలా మాయమయింది. దుస్సహమూ నిబిడమూ అయిన అంధకారం అలుముకుంది. మళ్లీ అన్వేషణ మొదలయింది. ఈసారి మునపటికంటే మరీ పట్టుదలతో గాఢానురక్తితో మొదలయింది. ఆ ప్రేమ బాధగా బహిర్గతమయింది. మాటలు పెనగులాడాయి. చివరికి అర్ధానికి అతీతమైన అర్ధంగా అవి వెలువడ్డాయి.

'కమలనేత్రుడా ప్రవాళాధరుడా !
నా మరకతమా !
నా అమృతమా !
సముద్ర మథనుడా !
నిన్ను దర్శింప కరుణింపుమా !

---

24. తిరువాయ్‌మొళి : 6. 4.
25. పైదే : 1. 9.
26. పైదే : 2. 6. 1.

'నిన్ను దర్శింప కరుణింపుమా
అని వేడుచున్నాను
కనుల నీరు తొల్కాడగా.
కలత చెందినాను.
వదరుచున్నాను నీ పేరు
బహు భంగులుఁగా.
జలధి పరివేష్టిత మౌభూమిని
పైకెత్తిన దేవా !
నిన్ను దర్శింప కరుణింపుమా !
'ఎల్ల లోకముల
సృష్టించి రక్షించి లోగొను
ప్రాణమా, ప్రాణప్రాణమా !
నిన్నెచట చూడఁగలను ?
'నిన్నెచట కలసికొందు
సప్తభువనములును నీవే
సర్వ దైవములును నీవే
వారి కృత్యములును నీవే
నీవే నెలకొని యుందువు
అతీతమై ఏదేని ఉన్నచో.
సూక్ష్మాతి సూక్ష్ముడవు
పరిశుద్ధాత్మవు
స్వర్లోకము నధిగమింతువు
దేవా ! నిన్నెచట కలసికొందు ?
'నిన్నెటుల పూజించుటో
నే నెరుగను.
నీ నుండి ప్రభవించినవే
నా మనోవాక్కర్మలు.
నేనును నీ వాడనే.
సర్వస్వము నీవే
నరకము కూడ నీవే.
'నే నెచట నున్న నేమి
స్వర్గములో ఈ నరకములో—
దేవా ! భయకంపితుడ నగుచుంటి
న న్నేమియు పట్టించుకొనక

నీవా స్వర్గములోనే ఉందువు.
అనుగ్రహింపుమా నీకరుణ.
నీ పాదములే శరణు వేడితి.'[27]

ఆలోచనలూ భావాలూ పెనవేసుకుంటున్నాయి. మాటలేమో మాటల కందని వానివైపుగా పరుగులు తీస్తున్నాయి.

'పెంపుడు చిలుకలారా!
మీతో నాకేమియు సంబంధము లేదు.
పికమయూర పూవై విహంగములారా!
మీతో నా కేమియు సంబంధము లేదు.
క్షీరసాగరమునకో
వైకుంఠమునకో అతడు వెడలినాడు
నా కంకణములు నా హృదయము
నా అందచందము లన్నియు గ్రహించి.
అవి నా చెంతనే యున్నవి
మీయందరినీ
బంధము లన్నిటినీ విసర్జించినగాని
అచటికి నన్నతడు రానీయడు.
అతనిని మాత్రము విసర్జింపను.'[28]

'ఏమి చేయుదు నేను?
ఎటుల భరింతు, ఏమని భాషింతు
అతని మధుర వేణునాదము వినవచ్చుచున్నది.
నేను తలచుటకు మునుపే
అతని మనోహరనేత్రాలు మాటలాడు.
ఆ మాటలు చూచు ఒకదాని నొకటి.
అతని గీతము నాయెడద నలచు
ఎడదయే లేకుండ చేయు
అతడీ సాయం సమయమున వచ్చెను
ఇది తప్ప నాకేమియు తెలియదు
అతడు రాలేదు'[29]

---

27. తిరువాయ్‌మొళి: 8. 1.
28. పైదే : 8. 2. 8.
29. పైదే : 9. 9. 9.

ఆళ్వారు ఇంకా ఇలా పేర్కొన్నాడు : 'మకుటధారి వయిన దేవా ! రా. విశాల పద్మసరోవరంవలె చల్లగా రా. పగడాల పెదవులు చక్కని కుండలాలు నాలుగు చేతులూ గల వాన మబ్బువలె రా. మరకత పర్వతం నుంచి ఉదయిస్తున్న సూర్యునిలా రా ? అని.[30]

ఈ ఘట్టంనుంచి యింక ఒకే ఒక సోపానం ఉంది పరబ్రహ్మ సాక్షాత్కారానికి. ఆ సోపానం ద్వారా తాను ఆ పరిపూర్ణుని సమీపించినట్లుగా నమ్మాళ్వారు తిరువాయ్‌మొళిలోని కడపటి దశకం చెపుతున్నది. భగవంతుని ప్రియులు చివరికి తమ గమ్యాన్ని ఎలా చేరుకుంటున్నదీ యీ తిరువాయ్‌మొళి అభివర్ణిస్తున్నది :

'ఊదెను తూర్యములు గట్టిగా
విశాలాకాశమున అలముకొన్న మేఘాలు
సప్త భువనముల రక్షించు వాడనుచు.
తరంగ హస్తములను పైకెత్తి
నాట్యము చేసెను సాగరము.
పరిపూర్ణుని వైపు
సారించెను దృక్కులు.'[31]

గమ్యం చేరుకున్నాయి. నమ్మాళ్వారు ఆ కోవకు చెందినవాడని తిరువాయ్‌మొళి తుదిలో చెప్పబడింది. అయితే ఆ విషయాన్ని అభివర్ణించేందుకు తగిన మాటలు ఎక్కడున్నాయని ! మాటల కందని ఆ భగవంతుణ్ణి బంధించాలని అవి శరవేగంతో లేచి అటూ యిటూ పరిభ్రమిస్తున్నాయి. మరి ఫల సిద్ధి ? 'ఉన్నతమూ అగాధమూ సువిశాలమూ అయిన దాన్ని శూన్యం ఆవరించడమా ? అది సుమ సుకుమారమైన వైభవాన్ని అధిగమించడమా ? లేకపోతే అది ఆనంద పారవశ్యమా ? ఏమో, ఎవరు చెప్పగలరు ? ఇది మాత్రం సుస్పష్టం. నువ్వు నన్ను పరివేష్టించావు. నా తపన ముగిసింది.'[32]

అదే అన్వేషణ పరిసమాప్తి కూడా !

---

30. తిరువాయ్‌మొళి : 8. 5.
31. పైదే: 10. 9. 1.
32. పైదే : 10. 10.

# 8. నమ్మాళ్వారు తాత్త్విక చింతన

ఆధ్యాత్మిక వాదిగా కవిగా నమ్మాళ్వారు పరబ్రహ్మాన్వేషణ సాగించాడు గాని ఒక క్రమపద్ధతిలో తాత్త్వికునిగా సాగించలేదు. ఒక నిర్ణీతమైన తాత్త్విక చింతనను ఇదమిత్థమని ఆయన కృతులు అభివ్యక్తం చెయ్యవు. పై పెచ్చు ఒక క్రమంలో సాగని, సహనం లోపించిన అన్వేషణా విధానం గోచరిస్తుంది. వేగిరపాటు వల్ల మాటలలో తికమక కనిపిస్తుంది. భావోద్వేగంతో ఆలోచనలు ముడివడి వుంటాయి. ఇవన్నీ భగవంతుని పట్ల ప్రగాఢమైన ప్రేమ కలిగిన విషయాన్ని వ్యక్తం చేస్తాయి. కాని ఆలోచనా విధానానికి స్పష్టత చేకూర్చవు. కేవల తాత్త్వికుని లక్ష్యసిద్ధికి తోడ్పడవు. అయినప్పటికీ, ఆయన అనుభవాత్మకమైన కవితలో ఒక తాత్త్విక చింతన కొట్టవచ్చినట్టు కానవస్తున్నది. అది యీ పుస్తకంలో ముక్కలు ముక్కలుగా వ్యక్తం చేయబడినా, వాటిలోంచి సహేతుకమైన చింతనను గ్రహించవచ్చు. ఈ చింతనా విధానమే ప్రముఖ వైష్ణవాచార్యులైన శ్రీ రామానుజులవారిని, వేదాంత సూత్రాలకూ గీతకూ ఆయన వ్యాఖ్యానం వ్రాసేటప్పుడు, ప్రభావితం చేసినట్లు భావించబడుతున్నది.

వేదాలనుంచీ ఉపనిషత్తుల నుంచీ నమ్మాళ్వారు తాత్త్విక చింతనను ఎంతవరకు గ్రహించిందీ ఇదమిత్థమని చెప్పలేము. ప్రసిద్ధ వైష్ణవ వ్యాఖ్యాతలైన నంపిళ్లై, పెరియవాచ్చాన్ పిళ్లైలు నమ్మాళ్వారు కృతులకూ, వేదోపనిషత్తులు పురాణేతిహాసాలు మొదలైనవాటికీ పోలికలెన్నో ఎత్తి చూపారు. సాంప్రదాయికంగా వస్తున్న నమ్మాళ్వారు జీవిత వృత్తాంతం బట్టి చూస్తే, జననం మొదలుకొని పెక్కు సంవత్సరాలుగా ఆయనకి బయటి ప్రపంచంతో సంబంధం లేదు. పైగా, ఆయన జన్మించిన కులంవారికి, ఆ రోజులలో, సంస్కృతంలోని వేదాలు మొదలైనవి అందుబాటులో లేవనే చెప్పాలి. కాగా మధురకవికి యిచ్చిన స్మరణీయమైన ఆ ప్రత్యుత్తరంతో మౌనాన్ని వదులుకున్న ఆ తొలి పదహారేళ్లదాకా, నమ్మాళ్వారుకి వేదోపనిషత్తులతో ప్రత్యక్ష పరిచయం లేదని భావించవలసి వుంటుంది. అందువల్ల నమ్మాళ్వారు కృతులకూ ఆ ప్రసిద్ధ సంస్కృత పవిత్ర గ్రంథాలకూ మధ్య కనిపించే పోలికలు కొంతవరకు అధ్యాత్మికానుభూతికీ సత్యం గురించిన అంతరిక జ్ఞానానికీ సంబంధించిన భావాలుగా గ్రహించడం సముచితం.[1]

---

1. 'ఈశా వాస్యం ఇదం సర్వం' (సర్వమూ ఈశ్వరుని నివాసస్థానమే) – ఇది సహేతుకంగా నిర్ణయించబడలేదు. ఈశోపనిషతులోని తొలివాక్య మిది. అలాగే, శ్రీమన్నారాయణుడు పరబ్రహ్మమన్నది కూడా చర్చించబడలేదు. తైత్తిరీయోపనిషత్తులో ఇది ఉదాహరించబడింది.

అంతేకాక వేదోపనిషత్తులలోని చాలా భావాలు నమ్మాళ్వారు కాలపు హిందూమత పునరుద్ధారణ వల్ల వాడుకలోకి వచ్చి వుండవచ్చు. ఆ భావాలను ప్రవచించే పురాతిణేహాసాలు కూడా సామాన్యుల వ్యవహారంలో కలిసి వుండ వచ్చు. పైగా నమ్మాళ్వారుకి చాలాకాలం ముందునుంచీ నారాయణుని (తిరుమాల్) పూజించే సంప్రదాయం తమిళులలో ఉంది.[2] ఏమయినప్పటికీ, ఈ విషయాన్ని యింతటితో విరమిస్తాను. వేదోపనిషత్తులు ఇతర హైందవ పవిత్ర గ్రంథాలకీ తమిళుల తిరుమాల్ అర్చనా విధానానికీ గల సంబంధ బాంధవ్యాల జోలికి పోకుండా, పరబ్రహ్మం గురించి నమ్మాళ్వారు కృతులు ఏం చెప్పాయో ఆ అంశం మాత్రం తెలియజేస్తాను.

భగవంతుడే పరబ్రహ్మమని నమ్మాళ్వారు అభిప్రాయం. అది పూర్తిగా వేదాంతపర మయింది. ఆత్మా ప్రపంచమూ ఆయన దృష్టిలో సత్యాలే. అయితే వాటికి ప్రత్యేక అస్తిత్వ మంటూ లేదు. అవి భగవంతుని అంతర్భాగాలు. వాటిలో అతడు నెలకొన్నాడు, అవి పరబ్రహ్మానికి చెంది నవి. అందువల్ల పరబ్రహ్మం నిజానికి ఒక్కటే.

'త్రిపురాంతకుడైన శివునికి
ఒసగెను దక్షిణభాగము.
సర్వదిశాభిముఖుడైన బ్రహ్మను
సృష్టించెను నాభినుండి.
ఈ లోకమునూ అతడు
గోచర మగునట్లు చేసె.
అతడేమో హృదయస్థుడు.
నిజము పరికించుచో
అందరూ అతనిలో ఉన్నారు.
అదే అతని మాయ.'

కాగా, నమ్మాళ్వారుకి ఈ ప్రత్యక్ష ప్రపంచం భ్రమ కాదు. కొందరు భారతీయ ఆదర్శవాదులూ ఇలాగే భావిస్తారు. అది నశ్వరమే. ఇందులో సందేహం లేదు. అయితే అతని నిర్ణయం ప్రకారం ఎప్పటికప్పుడు మళ్లీ ప్రభవిస్తూ వుంటుంది. వృద్ధిక్షయాలు, జననమరణాలు - ఇవి నిరంతరం కాలచక్రంలో కొనసాగుతూనే వుంటాయి. పరబ్రహ్మం నుంచి అది ప్రభ వించింది. భగవంతుని వల్ల అది మనగలుగుతున్నది. స్థితికారకుడూ అతడే. ప్రళయకాలంలో అది అతనిలో లీనమై పోతుంది, పునఃసృష్టి

2. తమిళుల అత్యంత ప్రాచీనమైన సంగసాహిత్యంలో ఇది ఉంది.
3. తిరువాయ్‌మొళి : 1. 3. 9.

కావడానికి ప్రళయం పరిసమాప్తి కాదు. ఆ తర్వాత ప్రపంచం మళ్లీ ప్రభ విస్తుంది, అతని ఆజ్ఞానుసారం మరొక కాలచక్రంలోకి ప్రవేశిస్తుంది.

'శివుడు లోకాలను నశింపజేయగా
బ్రహ్మ వాటిని తిరిగి సృష్టింపగా
అతడు మాయ యేదో పన్నును
సురలకు సైతము తెలియదది.'[4]
'నేను సృష్టించితి
జలధి పరివేష్టితమౌ ప్రపంచమును.
ఆ ప్రపంచమును నేనే.
పరిపాలకుడను నేనే.
ధ్వంసము చేయుదు
లీనము చేసికొందు తుదకు.
భగవంతుడను నేను.'[5]

'ప్రపంచమును నేనే' అనే మాటలు గమనించదగినవి. సృష్టి స్థితి లయములతో పాటు అతడు పునఃసృష్టిస్తున్నాడు. ఇది అతని అనంతమైన లీల. ఈ ప్రపంచం పుట్టుతూ గిట్టుతూ ఎప్పుడు మార్పులకు లోనవుతూ వుంది. అయినా అదే అతని విరాట్ స్వరూపం. ఈ దృష్టితో చూస్తే, అతడే ప్రపంచం. చిన్నదైనా పెద్దదైనా ప్రతి వస్తువులోనూ అతడు నెలకొన్నాడు. అది అణువే కావచ్చు; నీటి బుడగ కావచ్చు.[6] పిచ్చిపువ్వు కావచ్చు.[7] చక్కని నక్షత్రమే కావచ్చు. అంతర్యామియై అతడు సర్వ పదార్థములలోనూ నెలకొని వున్నాడు. కనిపించే ప్రతి చోటూ అతని నివాస స్థానమే. అయితే అది మనం చూడగలిగి వుండాలి.

'అన్నిటా అతడున్నాడు —
నిస్సీమమైన ఆకాశము
పృథివ్యాపస్తేజో వాయువులు
అన్నిటినీ ఆక్రమించినాడు.
దేహములో ప్రాణము వలె
అన్నిటా అతడు నెలకొన్నాడు.

---

4. తిరువాయ్‌మొళి : 1. 1. 8.
5. పైదే : 5. 6. 1.
6. పైదే : 1. 1. 10.
7. పెరియ తిరువంతాది : 73.
8. తిరువాయ్‌మొళి : 3. 1. 8.

కాని అగోచరు డతడు.
వేద వేద్యు డతడు
శ్రుతులే అతని ఉనికి.
లోకము లన్నియు అతనిలో నెలకొన్నవి.' 9

అందువల్ల మానవుని హృదంతరాళాలలో ఎక్కడో భగవంతుని రహస్య ఆలయం నెలకొని వుంది. నమ్మాళ్వారు ఇలా పేర్కొన్నాడు :

'నాలో అతడున్నాడు.'10
'నాలో అతడు లేకున్న
నే నెట్లు జీవింతు ?'11
'అతడే సహర్షముగ వచ్చె
అతి రహస్యముగ ఎదలోకి చొచ్చె
నా శరీరములో అతడు నిలిచె
నా ఆకృతిలో కలిసిపోయె.'12

నమ్మాళ్వారు అగత్తనన్ (లోపలివాడు), పురత్తనన్ (బయటివాడు) అని సాభిప్రాయంగా ఉపయోగించాడు.

'అతడున్నాడు లోపల, ఉన్నాడు బయటను.'13
లోన ఉన్నాడనుకొన్న
అతని ఆకృతులే యివి యన్నియు.
లోన లే డనుకొన్న
ఈ ఛాయ లన్నియు
అతని ఛాయలే.
అత డున్నాడు, ఉన్నాడు
ఈ గుణద్వయముతో.
లోన ఉండియు, ఉండకయు
అతడు నెలకొన్నాడు.'41

ఈ రెండు గుణాలు సర్వవ్యాపకుడైన అతని లక్షణాలు. ఆ తరువాత-అనగా అన్వేషణానంతరం - నమ్మాళ్వారు పరబ్రహ్మ సాక్షాత్కారం పొందినప్పుడు, ఈ విషయాన్ని మరింత విపులంగా అభివర్ణించాడు.

---

9. తిరువాయ్‌మొళి : 1. 1. 7.
10. పైదే : 2. 5. 3.
11. పైదే . 1. 7. 6.
12. పైదే : 1. 7. 7.
13. పైదే : 1 3. 2.
14. పైదే :1. 1. 9.

'అనంత మాయాన్వితు డతడు
జిత్తులమారి చోరుడు.
ముక్కు మొగ మెరుగని కవిగా
కనుగప్పి నాలో చొచ్చి
మనః ప్రాణములలో కలసిపోయె.
వాటి నతడు కబళించి
తానై సెలకొన్నవాడు
అంతటా నిండియున్న వాడు.'[15]

ఈవిధంగా భగవంతుడు మానవుడిలో ఉన్నాడు. బయటకూడా, అనగా లోకంలోనూ ఉన్నాడు. అతడు శిష్యగణానికి చెందిన సహజ శక్తులు-అమరులు-అతడు వేసిన నమూనా ప్రకారం నిరంతరం నిర్వి రామంగా కృషి చేస్తున్నాయి. అతడే భూత భవిష్య ద్వర్తమానాలు. అతడు సృష్టించిన కాలం అతడే:

'నీవే కాలమవు.
భూత భవిష్యత్తులు నీవే.'[16]

మరో భిన్నమైన ప్రత్యేకార్థంలోనూ అతడు లోపల, వెలుపల ఉన్నాడు. ఎక్‌హార్ట్ (Eckhart) భావించినట్లుగా, అతడు బ్రహ్మాండ మంతటా ఉన్నాడు. చరాచరములలోనూ మానవుడిలోనూ నెలకొని వున్నాడు. కాని అతడు లేడు కూడా. అన్నిటినీ అధిగమించీ ఎవరి చేతికీ అందకుండా వున్నాడు. అతడు కాలాతీతుడు; లోకాతీతుడు. పరిమిత మైన మానవ మేధకే కాక అతని అత్యంత పరిమిత వచోవిలాసానికి కూడా అతీతుడు.

'నా హృదయములోనే కాదు
అందరిలోనూ నెలకొన్నాడు
ఆ మాయగాడు.
అతడు దేహప్రాణములు
అగ్ని వాయువులు.
అతడు సమీపస్థుడు
దూరస్థుడు కూడా!
ఆలోచనా తీతుడు'

15. తిరువాయ్‌మొళి: 10. 7. 1.
16. పైదే: 3. 8. 8.

నిర్మలుడు, ఎవరికీ అందడు.'[17]
'సలుపవచ్చుగాక విశ్వప్రయత్నము
తెలిసికొనలేని అగాధ మిది
కొలువలేము పొడవు వెడల్పులు
బ్రహ్మాండమైన ఆకృతి.
జీవులారా !
ఎరుగలేరు మీరు
ఎంత ప్రయత్నించినా.'[18]

పరబ్రహ్మం ఒక్కటే అయినా, నమ్మాళ్వారుకి అందులో అనం తత్వమూ అధిగమించే తత్వమూ కనిపించాయి. కాని వ్యక్తి దృష్ట్యా, వ్యక్తి ప్రపంచం భగవంతుడు అనే మూడు లక్షణాలు కనిపిస్తాయి. మాన వుడి ఆత్మకు ప్రత్యేకమైన అస్తిత్వం ఉంది. అలాగే ప్రపంచానికి కూడా. కాని భగవంతుడు రెండింటిలోనూ ఉన్నాడు. ఆ రెండూ అతనిలో ఉన్నాయి. వ్యక్తీ ప్రపంచమూ నిజాలే. అయితే స్వతంత్రంగా మనలేవు. అవి భగవంతునికి చెందినవి. ఈ విషయాన్ని నమ్మాళ్వారు అవ్యక్త భాషలో తెలియజేశాడు. పరబ్రహ్మం అనిర్వచనీయం, అతి గూఢం, కొలవడానికి శక్యం కానిదీ అని పేర్కొన్నాడు. మానవ విజ్ఞానానికి అందనిది. అలాగే కాలానికి కూడా అతీతమయింది. చివరికి అతడు సృష్టించిన దేవతలకు సైతం భగవంతుడు అంతు చిక్కడు.

'బ్రహ్మమును
ఎవరు తెలిసికో గలరు ?
అతని రూపములే అయినా
ఆ చతుర్ముఖుడు శివుడు —
వారైనను తెలిసికొన గలరే
నా దేవ దేవుని ?'[19]
'మూలము లేని మూల కారణుడు
అసమానుడతడు
అన్నిటికిని కారణభూతుడు
ప్రపంచము తల క్రిందులైన
అతడే పునఃసృష్టించువాడు

17. తిరువాయ్‌మొళి : 1. 9. 6.
18. పైదే : 1. 3. 6.
19. పైదే : 2. 7. 12.

అతనిని కొలుచు మర్త్యులు గలరె ?'[20]
'సమున్నతు డెవరు ?
సౌజన్య మూర్తి యెవరు ?
అతడే.[21]
ఇది లేదు, అది లే దనుచు
భావింపగా తరమె ?
భూమ్యాకాశములందు
అతని ఆకృతిని వర్ణింపగా
ఇంద్రియములకు సాధ్య మగునె ?
నితాంత సౌజన్యమూర్తి అతడు
అతనిని సమీపింప తరమె ?'[22]

పరబ్రహ్మపు అనిర్వచనీయ స్థితిని విరోధాభాసముల సహాయంతో నమ్మాళ్వారు అభివర్ణించడానికి ప్రయత్నించాడు :

'నన్ను పాలించు నా దేవ దేవుడు
కలిమి లేములు
స్వర్గ నరకములు
మిత్రా మిత్రులు
విషా మృతములు
బహుభంగుల వ్యాప్తు డైనవాడు.
'అనుభవించు సుఖ దుఃఖములు
స్పష్టతా స్పష్టతలు
అనుకంపయు శిక్షయు
వేడియు నీడయు అతడే.
అతిగూఢు డతడు.
'అతడు పాప పుణ్యములు
వియోగ సమాగమములు
స్మృతి విస్మృతులు
ఔగాములు, ఉన్నది లేనిది
అన్నియు నతడే.
'అతడే ధర్మా ధర్మములు

20. పెరియ తిరువందాది : 24
21. తిరువాయ్‌మొళి : 1. 1. 1.
22. పైదే : 1. 1. 3.

తెలుపు నలుపు ఎరుపులు
సత్యా సత్యములు
యౌవన వృద్ధాప్యములు
ప్రాత క్రొత్తలు....
'సంతోష కోపములు....
కీర్త్యప కీర్తులు....
'అతడే ఎర్రని ఎండ, చల్లని నీడ
అణు తుల్యుడు, మహితుడు
సంకుచిత వైశాల్యములు
కదలు వాడు కదలని వాడు
అన్నియు నాతడే
అందరు పొందని వాడు.'[23]

అయినా, నమ్మాళ్వారుకి తన ఇష్టదైవంలో విశ్వాసం ఉంది. దైవత్వం అన్నది అనిర్వచనీయమనే అంశం ఆయనకి తెలియకపోదు. ఆ భావాన్ని 'సౌజన్యమనీ మహనీయమనీ మంగళప్రదమనీ ఆయన అంతా అతడే, అనే మాటల్లో ఇమిడ్చాడు'.[24] భగవంతుని కోసం తహతహ లాడాడంటే, తన యిష్ట దైవమైన శ్రీమన్నారాయణుని కోసమే ఆయన తపన చెందాడు. శంఖచక్రధరుడనీ, తులసిమాల ధరిస్తాడనీ, స్వర్ణ దుకూలాలు ధరిస్తాడనీ, మకుటధారి అనీ, నీలమేఘుడనీ, పద్మనేత్రుడనీ, రూపెత్తిన సౌందర్యమనీ తైత్తిరీయోపనిషత్తు నారాయణుని అభివర్ణించింది. ఆ నారాయణుని తమిళులు తిరుమాల్ అని వ్యవహరించారు. వేదాలలోనూ అత్యంత ప్రాచీనమైన తమిళ సంగ సాహిత్యంలోనూ నారాయణ ప్రశంస కనిపిస్తుంది.[25] నారాయణుడు పరబ్రహ్మమని నమ్మాళ్వారు సంభావించాడు; వ్యక్తావ్యక్త భాషలో తరుచుగా కీర్తించాడు.

'స్వర్ణమకుటధారి
వీరాధి వీరుడా
చతుర్భుజుడా
తులసిమాలలు దాల్చువాడా
దేవదేవా!'[26]

---

23. పైదే: 6. 3. (1. 2. 4. 5. 6. 10)
24. సెయింట్ బెర్నార్డ్.
25. క్రీ.పూ. రెండవ లేక మూడవ శతాబ్ది నుంచి క్రీ.శ. రెండవ శతాబ్ది దాకా సంగయుగం వర్ధిల్లినట్లు చెప్పబడుతున్నది.
62. తిరువాయ్‌మొళి: 2. 5. 8. 9.

అని ప్రారంభించి, యింకా యిలా అన్నాడు.

'పురుషుడు కాదు స్త్రీయు కాదు.
బుద్ధికి అందని వాడతడు.
అతడిది, అతడిది కాదు.
అతడు తోచు తలచినట్లు
అయినా ఆ రూప మతనిది కాదు.'[27]

తన యిష్టదైవమైన నారాయణునే నమ్మాళ్వారు కీర్తించింది. కాని అప్పుడప్పుడు వ్యక్తమైన ఆకృతి అవ్యక్తంగా అనిర్వచనీయంగా పరిణమిస్తుంది.

'దేవా! చెప్పుము
నీ వదన వైభవము
ప్రతిఫలించెనా నీ స్వర్ణమకుటమున?
నీ పాదముల ప్రకాశము
వికసించెనా నీవు నిలిచిన పద్మముగా?
నీ మేని కాంతియే
మారెనా స్వర్ణదుకూలములుగా?
ధరించిన మణిభూషలుగా?'[28]

ఇంతవరకూ సుస్పష్టమైన భాషలో సాగింది. ఇక అస్పష్టమైన ధోరణిలో

'నీది సంతత వైభవము
వికసింపనిది, కృశింపనిది.
తుదిలేని విశుద్ధ విజ్ఞానమూర్తివి
పరిపూర్ణుడవు సర్వమయుడవు.'[29]

అంతర్యామిగానే కాక వివిధ కాలాలలో అవతరించి భగవంతుడు ఈ భూమితో సంబంధం పెట్టుకున్నవాడుగా నమ్మాళ్వారు సంభావించాడు. అవతారమెత్తినప్పుడు అతడు దేహధారియై క్షయమునకు లోనయ్యాడు. కాలావధులకు కట్టువడియున్నాడు. అన్నిటినీ అధిగమించినవాడు. జనన మరణాలతో కూడిన యీ ప్రపంచానికి రావడమే అవతార మంటేను. భగవద్గీత ఘోషిస్తున్నట్లు, మానవుడి మీద గల తుదిలేని అనుకంపనూ

27. పైదే: 2. 5. 10.
28. తిరువాయ్‌మొళి: 3. 1. 1.
29. పైదే: 3. 1. 8.

నిర్దుష్టప్రయోజనాన్ని పురస్కరించుకునే భగవంతుడు ఇలా ఐచ్ఛికంగా అవతారాలు దాల్చాడు. చెడుని సమూలంగా పెరికి పారవెయ్యడానికీ ధర్మస్థాపనకూ అని నమ్మాళ్వారు ఉద్ఘాటించాడు.

'ధర్మాత్ముల బాధించిన కంసుని
విగతజీవుని చేయగా నీవు
అవతరించితివి పృథివిని
వైభవోల్లసిత స్వర్లోకమును వీడి.'[30]
'మానవుడై దేవు డవతరించి
దుఃఖమయమౌ జీవితము గడుపుట
మా కండ్లయెదుట సాక్షాత్కరించుట
దుఃఖము నుండి పైకెత్తి మమ్ము
దైవత్వమునకు గొనిపోవుటకే.'[31]

జీవశాస్త్ర పరిణతికి ప్రతీకలే ఈఅవతారాలని కొందరు అభిప్రాయ పడగా, ఆనంద కె. కుమారస్వామి, ఆల్డస్ హక్స్లి వంటి మరికొందరు మనస్తత్వ, వేదాంత శాస్త్రములలోని నిత్యసత్యములను సూచించే ప్రత్యేక చిహ్నాలుగా వాటిని పరిగణించారు.[32]

అవతారాలు చారిత్రక సత్యాలనీ, మరల మరల సంభవించేవనీ నమ్మాళ్వారు భావించాడు. చాలాచోట్ల ఆయన అవతారాలు గురించి చెప్పాడు. అవి జరిగినవనే ఆయన అభిప్రాయం. అవి జరిగిన కాలాల్లో తాను జీవించక పోతినే అని విచారించాడు. చర్మ చక్షువుకి భగవంతుడు కనిపించకపోయినా, మనస్సుకి అవతారాలు గోచరిస్తాయి. రెండు విధాలుగా అవి ఆయన దృష్టిలో సత్య సమ్మతములు. అవి ఒకప్పుడు జరిగిన సంఘటనలు. అంతేకాక అవి సతతమూ మానవుని హృదయంలో జరుగుతూ వున్నాయి. కాగా అవతారాల వివరాలను గుర్తు చేసుకున్నాడు. ఉదాహరణానికి, కృషావతారంలో గోకు

---

30. తిరువాయ్‌మొళి : 3. 5. 5.
31. పైదే : 3. 10. 6.
32. కృష్ణలీల చరిత్ర కాదని మానవుని హృదయంలో ఆవిష్కరించబడిన ఒక విధానమనీ వైష్ణవ గ్రంథాలు పేర్కొంటున్నట్లు ఆనంద కె. కుమార స్వామిగారు తమ హిందూయిజం అండ్ బుద్ధీజంలో పేర్కొన్నారు. మనస్తత్వ, వేదాంత శాస్త్రాలలోని పరమ సత్యానికి ప్రతీకయే కృష్ణ లీల.... భగవంతుని విషయంలో మానవుడు సాత్త్విక ప్రవృత్తి గల స్త్రీ అవుతున్నాడు— ది పెరెన్నియల్ ఫిలాసఫీలో ఆల్డస్ హక్స్లి.

లంలో కృష్ణుడు[33] నెరపిన బాల్యక్రీడల్నీ, త్రివిక్రమావతారంలోని భయంకరాకృతినీ హిరణ్యుణ్ణి సంహరించిన నరసింహునీ గుర్తు చేసుకున్నాడు. భగవదవతారములోని సువిశాలమైన భావం నమ్మాళ్వారుని బహుధా ఆకర్షించింది; స్పందింపజేసింది. సమున్నతులలో సమున్నతుడైన భగవంతుడు హీనాతిహీనుల మధ్యకి రావడం, సామాన్య మానవుల బాధలను దుఖాఃలను భరించడం ఆయన్ని కదిల్చి వేసింది. సకల లోకనాయకుడైన ఆ భగవంతుడు అడవిలో ఆలకాపరుల మధ్య బాలకృష్ణుడై నివసించడం, పోయి పోయి వెన్నను దొంగిలించిన కారణంగా రోటికి బంధించబడడం ఇందుకు ఒక ఉదాహరణం.[34] ఈ అంశం నమ్మాళ్వారు కవితను ప్రభావితం చేసిన వైనం మరోచోట ప్రస్తావించబడింది.

నమ్మాళ్వారు ప్రస్తుతించిన పవిత్రక్షేత్రాలు దక్షిణాపథానికి, ముఖ్యంగా కేరళకు చెందినవి. ఆయన స్వయంగా ఈ క్షేత్రాలు సందర్శించాడా అనే సందేహం కలుగుతుంది. కురుగూర్ అని ఆనాళ్లలో వ్యవహరించబడిన తిరునగరిలోని చింత చెట్టుని ఆయన విడిచి పెట్టలేదనీ, వివిధ క్షేత్రాల నుంచి ఆయా దైవతాలే దర్శన మివ్వాలని ఆయన వద్దకు వచ్చారనీ సంప్రదాయజ్ఞుల కథనం వల్ల విదితమవుతున్నది. ఏది ఎలా ఉన్నా, ఆయా క్షేత్రాలను వర్ణించేటప్పుడు నమ్మాళ్వారు ఎక్కువగా ప్రకృతి వర్ణనలు చేశాడు. ఆయన దృష్టిలో ప్రకృతి భగవంతుడి శరీరం. ఆయా అవతారాలలో భగవంతుడు కనిపించిన ప్రత్యేక రూపాన్ని అభివర్ణించాడు. తిరునెల్వేలి జిల్లాలో తామ్రపర్ణి తీరాన గల తిరుప్పుళింగుడిలోని దైవాన్ని ఆయన ఇలా సంబోధించాడు.

'తిరుప్పుళింగుడిలో శయనించిన దేవా!'[35] అని.

ప్రతి పుణ్యక్షేత్రమూ నమ్మాళ్వారు దృష్టిలో భగవంతుని నిలయమే. వేంకటం[36] గురించి యిలా అన్నాడు.

'అన్నిటికీ అతీతుడా!
తులసి మాలలు దాల్చువాడా!

---

33. తిరువిక్రమావతారంలో భగవంతుడు ఒక పాదంతో భూమినీ, మరో పాదంతో ఆకాశాన్ని కొలిచాడు
34. తిరువాయ్‌మొళి : 1. 3. 1.
35. తిరువాయ్‌మొళి : 9. 2.
36. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల-తిరుపతి క్షేత్రం.

చల్లని వేంకటములో
నీవుందువు.'[37]

భగవద్దర్శన భాగ్యం కోసం పరితపించే నమ్మాళ్వారు, తన ప్రయత్నం ఒక్కటే చాలదనీ, సంపూర్ణ శరణాగతి ఒక్కటే అందుకు ఉపకరిస్తుందనీ పేర్కొన్నాడు.

'నీ కీర్తి నిరుపమానము
భువనత్రయ కర్తవు
నన్నేలు దొరవు.
మునులును సురలును
అభిలషించు తిరువేంకట నాథుడా !
నేను నిరాశ్రయుడను.
నీపాదముల నాశ్రయించితి.
ఇక అవే నాకు శరణ్యము.'[38]

మన అర్హతను బట్టిగాక భగవంతుని అపారమైన కరుణ వల్లనే ఆశ్రయం లభిస్తుందని నమ్మాళ్వారు అభిప్రాయం. అలా శరణు వేడడం భగవంతుణ్ణి ప్రేమించడమే అవుతుంది. ఆప్రేమ తీవ్రతరమైతే, ఆ తర్వాత మరేమీ కోరడానికి మనసు పుట్టదు. ఆ ప్రగాఢమైన భక్తి భావం భగవంతుడు ప్రసాదించే వైకుంఠము కంటె మంగళ ప్రదమయినదీ ఆనందకరమయినదీను. ఆయన యిలా అంటాడు :

'దేవదేవా !
నాదొక విన్నపము.
నీభక్తుల కేదో ప్రసాదింపగ
నీవు యోచించుచున్నావు.
కరుణాన్వితుడైన నీవు
వారి కిత్తువేమో వైకుంఠము నైనా
అది మధురమా మంగళ ప్రదమా
నిన్ను కీర్తించుట కన్నను ?'[39]

భగవద్భక్తి, సంపూర్ణ శరణాగతి – ఈ రెండే సత్యలోకానికి దారి తీయగలవని నమ్మాళ్వారు నమ్మకం.

37. తిరువాయ్మొళి : 2. 6. 10
38. పైదే : 6. 10. 10. 39. పెరియ తిరువంతాది : 53

'నశించును
పురాకృత పాపకర్మ

బహు ప్రాచీనమౌ ఆ భారము ;
కొరత యేమియు కలుగదు.
మనసును పరిశుద్ధము చేసికొని
అంతరంగమును క్షాళనము చేసికొని
శ్రీ నాథుని[40] పాదములను
ప్రతినిత్యము భక్తి గొలుచు వారికి.
'ఆసన్న మగుగాక మరణము
ధ్యానమున మరణించుటయె
శక్తి, విజయము.'[41]

పరమ సత్యమనగా భక్తియే. అది లోకంలో మనల్ని ఆవరించే వుంది. అవతారంలా అరుదెంచి, మనల్ని స్పృశిస్తుంది, ధ్యాన మగ్నులమై వున్నప్పుడు. ఇతరులకైతే అది అలభ్యం ; నిగూఢం. భగవంతుణ్ణి ప్రేమించే వారికి అతడు సులభుడు.[42]

ఆత్మ అవస్థలకు లోనయినా, అయన ప్రశ్నలెన్నో వేసినా నమ్మాళ్వారు తాత్త్వికచింతన ఆశాజనక మయింది; భగవంతుడున్నాడనే విశ్వాసంతో కూడినది. అతడు కనక తన చిటికెన వేలు పైకెత్తితే చాలు. [43]

---

40. లక్ష్మీదేవి ; శ్రీమన్నారాయణుని దేవేరి.
41. తిరువాయ్‌మొళి : 1. 3. 8.   42. పైదే : 1. 3. 1.
43. శరణాగతి తత్వం గురించి నమ్మాళ్వారు వెలిబుచ్చిన అభిప్రాయానికి వ్యాఖ్యాతలు రెండు విధాల వ్యాఖ్యలు వెలయించారు. ఒకటేమో పిళ్లైలోకాచార్యులు (13 వ శతాబ్ది) చెప్పింది. దాన్ని శ్రీమణవాళమాముని సమర్థించాడు (1373 – 1443). వీరి మతం ప్రకారం మానవ ప్రయత్నం బట్టి వుండదు భగవదనుగ్రహం. అపారమైన ఆదివ్యానుగ్రహం అన్ని ఆత్మల్ని ఆవరించే వుంటుంది. శరణాగతి లక్ష్య సాధనకు సోపానం కాదు. ఆత్మ స్వభావం భగవంతుని కరుణ మీద ఆధారపడివుంది. శ్రీ పిళ్లైలోకాచార్యుల సమకాలికుడైన శ్రీ వేదాంత దేశికులది రెండవ మతం. శరణాగతి మానవుని విధ్యుక్తధర్మ మని (సర్వ ధర్మాన్ పరిత్యజ్య – భగవద్గీత) ఆయన అభిప్రాయం. ఇదే నమ్మాళ్వారు అవలంబించిన ధర్మం. కాని శరణాగతి భగవదనుగ్రహానికి కారణమని ఆయన చెప్పలేదు. శరణాగతి ఒక వ్యాజం. అందువల్ల భగవదనుగ్రహాన్ని సముపార్జించేందుకు ఒక సదవకాశం లభిస్తుంది. ఆయన దృష్టిలో, శరణాగతి, అనుగ్రహం భిన్నవిషయాలు కావు. శరణాగతి మానవుడికి సంబంధించింది, అనుగ్రహం దేవుడికి చెందింది. ఒకదాన్ని అనుసరించి మరొకటి వర్తిస్తుంది. ఒకే సమయంలో పని చేసేవి ; మానవుని విముక్తికి దారి తీసేది. ఈ భిన్న వ్యాఖ్యలకు మధ్యవున్న సూక్ష్మభేదం శ్రీరామానుజులవారి తదనంతరం దక్షిణాపథంలోని వైష్ణవ లోకంలో పెద్ద వాగ్వివాదానికి కారణమయింది.

భగవదనుగ్రహం నేను నేనంటూ ముందుకి వస్తుంది. తత్ఫలితంగా భక్తి జ్ఞానాలు ఏర్పడి ముక్తి కూడా కలుగుతుంది.

'మహిమ వర్ధిల్లుగాక వర్ధిల్లుగాక !
శాప విమోచన మయ్యేను
నాశము నశించెను
నరకము తొలగెను
యముని కింక పని లే దిచట
కలి సైతము కనుమరుగవును.
నీలమేఘ శ్యాముని భక్తులు ఎక్కడెక్కడివారు గుంపులుగట్టి
ఆడుచున్నారు
పాడు చున్నారాతని కీర్తిని.'[44]

హైందవ దైవతములపట్ల నమ్మాళ్వారు ప్రదర్శించిన వైఖరి గమనించ దగింది. అందులో మార్పులున్నా, శ్రీమన్నారాయణుడు పరబ్రహ్మమనే ఆయన అభిప్రాయం అచంచల మయింది. అతడు సృష్టించిన వారే యితర దైవములనీ, వారతనినీ ధ్యానిస్తున్నారనీ ఆయన పేర్కొన్నాడు. అతనిని ఆదైవములు కూడా పరిపూర్ణంగా గ్రహించలేదు.[45] శ్రీమన్నారాయణుడు పరబ్రహ్మమని చెపుతూ, చేసిన పాపంనుంచి శివుణ్ణి అతడు రక్షించాడని పేర్కొన్నాడు. బ్రహ్మ శిరస్సుల్లో ఒకదాన్ని శివుడు తుంచివేశాడు.[46] మూలకారణు డైన శ్రీమన్నారాయణుడు లోకాన్ని సంరక్షించడానికి సిద్ధంగా ఉండగా, లోకం ఇతర దైవతాల కోసం నిరీక్షించడం చూసి ఆయన ఆశ్చర్య పడ్డాడు.[47] అన్ని లోకాలను, వేల్పుల్ని సృష్టించినవాడు శ్రీమన్నారాయణుడు. ఆవేల్పులు అతనికే నమస్కరిస్తున్నారు. కనక అందరూ నారాయణునే భజించాలని ఆయన పేర్కొన్నాడు.[48] ఈ సందర్భంలో ఆయన ముఖ్యంగా శైవుల్నీ జైనుల్నీ బౌద్ధుల్నీ ఉదాహరించాడు. భగవంతుణ్ణి గురించి తుదిలేని వాదోప వాదాలు చేసేవారందరూ చివరికి ఎవరిని భగవంతుడుగా పేర్కొన్నా ఆ భగవంతుడు శ్రీమన్నారాయణుడే అని ఆయన అభిప్రాయం.[49]

44. తిరువాయ్‌మొళి : 5. 2. 1.
45. పైదే : 2. 2. 10. 2. 7. 12. 4. 10. 4
46. పైదే : 2. 2. 2. తిరువిరుత్తం : 86
47. తిరువాయ్‌మొళి : 4. 10. 1.
48. పై : 4. 10. 2.
49. పైదే : 4. 10. 5.

అయినప్పటికీ త్రిమూర్తుల్ని (బ్రహ్మ విష్ణు మహేశ్వరులు) కీర్తించమని ఆయన కోరాడు. అలా కీర్తిస్తూ వాళ్లని గురించి అధికాధికంగా తెలుసుకోమని కోరాడు.[50] శ్రీమన్నారాయణుని వివిధా కృతులే ఆవేల్పులందరూ-అని ఆయన అన్నాడు :

'తన మూర్తిని సృష్టించుకొని
ఇతర వేల్పులుగా నిలిపె
ఆ దేవాధి దేవుడు !'[51]
'ఎటుల నిన్ను కీర్తింతు ?
మణివర్ణుడా అని
నిన్ను నుతింతునా ?
చంద్ర శేఖరుడా
చతుర్ముఖుడా అని
నిన్ను స్తుతింతునా? '[52]

ఇక్కడ నమ్మాళ్వారు భావించిన పరబ్రహ్మమైన శ్రీమన్నారాయణుడు ఆయన కంటికి త్రిమూర్తి స్వరూపుడుగా గోచరిస్తున్నాడు. ఆయన ఇలా పేర్కొన్నాడు : 'నిన్ను కీర్తిస్తున్నాను. శివ బ్రహ్మేంద్రాది వేల్పుల్ని కూడా సరిసమానంగా కీర్తిస్తున్నాను. ఆ వేల్పులు అతని ఆకృతులే. అందరినీ కీర్తించండి, అంతమవుతుంది కలి.'[53] పరబ్రహ్మపు శరీరం శివుడిగా బ్రహ్మగా లక్ష్మిగా విభాగిత మయినట్లు మరో పాశురంలో పేర్కొన్నాడు.[54] శ్రీమన్నారాయణుని 'ముక్కంటి'గా పేర్కొన్నాడు. ఈ పేరు శివుడికి ఉద్దిష్టమయింది.[55]

విభిన్నములైన యీ అభిప్రాయాల్ని సమన్వయ పరచి నమ్మాళ్వారు దృష్టిలో శ్రీమన్నారాయణుడే మూలకారణానికి మూలమనీ చెప్పడానికి వేదాంత దృష్టిగల వ్యాఖ్యాతలు చాలా శ్రమపడ్డారు. శ్రీమన్నారాయణుడే పరబ్రహ్మమన్నది నమ్మాళ్వారు ప్రగాఢవిశ్వాసం. ఇందులో ఏమీ సందేహం లేదు. కాని ఆయన విశ్వాసం మార్మిక జ్ఞానంగా పరిణమించినప్పుడు, సర్వే

50. పైదే : 1. 3. 6.
51. తిరువాయ్‌మొళి : 5. 2. 8.
52. పైదే : 3. 4. 8. మణివర్ణుడనగా విష్ణువు.
53. పైదే : 5. 2. 10.
54. పైదే : 4. 8. 1.
55. పైదే : : 10. 10. 1.

సర్వత్రా ఇతరులు పూజించే దైవాలలో ఇతర మతాలలోని దైవాలలో ఆయన శ్రీమన్నారాయణునే దర్శించాడు.

'తన జ్ఞానము ననుసరించి
తన యిష్టదైవము గొలిచి
దర్శించు నాతనిని, నిర్మలుని.
తనకు నచ్చినట్లు పయనించి
అతని పాదములు చేరుదురు
భగవద్దర్శనము కోరువారు.'[56]

'నీవు వెలయగా జేసితివి
ఎన్నో అర్చనా విధానములు ;
మనో భావముల భిన్నత్వమున
ఎన్నో మతములు;
ఎందరో వేల్పులు
ఎన్నో ఘర్షణలు.
నీ ఆకృతినే మలచుకొంటివి
అసంఖ్యాక రూపములుగా.
నిరుపమానుడా !
నిన్నెవరితో ఉపమింపగలను ?
నీకై తహ తహ లాడుచున్నాను.'[57]

ఆవిధంగా నమ్మాళ్వారు తన తొలి కృతి అయిన తిరువిరుత్తంలో పేర్కొన్నాడు. చివరికి, పరబ్రహ్మ సాక్షాత్కారానంతరం, అస్పష్టమైన ధోరణిలో ఆకృతుల్ని గురించి పేర్కొన్నాడు. వాటిని ఇదమిత్థమని మనం నిర్వచించలేము.

'నీవు శూన్యమవు
సర్వ వ్యాపకుడవు
అగాధమును మించిన అగాధమవు.
ఉన్నతిని మించిన ఉన్నతివి.
మహా మహిమా న్వితుడవు
సుమము లది వ్యక్తీ కరించు.
అవధులు లేని ఆనందమవు
నన్నావరించిన వాడవు.

56. తిరువాయ్ మొళి: 1. 1. 5.
57. తిరువిరుత్తం : 96.

నా ప్రగాఢ వాంఛను తీర్చు వాడవు
నా అన్వేషణమును తీర్చు వాడవు.'[58]

ఈ శూన్యాన్నీ ఈ ఆనందాన్నీ ఈ మహిమనూ ఆయన శ్రీమన్నారాయణుడని వ్యవహరించాడు; నారాయణాకృతిగానే భావించాడు. అన్నిటినీ పరిత్యజించే నిర్మల ప్రేమయే సోపానంగా భావించడమే కాక ఆయన అదే అనుసరించాడు. అనంతుడూ శాశ్వతుడూ అయిన భగవంతుడి అన్వేషణకు విన్నపాలతో కూడిన శరణాగతిని అవలంబించాడు.

58. తిరువాయ్‌మొళి: 10. 10. 10.

# 9. నమ్మాళ్వారు కవిత

విశ్వాసమూ సహజజ్ఞానమూ పురస్కరించుకుని పరబ్రహ్మాన్వేషణకు పూనుకున్న నమ్మాళ్వారు వంటి మార్మికుడు ఎప్పుడు కవి అయ్యాడు ? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరం చెప్పడానికి కవిత్వానికి సంబంధించిన విభిన్నాభిప్రాయాల లోకంలో పయనించవలసి వుంటుంది. తత్ఫలితంగా, ఆ అభిప్రాయాల తుషారబిందువులకు తడిసినా, ఆ సిద్ధాంతాల నిర్వచనాల పొగ మంచులో చిక్కుకోవడం తథ్యం. కనుక నేను ఆచర్చజోలికి పోవడం లేదు. ఉదాహరణ పూర్వకంగా నమ్మాళ్వారు కవితా స్వభావాన్ని పరిశీలించడమే నా ఉద్దేశం.

కవితను అనువాదం ద్వారా పరిశీలించాలని అనుకోవడం అధికార ప్రతినిధి ద్వారా యువతిని ప్రేమించడం వంటిదని రవీంద్రనాథ ఠాకూరు పేర్కొన్నాడు. కాని నమ్మాళ్వారుని గురించి మరోభాషలో వ్రాసేటప్పుడు అనువాదాల మీద ఆధారపడక తప్పదు. కవిత్వానువాదం ఎప్పుడూ అసమర్థంగానే ఉంటుంది. నమ్మాళ్వారు కవితను ఆంగ్లంలో అనువదించడం సాధ్యంకాని పనిగా శ్రీ అరవిందులు అభిప్రాయ పడ్డారు. మణిప్రవాళ శైలిలో వ్యాఖ్యానాలు వెలయించినవారు వేదాంతానికి పాండిత్య ప్రకర్షకూ ప్రాధాన్యమిస్తూ నమ్మాళ్వారు కృతుల్ని పరిశీలించారు. ఈ విధానం నేటికీ కొనసాగుతూ వుంది. తత్ఫలితంగా నమ్మాళ్వారు కవితా ప్రావీణ్యం సరిగా గుర్తించబడ లేదు. వేదాంతం గొప్పదా ? కవిత్వం గొప్పదా అని కాదు ప్రశ్న. ఆయన కవిగా గొప్పవాడా లేక మునిగా గొప్పవాడా లేక వైష్ణవమతంలోని రామానుజ శాఖకు పథః ప్రదర్శకుడా అని కూడా కాదు ప్రశ్న. అలాంటి చర్చకు అంతం వుండదు. పైగా దానివల్ల లాభం లేదు. ఇతర విషయాలలో నమ్మాళ్వారు ఎంత ప్రముఖుడైనా కావచ్చు. అలాగే ఆయన కవిగా ప్రముఖుడనీ తమిళ సాహిత్యానికి విశిష్టమైనసేవ చేశాడనీ చెప్పడం నా ఉద్దేశం.

భౌతిక ప్రపంచం కేవలం భ్రమ అని తెలపడానికి రథచోదకునీ గుహా కృతినీ ప్లేటో వాడుకున్నాడు ; శంకరు డేమో రజ్జుసర్పములను ఉపయోగించాడు. అందుకు తత్త్వ శాస్త్ర వేదాంతాలు కవిత్వవేషం వేసుకున్నాయి. కాని ప్రస్తుతః తాత్త్విక సిద్ధాంతాలు గాని వేదాంత సూక్తులుగాని కవిత్వం కావు. అలౌకిక భావాలను అనుభవంలోకి తీసుకురావాలి. అందుకుగాను లయాన్వితములైన శబ్దముల ద్వారా భావవ్యక్తీకరణ చెయ్యాలి. 'చక్షు శ్రోత్ర ప్రపంచానికి' సన్నిహితం చెయ్యాలి. అప్పుడా భావాలు కవిత్వమనే అద్భుత లోకంలోకి ప్రవేశిస్తాయి. నమ్మాళ్వారు చేతుల్లో ఈ అద్భుతం జరిగింది.

ఏమైనప్పటికీ నమ్మాళ్వారు సకృత్తుగా తాను కవి ననుకుటాండు. అటువంటప్పుడు కూడా తన కవిత్వం యావత్తూ భగవంతుని సృష్టిగానే భావిస్తాడు.

'ఏమని చెప్పను ?
నా ప్రాణ ప్రాణమై అతడు
నా మాటలలో కవిత్వము పలికించును
కాదు కాదు
అవి అతని మాటలే
అతని కీర్తిని అతడే గానము చేయును.'[1]

అలాగే, తన కవిత్వమంతా ఆ చక్రాయుధుడికే ఉద్దిష్ట మైనట్లు అళ్వారు భావించాడు.[2] మానవుణ్ణి కీర్తించడం మానుమని ఆయన కవుల్ని ఉద్బోధించాడు. 'అందువల్ల లాభమేమిటి ? తాను శాశ్వతుడననీ తన ప్రాధాన్యం తలచుకుని తృప్తిచెందుతూ సిరులనే సంపదగా భావించేవానినీ అయిన మానవుణ్ణీ స్తుతించడం వల్లలాభమేమిటి?' అని ఆయన ప్రశ్నిస్తాడు.[3] ఆయన అన్నాడు గదా : 'కవులారా ! రండి. కష్టపడి జీవించండి. మీ చెమటతో మీ అన్నం తినండి. ఎందుకు కీర్తిస్తారు ధనవంతుని ? ఈ లోకంలో నిజంగా ఎవరు ధనవంతుడు ? ఎవ్వరూ లేరు. మీ అభిమాన దైవాన్ని కీర్తించండి. మీ గీతికలన్నీ ఎఱ్ఱని ఎరుపు కిరీటం దాల్చిన ఆ శ్రీనాథుడినే చేరుతాయి.'[4] 'నాకు సంబంధించినంతవరకు భ్రమలకు లోనైన మానవుని గురించి నేను పాడను' అని కూడా అన్నాడు.[5]

'సాలెవాని నాడె కంటె వేగంగా నా రోజులు గడిచి పోయినాయి ; మరుగున పడ్డాయి..... నా జీవితం శ్వాసమాత్రమే.'[6]

'నేల మీద నిలబడ్డ ప్రతి మానవుడూ గాలిసవ్వడి. నడిచే ప్రతి మానవుడూ నీడ మాత్రమే.'[7]

ఇది యుగయుగాల వాణి.

అయితే యీ వాణిని గ్రహించగలవాడు మానవుడే. నశ్వరమైన దేహంలో బంధించబడిన చైతన్యాన్ని గ్రహించగలవాడు అతనే. మానవుడికి

---

1. తిరువాయ్ మొళి : 7. 9. 2.
2. పైదే : 3. 9.
3. పైదే : 3. 9. 2.
4. పైదే : 3. 6. 1. శ్రీనాథుడంటే శ్రీమన్నారాయణుడే.
5. పైదే : 3. 9. 8.
6. ది బుక్ ఆఫ్ జాబ్ : 7. 6.
7. ది బైబిల్ : సామ్స్ 3. 9. 5. 6.

సంబంధించిన ఏదైనా సరే-ఐహిక జీవితాన్ని చూసి అతను అసంతృప్తి చెందిన అంశమైనా సరే-కవితకు ఇతివృత్త మవుతుంది. నమ్మాళ్వారు కవితలలో కొన్నిటిని దీన్ని చూడగలం.[8] ఆయన దృష్టిలో మానవుడు మెరుపులా అస్థిరుడు; క్షణభంగురుడు; ఐహిక జీవితం అహంకార పూరితం; 'వానలో లేచి నశించే బుడగ వంటిది.'[9]

యౌవనంలో సంపదలు అనుభవిస్తూ కడుపునిండా తిని తాగి కలకంఠులతో క్రీడిస్తూ కాలం గడిపినవాడు వృద్ధాప్యంలో పేదరికానికి లోనై కృశించిన చేతుల్ని తిండి కోసం చాపే ఆ హృదయ విదారక దృశ్యాన్ని ఆయన వర్ణించాడు.[10] రాజాంతఃపురంలోని పెద్ద భేరీ మూగవోయింది.

'మున్ను ధరణి నేలిన వాడు
రాత్రి వేళలం దిపుడు
ఊర కుక్కలు కరవగా
చేత చిప్ప దాల్చి
అడుగు చున్నాడు అన్నము
అందరు చూడగా.'[11]

ఇటువంటి భావాలతో నమ్మాళ్వారు పరబ్రహ్మాన్వేషణకు ఉపక్రమించాడు; ఆయనకి ఐహిక జీవితం పట్ల అసంతృప్తి కలిగింది. ఈ విషయంలో ఆయన పూర్వ కవులైన సంగకాలపు కవులకి భిన్నుడై కనిపిస్తాడు.[12] వాళ్లు ప్రకృతి వర్ణనల్లో మునిగిపోయారు. జీవిత నాటకంలోని రంగ స్థలం గురించీ నటుల్ని (మానవుడు) గురించీ చెప్పారు. అంతేకాని జీవితాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించడం జరగలేదు. అయితే నమ్మాళ్వారు సమకాలికులైన మార్మిక ఆధ్యాత్మిక కవులవలె సంచరించాడు. ఆ యుగ ధర్మం ఐహిక జీవితం గడుపుతూనే శాశ్వతమైన పదార్థాన్ని అన్వేషించడం. ఆ కోవకు చెందిన అన్వేషకులలో నమ్మాళ్వారు విశిష్టుడు.

8. పరబ్రహ్మాన్వేషణ అధ్యాయంలోని తొలి పేరాలు చూడండి.
9. తిరువాయ్‌మొళి : 1. 2. 2. 4. 1. 6.
10. పైదే ; 4. 1. 7.
11. పైదే : 4. 1. 1.
12. అపవాదాలు లేకపోలేదు. తిరుమురుగాట్రుప్పడై, పరిపాడల్ (కొన్ని పద్యాలు) కృతులు భగవంతుడికి సంబంధించినవి. అయితే ఆళ్వారులలో, నాయన్మారులలో కనిపిస్తున్నట్లుగా వాటిలో తీవ్రమైన తపనగాని స్వయంగా పాల్గొనడం గాని లేదు.

ఐహిక జీవితం పట్ల విముఖత్వం వహించినా, దాన్ని కాదన్నా, ఆ తాలూకు భావాలు - ఒక స్తంభానికి మరొక స్తంభానికి మధ్య అలుముకున్న చీకటి కవిత్వం కావచ్చు. అయితే వాటిని కవి తన భావనా బలం చేత ఐహిక జీవితానికి అన్వయింపజేయాలి. నమ్మాళ్వారు చేసిన పని యిదే. ఉదాహరణానికి, ఇంద్రియ భోగాల నిష్ప్రయోజనత్వాన్ని ఆయన యిలా తెలియజేశాడు, అస్పష్టతకు ఎడమివ్వకుండా.

'భూషలు మృదుకేశ పాశములు గల
భామల పరిరంభ సౌఖ్యముల తనిసిరి.
వారిపుడు
విశీర్ణ హృదయులు
పరిత్యక్తులు
సామాన్యులచే పరిహసితులు.'[13]

మానవుల సంబంధాలు సంతృప్తికరములు కావనే భావం ఇలా రూపు దిద్దుకుంది.

'వివాహ మాడిన వెలదులు
సంతానము బంధు మిత్రాదులు
కలసి కొందురు
ఆవల విడిపోయెదరు.
అంతటితో అది సరి.
ప్రేమ కలదె ? లే దెచ్చటను ?'[14]

భగవదనుగ్రహం చల్లని మెత్తని పుష్ప శయ్యలా మనల్ని సమీపిస్తుంది.[15] సంపద చేరేసరికి బంధుమిత్రాదులు సహాయంగా మనల్ని ఆవరిస్తారు ; కాని వాళ్లు నెత్తురు పీల్చే జలగలు.'[16] ఈ ప్రపంచం దట్టమైన పొద ; తికమక పెట్టే దోవలు కలది.[17] పంచేంద్రియాలు వంచనావలయాలు ; మొండి వ్యాధులనే కత్తులతో బాధించే యంత్రశాల.[18]

ఇక ఐహిక జీవిత పరిత్యాగం గురించి. ఏ జీవితం పట్ల విముఖత్వం వహించాడో, ఆ జీవితంలోంచే ఆళ్వారు ప్రతీకలు ఎన్నుకున్నాడు. ఈ

13. తిరువాయ్‌మొళి : 4. 1. 5.
14. పైదే : 9. 1. 1.
15. పైదే : 4. 1. 5.
16. పైదే : 9. 1. 2.
17. పైదే : 3. 2. 9.
18. పైదే : 9. 1.

ప్రపంచం ఆయనకి మొదట్లో నిస్సారమైన మృగతృష్ణగా గోచరించింది. దానిని వర్ణించేందుకు ఆయన దానినే గ్రహించాడు. భ్రమప్రమాదాల్ని స్పష్టమైన రీతిలో తెలియజేశాడు.

పరబ్రహ్మం వైపు ఆళ్వారు మొగ్గు చూపే కొద్దీ, ఆ అన్వేషణా వాంఛ ఆయన్ని వశం చేసుకుంది. ఆ వాంఛ తన చుట్టూ ఉన్న నిజ ప్రపంచాన్ని ఆవరించింది. ఆయన ఇలా అంటాడు:

'కడలి చెంతను మడుగున
నివసించు నారాయణ విహంగమా!
అలుపు సొలుపులు లేవు తరంగాలకు
అనవరతము సాగు వాటి అన్వేషణ.

నా జనని నిద్రించుచున్నది
అనిమిషులైన దేవతలవలె.
నా వలె నీవును నిద్రింపవు.
నీవు సైతము
పారిపోయితివా విరహమున ?
వలచితివా అతనిని ?
'క్రౌంచమా!
హృదయమును చీల్చుచున్నవి
నీ విషాదగీతికలు.
రెయెల్ల వినిపించు నవి.
అతనిని నీవును వలచితివా ?
నీవును బాధకు లోనైతివా ?

అతడు దాల్చు సుగంధ తులసిమాలకై
చెందుచుంటివా తపన ?
'విశ్రాంతి ఎరుగని సముద్రమా!
వింత గొలుపుచున్నది.
రేయనక పగలనక ఘోషించుచున్నావు.
నీవును అతనిని వలచితివా ?
మావలె బాధకు లోనైతివా ?
లంకను గెలిచిన వాని పాదములను
ఆశ్రయింపగా తపన చెందుచున్నావా ?
'పరిభ్రమించు పవనమా!
తిరిగెదవు మండుటెండను

చుక్కలు మెరిసే రాత్రివేళను.
పర్వతాకాశములు, సముద్రములు
అంతటా గాలించుచున్నావు.
యుగయుగాలుగా
చక్రధరుని చేరుటకు
మావలె నీవును తపించుచున్నావా ?
'అశ్రువులలో లీన మయ్యేడు
ఆకాశమా ! మంగళమగుగాక !
అగమ్యునికి మనసిచ్చి
ఆ ప్రేమవలయాలలో చిక్కువడితివా ?
చంద్రుడా ! దురదృష్టవంతుడవు
నీ కాంతి తరిగెను.
నీలాకాశపు చీకటిని చూచుచు
నిలబడితివి నీవు వ్యర్థముగా.
మా వలె నీవును
నమ్మితివా అతని మాటలు !
అతని మాటలు సత్యములు.
అతనిని విశ్వసించితివా ?
చక్రధరునికై తపన చెందుచున్నావా ?
'పగగొన్న కాళరాత్రి !
పెక్కేండ్లు వర్ధిల్లు.
అతని కేమో మనసిచ్చి
నిస్సహాయులమై యున్న మాపాలిట
దాపురించితివి నీవు.
బాధించుచున్నావు.
పెక్కేండ్లు వర్ధిల్లు !'[19]

ఆళ్వారు ఒక్కడే కాదు పరితపించడం. ఆ సృష్టికర్తను చేరుకునేందుకు సర్వప్రపంచమూ పరితపిస్తున్నది !

ఈ భాగం ఒక ప్రణయగీతంగా ఉంది. ప్రేమలో చిక్కుకున్న నాయిక మాటలివి ; నిజానికి నాయికలు అనాలి. ఇది స్త్రీ పురుషుల ప్రేమ కాదు. వివిధ మానవ సంబంధాలను నమ్మాళ్వారు భగవంతుని వైపుకి మరల్చాడు. అస్థిరములైనా ఆ సంబంధాలు మొదట్లో అయన్ని లోబరచుకున్నాయి.

19. తిరువాయ్‌మొళి: 2. 1.

భగవంతుని తల్లిగా తండ్రిగా తిరువిరుత్తం సంభావించింది. సృష్ట్యాదిని ప్రారంభమైన జననమరణాల చక్రానికి చిక్కుకుని జన్మలెన్నో యెత్తడానికి కారణభూతమైన ఆ చక్రంలోంచి బయటపడడానికి నమ్మాళ్వారు చేసిన దీక్ష తపస్సుని ఫలప్రదం కావించిన ఆ శ్రీనాథునిగా కూడా సంభావించింది.[20] సాటిలేని మాయను గురించి చెపుతూ తిరువాయ్‌మొళి యిలా పేర్కొన్నది. 'అది ప్రాణ ప్రాణం. ఆళ్వారుని కన్నతల్లిగా తండ్రిగా చివరికి ఆ అగోచరుని కనుగొనడానికి తోడ్పడిన దేవుడిగా కూడా వర్ణించింది.'[21] దేవుణి రాజుగా ఆయన పేర్కొన్నాడు :

'ఒకరోజు పాలించి గతించెడు
భూధవుల వలె
సూర్యుడు అస్తమించె
చీకటి ఎగబ్రాకె.
లోకాలను కొలిచిన దేవా !
మే మెంతవారము.
స్వర్లోకాధిపతీ !
నీవే నిజమైన దేవుడవు.
నీ కరుణ మా కనుగ్రహింపుము.
నీవును కలిగించితివి ఆశాభంగము.
చీకటియే గతి అయ్యె.'[22]

'భగవంతుడు సమ్రాట్టు. శాశ్వతమూ నిరుపమానమూ అయిన అతని దండం ఏడు లోకాలమీద ఆధిపత్యం నెరపుతుంది. అతని అధికారం అనంతమైనది ; వాడిపోనిదీను.'[23] పైగా భగవంతుడు సర్వజ్ఞుడు. తన మేధ వల్లనే తికమక చెందే లోకానికి జ్యోతిని ప్రసాదిస్తూ అతడు తనవైపుకి మరల్చుకుంటున్నాడు.[24] భగవంతుడు జ్ఞానప్రదాత అయిన గురువేకాక నమ్మకస్థుడైన మిత్రుడు కూడా ![25] పైపెచ్చు భగవంతుడు ప్రియుడు. అతని ప్రేమ కోసం ఆళ్వారు తపించిపోతున్నాడు. స్త్రీ పురుషుల్ని సన్నిహితం

20. తిరువిరుత్తం : 95.
21. తిరువాయ్‌మొళి : 2. 3. 2.
22. తిరువిరుత్తం : 80.
23. తిరువాయ్‌మొళి : 4. 5. 1.
24. పైదే : 4. 8. 6.
25. పైదే : 7. 5. 9.

చేసే స్వాభావికమైన ప్రేరణ మానవ ప్రేమ. ఆ ప్రేమ ఆళ్వారు చేతుల్లో ఒక ప్రతీక అవుతున్నది. దాని ద్వారా ఆయన భగవంతునిపట్ల తనకు గల భక్తి భావాన్ని వ్యక్తీకరించాడు. తిరువిరుత్తం తిరువాయ్‌మొళిలలో చాలా చోట్ల ఈ ప్రతీక ప్రయుక్తం. దీన్ని వాడినప్పుడల్లా, మానవ ప్రేమను తీవ్రతరం చేసి స్వశక్తి చేతనే అది భూమినుంచి ఆవలిలోకానికి చేరేలా చెయ్యగలిగాడు. ఏక సమయంలో ఆయన తనకు తెలియకుండానే రెండు ప్రదేశాలలో పయనిస్తాడు. కృత్రిమంగా కాక ఎంతో స్పష్టంగా లౌకిక ప్రేమను అభివర్ణిస్తాడు. తత్ఫలితంగా అది మానవప్రేమగా భావిస్తుంది. అలా చేసేటప్పుడు, ప్రతీకకు దివ్యతను ఆపాదిస్తాడు. అందువల్ల అది మరో లౌకిక కవితగా కనిపించదు.

అయితే లౌకిక ప్రణయం తాలూకు వివరాలు, అందులోని జీవం కనిపిస్తూనే వుంటాయి. వీటివల్ల అది కవిత్వ మవుతోంది. ప్రేమలో చిక్కుకున్న నాయికవలె, ఆళ్వారు తన ప్రియునికి సందేశం పంపిస్తాడు. తన చుట్టూ ఉన్న స్వాభావికలోకంలోని పక్షులు మేఘాలు భ్రమరాలు పవనం మొదలైనవాటినే ఆయన తన దూతలుగా ఎన్నుకున్నాడు. ఆయన దృష్టి ప్రతిదానిని ఆకర్షించింది.

'చూడ చక్కని రెక్కల నారాయణ విహంగమా !
నీ మనసు చాల మెత్తనిది.
నీవు నీ ప్రియుడును
కనికరింపుడు నన్ను.
అతని యొద్దకు వెడలుడు
నేను పంపిన వార్తాహరులుగా.'[26]

ఒక విహంగం చేసిన అశ్రద్ధ కారణంగా అది తనపట్ల అవిధేయత ప్రదర్శించిందని ఆయన యిలా అన్నాడు :

'అతనికి నా బాధ తెలుపుమని
నీతోనే చెప్పి పంపితిని
నాకు గుర్తున్నది
చిన్నారి విహంగమా !
నీవు చెప్పనైతివి
నా రూపు చెడెను.
ఒడలు పాలిపోయెను

26. తిరువాయ్‌మొళి : 1. 4. 1.

పొమ్ము పొమ్మిక.
నీవారికి ప్రతినిత్యము
ముద్ద లిడువారిని
వెదకికొనుము క్రొత్తగా.'[27]

పికములను ఉద్దేశించి:

'పికములారా!
ఎందుకీ మూగనోము?
మీకేమి నష్టము కలుగును
నా సందేశముతో అతని కడకు పోయిన?
మీరు నాకు చేయు సహాయ మిదే.
అతని కడకు పోయి చెప్పడు.
నా పురాకృత కర్మవలన
నే నిచట
అతని పాదముల సేవింపలేకున్నానని.
నాకర్మను భరించి
అతనికి దూర దూరముగా పోవుచున్నాను.'[28]

తర్వాత మగన్డ్రిల్ అనే పక్షుల్ని చూసి:

'నీల విహంగములారా!
చెప్పుడు
ఈ సాయము చేయుదురా, చేయరా?
నా సందేశము గొనిపోవరా?
ఏమని చెప్పుదు!
నా బాధ తెలియును నా స్వామికి
ఆ నీలమేఘ శ్యామునికి
అయినా కరుణింపడు.
ఈ బాధ తొలగునని
ఇయ్యడు మాట'.[29]

ఆ తికమక యింకా సాగుతోంది. 'నా సందేశం ఎవరు తీసుకు వెడతారు! ఎవ్వరూ లేరా? ఇంతలో భ్రమర ఝుంకారం వినిపించింది. అళ్వారు ఆ భ్రమరంతో అన్నాడు గదా:

27. తిరువాయ్మొళి : 1. 4 8.
28. పైదే : 1. 4. 2.
29. పైదే : 1. 4. 4.

'పువ్వుల మీద వ్రాలుచు తిరిగే
చారల భ్రమరములారా!
చక్రాయుధుని మీరు దర్శించిన
చెప్పుడు నా మాటలుగా.
"జాగు చేయుచున్నావు
త్వరగా రమ్ము.
మరణింపకమున్నె ఆమెను కరుణింపుము.
సముద్రము వంటి పక్షములు గల
ఆ గరుడుని అధివసించి
బిరాన రమ్ము
ఆమె యున్న వీధికి.''[30]

పరిభ్రమించే పవనం ఆళ్వారుని స్పృశించింది. వాయువు తన సందేశం తీసుకుని పోవచ్చు; గాలి ఎక్కడికైనా వెడుతుంది. గాలి యేమో ఆయన్ని సమీపించింది. కాని పంపదలచుకున్న సందేశం ఆళ్వారు గొంతు లోనే ఉండిపోయింది. అపార కరుణ కలిగిన ఆ భగవంతుడు తన పాద పద్మాలను చేరవలసిన ఒక ఆత్మను సంరక్షించాలనే తహతహతో తనను నిర్లక్ష్యం చేస్తున్నట్టుగా మారుతం సూచించినట్లు ఆయన అనుకున్నాడు. ఒకవేళ ఇదే కనక నిజమయితే, మారుతమా! నన్ను ముక్కలు ముక్కలు చెయ్యి, నాకు మరణమే శరణ్యం[31] అని పేర్కొన్నాడు ఆళ్వారు.

ఈ ప్రణయ భావాన్ని ఆయన వర్ణించే సందర్భాలలో, అది మధుర భక్తి ప్రతీకకు జీవం పోస్తుంది. ఈ కింది పాశురంలో విరహతప్త అయిన నాయిక అతనిని ప్రేమించినందుకు తన్ను తాను నిందించుకుంటోంది.

'గ్రామము నిద్రామగ్నము
అఖిలలోకము అంధకార మయము
కాలము కరుడు గట్టినది
ఈ దీర్ఘ రాత్రిగా.
అతడు అరుదెంచకున్న
ఎవరు నన్ను బ్రోచువారు!
నేను మహాపాపిని.
ప్రాగ్దిశారథము నధివసించి

30. తిరువాయ్‌మొళి : 1. 4. 6.
31. పైదే : 1. 4. 9.

అరుణభాను డుదయించడా ?
ఈ రాత్రికి అంతమే లేదా ?
రాత్రి యేమో కొనసాగును
అణువణువున నేను మరణించుచున్నాను
లోకము నిద్రించుచున్నది
చలి లక్ష్యము చేయదు.
మేలుకొని యున్నాను నేను.
పేద హృదయమా!
ఎందు కతనిని వలచితివి!'[32]

ఇదే ధోరణిలో మరొకటి :

'నా ప్రాణము తీయుచున్నది
మల్లెల వాసనల తెమ్మెర.
కురింజిప్పణ్[33] వినిపించుచున్నది

సాయం సంధ్యను తేలియాడుచు.
మత్తు కలిగించుచున్నది
ఎర్రని సంజవెలుగు.
నన్ను చీల్చుచున్నవి
పడమట మండే మబ్బులు.
ఆ మాయగాని నీలోత్పలములు
అగునా పద్మములు ?
అతడు చుంబించెను
ఈ బుజములు, ఈ వక్షమును.
తెలియ లేకున్నాను
మరెవరి నాశ్రయింపవలెనో !'
'దివ్య భ్రమరము చవి చూచిన
ప్రసూనమును నేను.
ఎట్లు సహింపగలను ?
నా హృదయము నాది కాదు
దీనివలన లేదు లాభము.

32. తిరువాయ్‌మొళి : 5. 4.
33. ప్రాచీన తమిళరాగం.

నే నెరుగ నైతిని
మరెవరి నాశ్రయింపవలెనో !'[34]

ఈ పాశురాలలో కనిపించే స్త్రీ ఒక్కొక్కసారి (కొన్ని సందర్భాలలో చాలామంది స్త్రీలు) భగవంతుణ్ణి సంబోధిస్తుంది. తన్ను తాను సంబోధించు కుంటుంది. లేదా తన చుట్టూరా ఉన్న వస్తువుల్నీ ప్రాణుల్నీ సంబోధి స్తుంది. ఒక్కొక్కసారి తన తల్లితో మాట్లాడుతుంది. లేదా గ్రామంలోని తల్లులతో మాట్లాడుతుంది. ఒక్కొక్కసారి ఆమె చెలికత్తె మాట్లాడుతుంది. కూతురు బాధను చూడలేక, ఆందోళన చెందుతూ ఒక్కొక్కసారి తల్లి మాట్లాడుతుంది. అలా నాటకీయంగా ఉండే గీతికలు కనిపిస్తాయి. విభిన్న పాత్రలు భాషించినా, ఆళ్వారు భగవంతుని కోసం అనుభవించే ఆ తహ తహను ఆ మాటలు అభివర్ణిస్తాయి. ప్రేమిస్తున్న స్త్రీ (నాయిక) ప్రియుణ్ణి చాలాసార్లు పిలిచింది. కాని ప్రత్యుత్తరం రాలేదు.

'శిరసున చేతులు చేర్చి
పిలిచితి నిను రమ్మని.
పిలిచితి గొంతెత్తి.
నీవేమో రాకపోతివి.
భరింపలేను నీ సౌందర్యము
ప్రత్యుత్తరమైనా ఒసగవు.
నేను పిలుచుచునే యుంటి.
రమ్ము రమ్ము నాకడకు
అపరంజివలె మెరయువాడా !
పద్మనేత్రుడా !
పిలుచుచున్నాను సిగ్గు విడిచి
వెర్రినై మాటలాడుచుంటి నిచట.
ఎరుకకు అందని వాడతడు
సురల కైనను అందనివాడు !'[35]

గ్రామ పెద్దలతో నాయిక మాట్లాడింది. వారా ఆమెను అర్థం చేసుకో లేక పోయారు. ఆమె వింత ప్రణయాన్ని చూసి విసుగు చెందారు.

'తల్లులారా !
అలుక బూనితిరెందురు నాపై ?

34. తిరువాయ్‌మొళి : 9. 9. 1. 4.
35. పైదే : 4. 7. 1. 4.

అతనిని చూచిన ఆక్షణమే
తిరుక్కురుంగుడి నాథుని[36]
ఆ శంఖ చక్రధరుని
బింబోష్ఠముల వాని పద్మనయనుని
ప్రేమించితి నేను.
ఏమి చేయుదు ?
నా హృదయము చొచ్చి చూడుడు
ఎల్లెడల అతడే కనిపించును !
'తల్లులారా !
నన్ను దూషింపకుడు.
తికమక పడితి, డస్సిపోతిని.
శంఖ చక్రధారియై
ఖడ్గ గదాపాణియై
విజయ ధనుర్ధారియై
అతడు నెలకొన్నాడు
నా కనులలో, నా మనస్సులో.'[37]

నాయిక తన సఖుల్ని ఉద్దేశించి యిలా అంది :

'సఖులారా, హరిణాక్షులారా !
మీరైనా చెప్పుడు !
తాళవృక్షములు గగనము నంటగా
తేనెలొలుకు మల్లెల వాసనలు గుబాళింపగా
తిరువల్ల వాళలో[38] నెలకొన్న
నా స్వామిని
నే నెపుడు చేరుకొందు ?
నే నంత పాపచిత్తనా ?
సఖులారా !
నన్ను దూషించి లేదు లాభము.
కమ్మతెమ్మెర పుష్పైన్నె మీదుగా వీవగా
మాధవీలత మధురిమలు వెలార్పగా
తిరువల్లవాళలో నెలకొన్న

36. తిరునెల్వేలి జిల్లాలోని గ్రామం.
37. తిరువాయ్‌మొళి : 5. 5.
38. కేరళలోని పట్టణం.

నా స్వామి
పాదధూళిని నే నెపుడు
ఔదల దాల్తునో !'[39]

ఈ కిందిది కూడా ఆమె సఖిని ఉద్దేశించిందే :

'గ్రామము కఠినోక్తు లాడుచున్నది.
అవి ఎరు వగుచున్నవి
నా హృదయ క్షేత్రమునకు.
తల్లి కోపోక్తు లేమో తడుపుచున్నవి.
అత డా క్షేత్రమున
నాటిన ప్రణయధాన్యపు విత్తనము
మొలకెత్తి పెరిగినది
సముద్రమంత పెద్దదిగా.
సఖీ !
నీలమేఘ శ్యాముడెంత నిర్దయుడే !'[40]

నాయికకు కోపం వచ్చింది. ఆ కోపంతో ప్రియుణ్ణి నిరాకరించింది. ఆమెవి చిన్నపిల్ల మాటలుగా ఉన్నాయి. ప్రియుడు తనను తన సఖురాండ్రనీ మోసగించాడు. ఆటల సమయంలో తాము ఇసుకలో కట్టిన పిచ్చుక గూళ్లనీ, వండిన గుజ్జన గూళ్లనీ, అతడు నిరాకరించాడు ; నిర్లక్ష్యం చేశాడు. ఆళ్వారు అంటాడు గదా : 'వద్దు వద్దు - నీ ప్రేమ నాకు వద్దు. ఇక చాలు.' ఇది మానవుల హృదంతరాళాలలోంచి పైకుబికి వచ్చిన అభిప్రాయం. మానవుడి చేతలను భగవంతుడు అలా నిర్లక్ష్యంగా చూడడమా ! అందుకే మానవుడి ఆర్తధ్వని.

'నీ వెవరవో నాకు తెలియును.
ఆనాడు నీవు కాదా
లంకను ధ్వంసము చేసినది.
నీ మాయలు నాకు తెలియును.
మమ్మిక మోసగింప లేవు
ఇచ్చి వేయుము మా అటవస్తువులు....
'దేవా !
వెడలిపొమ్ము మమ్ము వీడి.
దబ్బరలు పలుకగా వలదు.

---

39. తిరువాయ్‌మొళి : 5. 9.
40. పైదే : 5. 3. 4.

భూమ్యాకాశముల కవి తెలియును.
ధ్వంస మొనర్చు చక్రధరుడా !
ఆటలాడ వలదు
మా పెంపుడు చిలుకలతో, పూవై పక్షులతో.
మమ్ము తపింపజేయకు
తొక్కు పలుకుల మా సఖురాండ్రను.'41

నాయిక సఖి ఒకామె ఊరి ఆడబడుచుల్ని ఉద్దేశించి యిలా అంది :

'తల్లులారా !
ఆమెను మీరు ప్రేమింపరు
ఆమె జోలికి రాకుడు.
నీలోత్పల నయనాల నీరు తొలుకగా
గడపు చున్నది కాలము.
తొలైవిల్లి మంగలమున నెలకొన్న
ఆ స్వామిని అర్చించుచున్నది.
అతని పద్మ నయనములను
అతని శంఖ చక్రములను
సదా స్మరించు చున్నది.
ఆమె జోలికి రాకుడు.
'తల్లులారా !
మీ రామెను త్యజించితిరి.
ఆమె తొలైవిల్లి మంగలము చేరెను.
కనుల నీరు తొల్కాడగా
హీనమౌ మధుర స్వరమున
ఆ సాగర శయనుని
ఆ గోప బాలకుని
స్మరించు చున్నది.
మీరు తొలగిపొండు.'43

నాయిక తల్లి యిలా అంది :

'ఆ మాయాతీతుని

---

41. తిరువాయ్‌మొళి : 6. 2.

42. తిరునెల్వేలి జిల్లాలో ఆళ్వారు తిరునగరికి దగ్గరలో ఉన్న గ్రామం.

43. తిరువాయ్‌మొళి : 6. 5.

నీల మేఘ శ్యాముని
లోకముల కొలిచినవానిని
ఆ పద్మ నేత్రుని
సుగంధకుంతల నా కుమార్తె
ప్రేమించె మనసార....
'శీతల సుగంధ తులసిమాలలు
మకుటమున దాల్చినవానికి
మనసిచ్చినది నా కుమార్తె.
కాంతి విహీన యైనది.
లోకముల మ్రింగిన
ఆ నల్లని వానికి
అరుణ వదనునికి
కపటములు నేర్చిన వానికి
చక్రధరునికి
మనసిచ్చినది నా కుమార్తె.
కోలుపోయె కన్యాత్వము.''[44]

నాయిక తన సఖితో అన్న మాటలు ఈ క్రిందివి.

'తిరస్కృతి ఏమి చేయు సఖీ !
గ్రామము వారి తిరస్కృతి
నన్నేమిచేయగలదు.
నా స్వామికి
మనసిచ్చి తపన చెందెడు
నన్నేమి చేయ గలదు ?
అతడు గొనిపోయె
నా లజ్జను నా కన్యాత్వము
నా హృదయము సైతము.
స్వర్లోకము నధివసించె
సుర నాయకుడై.
ఈ అపకీర్తిని చాటెద
వాడవాడలు తిరిగి.
యువతి చేయరాని పనిని —

44. తిరువాయ్‌మొళి : 6. 6.

లజ్జ వీడి తాటియాకుల గుర్రము నెక్కి -
చాటెద నతని ద్రోహ కార్యము.'[45]

ఆమెను (నాయికను) దయ్యం పూనినట్లు గ్రామంలోని స్త్రీలు చెప్పు కోవడాన్ని నిరసిస్తూ వారిని ఉద్దేశించి నాయిక సఖి యిలా అంది.

'తల్లులారా! చెప్పుడు
ఎవరి సహాయము కోరవలె
ఈ వ్యాధిని నయము చేయగా ?
పాండవులను యుద్ధ సన్నద్ధుల చేసి
వారికి విజయము ప్రసాదించిన
ఆ రథసారథి కోసము
అన్వేషించుచున్నది.
దిగ్భ్రమ చెందియున్నది.
'తల్లులారా !
ఈ సోదగత్తె మాటలు వినవలదు.
మాంస ఖండములు వెదజల్లవలదు.
తులసిమాలలు దాల్చువానిని
ఆ మాయగాని పాదములను
ఆశ్రయింపుడు.
ఆమె వ్యాధిని నయము చేయుటకు.
అదొక్కటే మార్గము.
తల్లులారా !
ఆమెకు దయ్యము సోకినట్లు
మనసున ఎంచవలదు.
అటుల మీరనుకొన్న
ఆమె గుణము మారదు.
పరిహార మొక్కటే కలదు
మణివర్ణుని మాయగానిని

---

45. పైదే : 5. 3. నలుగురూ తిరిగే చోట తాటాకుల గుర్రపు బొమ్మ మీద ప్రియుడు కూర్చోవడమంటే, అతను తన ఆశాభంగాన్ని తెలియజేయడ మన్నమాట. ఈ సంప్రదాయం పురుషులకే పరిమితం. అయితే నమ్మాళ్వారు దీన్ని స్త్రీలకు కూడా వర్తింపజేశాడు. తిరుమంగై ఆళ్వారు కూడా ఇలాగే చేశాడు.

సేవించు భక్తుల పాదధూళిని
ఆమెపై చల్లుడు.'[46]

నాయిక తల్లి మాట లీ కిందివి :

'నేల మీద కూర్చుండి
ఇది నా వామనుని నేల
అనుచు లాలన చేయును.
ఆకసము వంక చూచి
వ్రేలితో దానిని చూపుచు
అదే అతని వైకుంఠము
అనుచు అర్చించును.
కనులు నీటిబుంగలు కాగా
అహో సముద్ర వర్ణుడా!
అనుచు బిగ్గరగా పిలుచును.
'సుదతులారా! చెప్పుడు
నే నేమి చేయవలయునో?
అత డావహించె నా తనూజను.
'చంద్రుని చూపించును
నా మణివర్ణు డచట నున్నాడు -
అనుచు అరచును.
ఎదుట నున్న కొండను చూచి
దేవా! రమ్ము రమ్మనును.
వాన కురియగా మబ్బుల చూచి
నా స్వామి అరుదెంచె నను.
ఈ వింత ప్రవృత్తి తుద కేమగునో
నాకు తెలియరాకున్నది.
ఎంత పాపమతినో నేను
నాకిటువంటి కూతురు కలిగె!'[47]

నమ్మాళ్వారు పై పాశురాలకి సంగకాలపు ప్రణయకవితకూ సామ్యం ఉంది.[48] సముద్ర ఘోష, తుదలేని కాళరాత్రి, ఒంటరితనం, కమ్మతెమ్మెర ఒంటికి తగలడంతో భగ్గున మండినట్లు అనుకోవడం, రాత్రి పూట ప్రతి

46. తిరువాయ్‌మొళి : 4. 6.
47. పైదే : 4. 4.
48. నమ్మాళ్వారు కృతులనే అధ్యాయం చూడండి. తిరువిరుత్తం.

జాములోనూ క్రౌంచం పిలుస్తున్నట్టుగా సవ్వడి, దుర్భరమైన వెన్నెల లాలన, విరహబాధను వర్షాకాలం ఎక్కువ చేయడం వంటి ప్రతీకల్ని సంగకవులు సర్వసాధారణంగా వాడుక చేశారు. నేటికీ యివి వాడుకలో ఉన్నాయి. నాయిక వివర్ణ కావడం (పాలిపోవడం), చిక్కడం, కాంతి విహీన కావడం, కరకంకణాలు వదులైనాయని చెప్పడం - ఇవి కూడా సంగ కవుల ప్రతీకలకు ప్రతి ధ్వనులే. ప్రణయం గురించి వర్ణించేటప్పుడు ఇవన్నీ వాడారు. విరహానలానికి చిక్కుకున్న స్త్రీకి సంబంధించిన వివిధ సన్నివేశాలు, ప్రియుణ్ణి తప్పు పట్టడం, సఖితో రహస్యాలు చెప్పడం, గ్రామ పెద్దలుగాని ఊరి స్త్రీలుగాని – వారి మాటలకు నిరసన తెలపడం, వారు నాయికను అర్థం చేసుకోకపోవడం, నలుగురూ తిరిగేచోట తాటాకుల గుర్రం ఎక్కుతారనడం – ఇవన్నీ సంగం సంప్రదాయాలే.[49] ఈ ప్రణయ నాటకంలోని వివిధ పాత్రలు - తల్లి, పెంపుడు తల్లి నాయిక సఖి, ప్రియుడు అతని మిత్రుడు, సోదెగత్తె నాయికకు గాలి సోకిందని చెప్పడం – సంగ కాలపు ప్రణయ కావ్యాలలో సర్వసాధారణంగా కనిపించేవే. ఈ వివిధ వివరాలనూ సన్నివేశాలనూ పాత్రల్నీ నమ్మాళ్వారు చక్కగా వాడుకున్నాడు. అందువల్ల ఆయన భగవంతుణ్ణి ప్రేమించిన ఆ భక్తిభావం కొట్టవచ్చినట్టు మనకు తెలియవచ్చింది. ఈ విషయంలో నమ్మాళ్వారుకీ సంగం ప్రణయ కావ్యాలకీ సామ్యం కనిపిస్తుంది. మానవ ప్రణయాన్ని ఆయన ఒక ప్రతీకగా వాడుకున్నాడు. అయితే ప్రస్తుతం విశ్వసనీయంగా భావించబడుతున్న నమ్మాళ్వారు వృత్తాంతం బట్టి చూస్తే, సంగకాలపు సంప్రదాయాలను ఆయన ఎలా గ్రహించ గలిగిందీ సహేతుకంగా చెప్పలేము. ఇది తమిళ కవిత్వ చరిత్ర పరిశీలకులకు ఆసక్తి గొలిపే అంశమే అయినా, అసలు విషయ మిది.

సంగకవులు వాడిన పరోక్ష ధ్వనిని కూడా నమ్మాళ్వారు ఉపయోగించాడు. ఒక ఉదాహరణ :

'సాయం సమయ మయ్యె. అతడు రాలేదు.
జతగట్టిన వృషభముల గంటల మ్రోతలో
తృప్తి చెందిన ఆవులు త్రుళ్లిపడుచున్నవి.
కర్కశ వేణువులు వదరుచున్నవి.
సంజవెలుగులో భాసించుచున్నవి
మల్లె మొగ్గలు, నీలోత్పలములును.

49. తాటాకుల గుర్రం మీద స్త్రీ ఎక్కిందని పేర్కొని, నమ్మాళ్వారు సంప్రదాయానికి భిన్నంగా సంచరించాడు. సంప్రదాయం ప్రకారం ఇది పురుషులకే పరిమితం. నమ్మాళ్వారుని తిరుమంగై ఆళ్వారు అనుసరించాడు.

> భ్రమరములు నృత్యము చేయసాగె.
> ఆకాశవీథుల నంటగా
> అర్ణవము ఘోషించుచున్నది.
> నేనేమి చెప్పుదు ?
> ఎటుల నన్ను కాపాడుకొందు
> అతడు లేకుండ ?'[50]

సాయం సమయం వర్ణిస్తూ ఆయన చెప్పిన విషయాలు సంభావించ దగినవి. వాటివల్ల వ్యక్త మవుతున్న ధ్వని గమనించదగింది. ఆవులు, పూలు, సముద్రం ఆనంద పారవశ్యం అనండి, అనిర్వచనీయమైన ప్రశాంతత అనండి, అనుభవిస్తున్నాయి. వాటి ఉనికి ప్రణయభరితమైన నాయిక పడు తున్న క్షోభను ద్విగుణీకృతం చేసింది. ఇదీ యితివృత్తం.

ప్రకృతి వర్ణన ద్వారా ఇలా భావమును ధ్వనింపజేయడాన్ని దుఃఖా భాసంగా గణించకూడదు. అది మహా సూక్ష్మ మయింది. తన పూర్వ కవులవలె, నమ్మాళ్వారు కూడా సామ్యభేదాల వ్యాకరణ ద్వారా ఆ సూక్ష్మతను మరింతగా తెలియజేశాడు.

భౌతిక ప్రపంచంతోపాటు నమ్మాళ్వారు పౌరాణిక ప్రపంచపు సహా యాన్ని కూడా పొందాడు. వివిధావతారాలలో భగవంతుడు భూలోకంలో కావించిన లీలల్ని అభివర్ణించాడు. అవతారాలలో నమ్మకం ఉండడం వల్ల పౌరాణిక వృత్తాంతాలలోని ఏదో ఒక పాత్రతో అభేదం కల్పించుకోడానికో లేదా ఆయా సన్నివేశాలలో ఉన్నట్లుగా భావించడానికో ఆయనకి అవకాశాలు చాలా లభించాయి. తత్ఫలితంగా, తన్ను గోపికగా భావించుకున్నాడు. తనను విడిచిపెట్టి కృష్ణుడు ఆవుల వెంబడి వెళ్లినందుకుగాను కుపితు డయ్యాడు. అవతారాలలోని భగవంతుని వివిధ లీలల్ని తలుచుకుని ఆయన మురిసిపొయ్యాడు. వామన రూపంలో భగవంతుడు వచ్చి మూడడు గుల భూమిని ఇమ్మని బలిచక్రవర్తిని అడగడం, త్రివిక్రముడై బ్రహ్మాండా కృతిదాల్చి రెండడుగులతో భూమ్యాకాశాలు కొలవడం, భగవంతుడు రాముడై కాలి నడకను అడవిలో తిరగడం సముద్రం దాటడం యుద్ధం చేసి లంకను జయించడం అయోధ్యకు తిరిగివచ్చి రాజయి తన ప్రభవాన్ని అందరూ గుర్తించేలా మెలగడం, వరాహావతారుడై సముద్రంలోంచి భూమిని పైకెత్తి రక్షించడం, అర్జునుడికి మిత్రుడై రథసారథియై అతని సహోదరుల దూతయై సంచరించడం — మొదలైనవాటిని ఆయన ప్రీతిపూర్వకంగా

---

50. తిరువాయ్‌మొళి : 9. 9. 10.

స్మరించుకున్నాడు. తన కవితకు సుస్పష్టమైన రూపం ఇవ్వడమే గాక, ఆయన తద్వారా వివిధావతారాలలో భగవంతుడు కావించిన వివిధ లీలలకూ ఒక పవిత్రత కల్పించాడు. ఆ తాలూకు మానవ పరిస్థితులూ సంబంధాలు ఆయనకి ప్రతీకలుగానే కాక బ్రహ్మపదార్థపు భాగాలుగా గోచరించాయి. అందువల్ల ఆయన చేతుల్లో ప్రతీక కాంతిమంతం కావడమే కాక స్పష్టతను కూడా పొందగలిగింది. తన మనోభావాలను ద్వివిధంగా చిత్రించడం వల్లనో లేక భగవంతుడి లీలల్ని పౌరాణిక పాత్రలతో కలిపి చెప్పడం వల్లనో ఆళ్వారు తన అనుభవాన్ని బహుభంగులుగా అభివర్ణించగలిగాడు. విరహ తప్త అయిన నాయిక తల్లి భగవంతుడు తన కూతురు పట్ల చూపుతున్న కాఠిన్యాన్ని యిలా వ్యక్తీకరించింది:

'అత్యుత్సాహముగా ఆడి ఆడి
ఆర్ద్ర చిత్తయై
నరసింహా అనుచు పాడి పాడి
వాడివత్తలగు చున్నది
నా ముద్దుల కూతురు.'[51]

హిరణ్యకశిపుణ్ణి సంహరించడానికి భగవంతుడు నరసింహావతారం ఎత్తాడు. ఆ ఉగ్రమూర్తిని నా కూతురు ఎలా దర్శించగలుగుతుందని ఆమె అడిగింది. ఆ తరువాతి పాశురాలలో సహస్రబాహువుల బాణుణ్ణి వధించిన వాడు, లంకను జయించినవాడు, కంసుణ్ణి చంపినవాడు, కర్కశమైన చక్రాయుధుడు అయిన ఆ భగవంతుడి ప్రసక్తి కనిపిస్తుంది. నాయిక తల్లికి భగవంతుడి నిర్దయత స్ఫురణకు వస్తుంది. తల్లిగా మాట్లాడుతూను, తన పరిస్థితినే వర్ణిస్తూను ఆళ్వారు భక్తిభావంలో మునిగిపోతాడు. అతడు సర్వజ్ఞుడనీ, తులసిమాలలు ధరిస్తాడనీ తనకు ఆరాధ్యుడనీ తనకు అమృతతుల్యుడనీ ఆయన అంటాడు.[52] ఆవిధంగా గీతమూ నాటకమూ మిశ్రమం చేయబడ్డాయి. సాహిత్యాకృతిని అధిగమించి, భక్తుని హృదయఘోషగా రూపు దాల్చింది. గీతికలవంటి పెక్కు పాశురాలలో తరుచుగా భగవంతుని అవతారాలు గురించి ఆయన పేర్కొన్నాడు. వాటిలో కొన్ని కేవలం వర్ణనాత్మకాలు. కాని వివరాలు మాత్రం కవి మానసికావస్థల్ని వ్యక్తం చేస్తుంటాయి. ఈ కింది పాశురంలో ఆళ్వారు భావనా బలాన్ని దుర్బలమైన అనువాదం ద్వారా వ్యక్తం చేయడానికి ప్రయత్నించాను.[53] మూలంలోని శక్తినీ, అద్భుతమైన లయనీ శబ్దాలంకారమాధురినీ అనువాదంలో తీసుకు

51. తిరువాయ్‌మొళి : 2. 4. 1.    52. పైదే : 2. 4. 6.
53. పైదే : 7. 4.

రాలేకపోయాను. సృష్టి ప్రళయాలు కొన్ని అవతారాలు గురించి యీపాశురంలో పేర్కొన్నాడు.

'శంఖ చక్రములు ధనువును
ఉవ్వెత్తున లేచెను
బ్రహ్మాండము ప్రతిధ్వనించెను.
"జయోస్తు జయోస్తు".
ప్రపంచము బ్రద్ద లయ్యెను
జలధులు పొంగెను ప్రళయమున
లోకము లన్నిటి నతడు లోగొనెను
నవజగతి వెలుగు చూచెను.
'సవ్వడి సలుపుచు సముద్రమునుండి
స్రవంతులు కొండల వైపు ప్రవహించెను.
బుసలు గొట్టుచు శేషుడు
కొండను చుట్టు కొనగా
సాగరము ఘోషింపగా
ఆ మహారవమున
దేవతలు స్తోత్రము చేయగా
దేవదేవుడు కడలి నుండి
పైకి తెచ్చెచు అమృతమును.[54]
'దేవదేవుడు కోరలతో
భూమిని పైకెత్తునపుడు
స్తంభించెను సప్తభువనములు
స్తంభించెను సప్తగిరులు
స్తంభించెను సప్తసముద్రములు.[55]
'ప్రళయ కాలావసరమున
అతడు భువనములు లోగొనువేళ
చలించెను చుక్కలు
జలధులు భూమియు
గ్రహములు గగనము
కొండయు గాలియు.

---

54. అమృతం కోసం దేవతలు జరిపిన సముద్ర మథనం ఈ సన్నివేశం.
55. ఇది వరాహావతార సన్నివేశం. అప్పుడు భగవంతుడు భూమిని పైకెత్తి కాపాడాడు.

'భారత యుద్ధము నాతడు ప్రారంభింపగా
ఉభయ పక్షము లందలి
క్రొవ్విన మల్లయోధులు పోరాడగా
వీర యోధులు సంఘర్షణ పడగా
ఆశ్చర్య చకితులైన సురలు
దేవలోకమున నాదములు చేసిరి.[56]

'అరుణ వర్ణాంకిత మయ్యెను పశ్చిమము
అరుణ వర్ణాంకిత మయ్యెను
దిక్కు లన్నియు.
దేవదేవుడు నరసింహుడై
కొండను చీల్చునటుల
అధిక దుఃఖమున ముంచి
అసురుని వధించెను.[57]

'అతడు లంకను బూడిద చేయగా
కొండల వలె కనిపించెను
మృత కళేబరములు.
జలధి నెత్తురై తోచెను
శరీరము నిండెను నలువైపుల.[58]

'సృష్టి జరిగెడు నాడు
క్షణములో తోచెను
పృథివి తేజములు, వాయురాకాశములు
ద్విధాగ్నులు సూర్యచంద్రులు
కొండలు మబ్బులు
వర్షము ప్రాణులు.
దేవ దేవు డా నాడు
ప్రపంచమును సృష్టించునాడు
దేవతలును తోచిరి.
'అవు లన్నియు అచటికి చేరెను
క్రూర మృగాళియు కదిలివెళ్లెను
సెలయేళ్లు నిండెను

---

56. ఇది కృష్ణావతార సన్నివేశం.
57. ఇది నరసింహావతార ఘట్టం.
58. రామావతార ఘట్టం.

జలములు ఏరులై పారెను
పెనుమ్రోత సలుపుచు.
దేవదేవు డెత్తిన కొండ
గ్రామమునకు ఆశ్రయ మయ్యెను
ఆ దయ్యపు వానకు రక్ష అయ్యెను.[59]

మరోచోట నేను సూచించినట్లుగా,[60] నమ్మాళ్వారు దృష్టిలో భగవంతుడు కేవలం అగోచరుడు కాదు. అనిర్వచనీయుణ్ణి ఆయన అస్పష్టమైన భాషలో నిర్వచించాడనడం సత్యసన్నిహితం. కాని ఆయన తన యిష్టదైవాన్ని సౌందర్యవారాశిగా కరుణామూర్తిగా భావించాడు. భగవంతుని శంఖచక్రాలను, స్వర్ణకిరీటాన్ని, పద్మనయనాలను, లేదా నీలోత్పల నేత్రాలను, మణివర్ణ శరీరుడనీ లేదా నీలమేఘ శ్యాముడనీ నీలజలధి వంటి వాడనీ — ఇలా మాటిమాటికి భావించి ఆయన ఆనంద పరవశుడవుతాడు.

'దేవా! చెప్పుము
నీ వదన వైభవము
ప్రతిఫలించెనా నీ స్వర్ణ మకుటమున ?
నీ పాదముల ప్రకాశము
వికసించెనా నీవు నిలిచిన పద్మముగా ?
నీ మేని కాంతియే
మారెనా స్వర్ణదుకూలములుగా ?
ధరించిన మణిభూషలుగా ?'[61]

ఆ సౌందర్యవారాశి దర్శన భాగ్యంతో పరబ్రహ్మాన్వేషణ సందర్భంగా ఆళ్వారు పడినపాట్లు తొలగినట్లు అయ్యాయి. తన చుట్టూరా ఉన్న లోకపు సౌందర్యాన్ని - భగవంతుడు నెలకొన్న వివిధ దివ్య క్షేత్రాల సౌందర్యం - ఆయన గ్రహించాడు.

---

59. కృష్ణావతారంలో, క్రోధమనస్కుడైన ఇంద్రుడు పెనువాన కురిపించగా, కృష్ణుడు గోవర్ధనగిరిని పైకెత్తాడు. నలుగురికీ రక్షణ కల్పించాడు. ఇక్కడ గ్రామం అంటే గోకులం.

60. నమ్మాళ్వారు తాత్త్విక చింతనను చూడుడు.

61. తిరువాయ్‌మొళి : 3. 1. 1.

'జలసమృద్ధి కలిగి, ఎర్రనివరి అంకురాలు వీవనలవలె వీయగా, మడుగులలోని ఎర్రతామరలు కళ్లు విప్పగా అలరారే'[62] తిరుకుడంద్లై,[63]

'చారల తుమ్మెదలు మధుగీతికలు పాడే తిరువల్లవాళ్,[64]

'బురదవాగులో పద్మం వెలిజిమ్మే అగ్నిగల తిరువేంకటం,[65]

'పొలాలలో మిలమిల మెరుస్తూ చేపపిల్లలూ నదిలో పగడాల గవ్వలూ గల తిరుప్పుళింగుడి[66] మొదలైన.

దివ్యక్షేత్రాలే కాదు అఖిల ప్రపంచమే నమ్మాళ్వారుకి ఒక దివ్య క్షేత్రం.[67] ప్రకృతి సౌందర్యం అనంత సౌందర్యాన్ని గుర్తు చేస్తూ వుంటుంది. ఎటువైపు తిరిగినా ఆయన ఆ సౌందర్యాన్ని దర్శించాడు. పద్మాలు, నీలోత్పలాలు, సముద్రం, ఆకాశం, కొండలు, వానలు, - ప్రకృతిలో కానవచ్చే ప్రతిదీ ఆయనకి భగవంతుని వునికిని గుర్తు చేసింది. పంచ భూతాలు, బ్రహ్మాండం, వాయువు, అగ్ని, జలము, భూమి - మొదలైనవి భగవంతుని ఆకృతులుగానే తోచాయి. పరబ్రహ్మాన్వేషకుడైన నమ్మాళ్వారు నిత్యుడైన భగవంతుని సౌందర్యాన్ని భౌతిక ప్రపంచంలో దర్శించాడు; అది కవితగా రూపు దాల్చింది. ఋషిపరంగా చూసినా యిది అసంగతమైన విషయం కాదు. పైపెచ్చు ఆచార్యుని హృదయం ఈ విషయాన్ని గ్రహిస్తుంది. కాగా ఆళ్వారుని కవి అని మనం వ్యవహరించినప్పుడు, అన్నీ చెప్పినట్టే అవుతుంది. ఆయన ఋషి, ముని, జీవన్ముక్తుడు అని వేరుగా చెప్పనవసరం లేదు.

ప్రతీకల సహాయం లేకుండా ఆయనే ముఖాముఖి మాట్లాడినట్లుగా కూడా మనం భావించవచ్చు. ఇందుకు తిరువాయ్‌మొళిలోని పెక్కుదశకాలు సాక్ష్యాలు. అవి విషయ వైవిధ్యం కలవి. భగవంతుడితో మొరపెడతాడు. ప్రశ్నలు మీద ప్రశ్నలు కురిపిస్తాడు. తన నిరాశా నిస్పృహలు వ్యక్తం చేస్తాడు. అన్వేషణలో యాతనలు ఎదుర్కొంటాడు. చివరికి దర్శన భాగ్యం పొందినప్పుడు ఆనంద పరవశుడవుతాడు.[68] తిరువాయ్‌మొళిలోని కొన్ని దశ కాలలోనూ తిరువాసిరియంలోని కొంత భాగంలోనూ ఆళ్వారు భగవంతుడికీ లోకానికీ సంబంధించిన కొన్ని అస్పష్ట సత్యాలను నిర్దుష్టంగా పేర్కొంటాడు. ఈ విషయాలకు సంబంధించిన కవితలలో ఎంతో శ్రద్ధ,

62. తిరువాయ్‌మొళి: 5. 8. 1. 2.

63. ఇది తంజావూరు జిల్లాలోని కుంభకోణం.

64. తిరువాయ్‌మొళి : 5. 9. 9. 65. పైదే : 6. 10. 12.

66. పైదే : 9. 2. 9. 5. 67. 'నమ్మాళ్వారు తాత్త్విక చింతన' చూడండి.

68. పరబ్రహ్మాన్వేషణ, నమ్మాళ్వారు తాత్త్విక చింతన అధ్యాయాలు చూడండి.

మితభాషిత్వం కనిపిస్తాయి. ఈకోవకు చెందిన సందర్భాలలో కూడా ఒక భావాన్ని ఉదాహరణాత్మకంగా వ్యక్తీకరించేటప్పుడు ప్రతీక ఏదోవిధంగా చోటు చేసుకుంటుంది. 'భగవంతుడు సర్వవ్యాపకుడు' అనే భావాన్ని ఆళ్వారు వ్యక్తీకరించాడనుకుందాం. అప్పుడు ఆయన దృష్టి ఒక వస్తువుని దాటి మరో వస్తువుని చేరుతూ పయనిస్తుంది.

'శీతల విశాల సింధువులో
ప్రతి బిందువులో,
భూమ్యా కాశములలో
ప్రతి చోటను,
ప్రపంచములో దాని కావలను
కనిపించు ప్రతి వస్తువులో,
అత డున్నాడు
దాగి యున్నాడు
అదృశ్యుడై యున్నాడు
ఇవి యన్నియు లోగొని యున్నాడు.'[69]
'నిత్యమౌ శూన్య స్థలములో
అగ్నిలో వాయువులో
భూమిలో జలములో
అవి సృష్టించెడు
అనంత వస్తువులలో
దేహములో ప్రాణమువలె
అన్నిటా అత డున్నాడు
అదృశ్యుడై యున్నాడు
వేద వేద్యుడైన యాతనిలో
సర్వమూ లీనమై అంత మొందు.'[70]

ప్రతీకలా, భావం తరుచుగా తాత్త్వివిక నిర్వచనంగా కూడా వెలువడుతూ వుంటుంది. భగవంతుడు మాయ అనే భావాన్ని విశదీకరిస్తాడు. దానికి ఇలా కవిత్వా కృతి కల్పిస్తాడు.

నిశ్చల బుద్ధి సంపన్నులు
విమల విజ్ఞాను లౌ
దేవతలను సైతము

69. తిరువాయ్‌మొళి : 1. 1. 10. 70. పైదే : 1. 7.

తికమక పెట్టు నతడు.
అతడు సృష్టించు భ్రమలు
ఆకాశము కంటెను విశాలములు.'[71]

భావాన్ని కవిలా వ్యక్తీకరించాడు. ఆ మరుక్షణమే భావోద్వేగానికి వశుడవుతాడు.

'అతడు నీలమేఘశ్యాముడు
లోకములను కొలిచిన
ఆ పాద పద్మములను
నే నెన్నటికీ విస్మరింపను.
వాటిని ప్రశంసింతు
వచ్చియు రాని మాటలలో.
వాటిని చేర్చుకొని యెదకు
కొలిచెద సతము.'[72]

నమ్మాళ్వారు కృతుల్ని మూలంలో చదవలేని వారికి ఆయన శైలిని గురించి చెప్పడం అర్థరహితం. ఆయనది మధ్య తమిళం, దక్షిణ తమిళనాడు మాండలికం కలిసిన తమిళం. అది శక్తిమంతమూ ఉత్సాహభరితమూ అయిన తమిళం. సూటిగా చెప్పడానికీ భావ తీవ్రతను తెలియజేయడానికీ ఉపకరించేది. శ్రవణసుభగత్వం గల భాగాలు ఎన్నో ఉన్నా, ఆయనది సమత గల శైలి కాదు. అలల కడలినీ బండరాయినీ స్ఫురింపజేసే కాఠిన్యం కనిపించినా, అది గంభీరమూ శక్తిమంతమూను. పైగా నమ్మాళ్వారు వృత్త వైవిధ్యం ప్రదర్శించాడు. వెణ్బాలు, కట్టళై కలిత్తు రైలు చాలా ఉపయోగించాడు. అద్భుతమైన ఆసిరియం వాడాడు. శ్రద్ధాసక్తులు గల రచయితలో ఉండే అభినివేశం వాటిలో లేదనడం నిజం. అయితే కవి మాత్రం చెప్పగలిగే వేగం వాటిలో ఉంది.

నమ్మాళ్వారు కవి. అయితే కావాలని కవి కాలేదు ఆయన. తన ఆధ్యాత్మికానుభవానికి వాగ్రూపం ఇవ్వదలచి కవి అయ్యాడు. ఆ అనుభవం ఆయన రక్తం హృదయం ఆత్మ మొదలైనవాటిలో జీర్ణించుకు పోయింది. దాన్ని ప్రతీక, సుభాషితాల ద్వారాను ప్రకృతి, మానవ జీవితాలకు సంబంధించిన పెక్కు విషయాల ద్వారాను వ్యక్తం చేశాడు. కాగా భూమ్యాకాశాలు కలిపి మానవ జీవితం, ఏకకాలంలో, అన్వేషణ భరితమూ పవిత్రమైనదీ అనే నవ్యదృష్టిని తమిళ సాహిత్యానికి ఆయన ప్రసాదించాడు.

71. తిరువాయ్‌మొళి : 1. 3. 10. 72. పైదే : 1. 3. 10.

Indian I... ...nce
11769.0
20/12/04

తమిళనాడులో ప్రభవించిన భక్తకవులలో నమ్మాళ్వారుకి సమున్నతమైన స్థానం ఉంది. 'కవులారా! రండి; కష్టపడి జీవించండి. మీ చెమటతో మీరు భుజించండి. ఎందుకు కీర్తిస్తారు ధనవంతుని? ఈ లోకంలో ఎవరు నిజంగా ధనవంతుడు? ఎవ్వరూ లేరు. మీ అభిమాన దైవాన్ని కీర్తించండి' అని ఆయన ఉద్బోధించాడు.

ఈ చక్కని రచనలో కీర్తిశేషులు ఆచార్య అ. శ్రీనివాస రాఘవన్ ఆళ్వారులనూ ముఖ్యంగా నమ్మాళ్వారునీ పాఠకలోకానికి పరిచయం చేశారు. నమ్మాళ్వారు నాలుగు కృతుల్నీ విపులంగా చర్చించారు. నమ్మాళ్వారు ఆంతరిక జీవితం, ఆయన కృతులవల్ల తెలియవచ్చే పరబ్రహ్మాన్వేషణ, ఆయన తాత్త్విక చింతన, కవిత్వం మొదలైనవాటిని తెలియజేశారు.

నమ్మాళ్వారు కవిత గురించీ వ్యక్తిత్వం గురించీ జీవితకాలం తాను చేసిన అధ్యయనాన్ని రచయిత యీ పుస్తక రచనకు వినియోగించారు. ఈ పుస్తక పరిధికి లోబడి ఆయన నమ్మాళ్వారుని భక్తునిగా, దివ్యగాయకునిగా, ఉత్తేజితుడైన కవిగా రమణీయంగా చిత్రించారు. నమ్మాళ్వారు కవిత అనువాదానికి లోబడకపోయినా, చాలా అనువాదాలు ఇందులో పొందుపరచబడ్డాయి.

SAHITYA AKADEMI
REVISED PRICE Rs.15.00

ముఖచిత్రం: సత్యజిత్ రే.

ముఖచిత్రం: తమిళనాడు ప్రభుత్వం వారి ఆర్కియాలజీ డైరెక్టరుగారు ఇచ్చిన ఛాయాచిత్రాన్ని ఆధారంగా చేసుకుని ఆనంద్ రచించినది.

Library IIAS, Shimla
TL 891.481 015 2 N 152 R
00117690